Crime News

# ది క్రైమ్ న్యూస్

తెలుగు దినపత్రిక

ఆదివారం, ఆగస్టు 23, 2026 | సంపుటి - 20 | సంచిక 324 | వెల - 4రూ | పేజీలు - 12

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.


## హర్మ్యూజ్‌పై ట్రంప్ కొత్త మెలిక

### ఇరాన్‌కు సాయం చేసే దేశాలపై ఆంక్షలు



వాషింగ్టన్ : పశ్చిమాసియాలో అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరోసాయి తారా స్థాయికి చేరేలా ఉన్నాయి. హర్మ్యూజ్ జలసంధి విషయంలో ఇరుదేశాలు పట్టువీడక పోవడమే అందుకు కారణం. హర్మ్యూజ్‌ను తమ భూభాగంగా ప్రకటించిన డొనాల్డ్ ట్రంప్ టెహ్రాన్‌పై ఆర్థికపరమైన ఆంక్షలు విధిస్తామని హెచ్చరించారు. అయినా సరే ఇరాన్ మాత్రం వెరవడం లేదు. 2లో



## రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం మోకాలడ్డు

### సిఎం అమెరికా పర్యటన తిరస్కరించడం నిరంవకుశం

### మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శలు

సిద్దిపేట : తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అడ్డంకులు సృష్టిస్తోందంటూ బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సీరియస్ అయ్యారు. రాష్ట్ర అభివృద్ధి కోసం విదేశీ పర్యటనకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెళ్తే అనుమతి నిరాకరించడం కేంద్రం నిరంకుశత్వానికి నిదర్శనమని మండిపడ్డారు. ఈ సందర్భంగా కేంద్రం తీరుపై మంత్రి అసహనం వ్యక్తం చేశారు. దీనిపై బీజేపీ రాష్ట్ర నాయకత్వం సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. పల్లె పల్లెలెకు పొన్నం అన్న- ప్రజా పాలన' కార్యక్రమంలో భాగంగా సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలంలో మంత్రి పొన్నం పర్యటించారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చెబుతున్న 'వికసిత్ భారత్-2047' లక్ష్యం నెరవేరాలంటే ప్రతి రాష్ట్రం అభివృద్ధి చెందాలని పేర్కొన్నారు. ఈ మేరకు తెలంగాణకు న్యాయంగా రావాల్సిన ఆర్థిక సహకారం, నిధుల విషయంలో కేంద్రం సానుకూలంగా వ్యవహరించాలని అన్నారు. ఎన్డీయే ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు, ప్రాజెక్టుల కోసం రాష్ట్ర బీజేపీ నాయకులు ఎందుకు గళమెత్తడం లేదని మంత్రి ప్రశ్నించారు. కేంద్రం పక్క రాష్ట్రాలకు నిధులు ఇస్తున్నప్పుడు 2లో



## తెలంగాణలో విద్యా, పరిశోధనలకు కేంబ్రిడ్జ్ సహకారం

### యూనివర్సిటీ ప్రతినిధులతో సిఎం రేవంత్ చర్చలు

### హైదరాబాద్‌లో విద్యావ్యవస్థ పటిష్టతకు అంగీకారం

హైదరాబాద్ : తెలంగాణలో విద్య, పరిశోధన, ఆవిష్కరణలు, స్టార్టప్ రంగాలను మరింత బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో తెలంగాణ రైజింగ్ ప్రతినిధులు కేంబ్రిడ్జ్ యూనివర్సిటీకి చెందిన విద్యావేత్తలు, ప్రతినిధులతో సమావేశమై పలు అంశాలపై విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా విద్య, పరిశోధన రంగాల్లో పరస్పర సహకారం, అంతర్జాతీయ స్థాయి విద్యా కార్యక్రమాలను హైదరాబాద్‌లో నిర్వహించడం, సంయుక్త పరిశోధనలకు అవకాశాలు కల్పించడం వంటి అంశాలపై చర్చ జరిగింది. హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి విజ్ఞాన, పరిశోధన, ఆవిష్కరణల కేంద్రంగా తీర్చిదిద్దాలన్న తెలంగాణ ప్రభుత్వ లక్ష్యాలను ప్రతినిధులు కేంబ్రిడ్జ్ బృందం దృష్టికి తీసుకెళ్లారు. హైదరాబాద్‌లో విద్యా కార్యక్రమాలు నిర్వహించేందుకు కేంబ్రిడ్జ్ ఆసక్తి చూపినట్లు తెలుస్తోంది. తెలంగాణలో ఉన్న మానవ వనరులు, సాంకేతిక సామర్థ్యాలు, పరిశ్రమలు, స్టార్టప్ పర్యావరణ వ్యవస్థపై కూడా సమావేశంలో వివరించారు. అదేవిధంగా సంయుక్త పరిశోధనా ప్రాజెక్టులు, ఇంక్యుబేషన్ కార్యక్రమాలు, స్టార్టప్‌ల అభివృద్ధి, యువ పారిశ్రామికవేత్తలకు మార్గదర్శకత్వం, అంతర్జాతీయ స్థాయి అవకాశాలు కల్పించడం వంటి అంశాలపై ఇరుపక్షాలు చర్చించాయి. 2లో

## సుస్మిత వ్యాఖ్యలపై కాంగ్రెస్ సీరియస్

### కాంగ్రెస్‌కు నష్టం కలుగుతుంటే చూస్తూ ఊరుకోం

### హెచ్చరించిన పిసిసి చీఫ్ మహేశ్ గౌడ్



హైదరాబాద్ : మంత్రి కొండా సురేఖ కూతురు సుస్మిత సీఎం రేవంత్‌రెడ్డిపై ఇటీవల చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ హై కమాండ్ సీరియస్‌గా తీసుకుంది. ఈ క్రమంలోనే సుస్మిత వ్యాఖ్యల వీడియోను కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ పరిశీలించింది. ఈ సందర్భంగా టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీకి నష్టం కలుగుతుంటే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. కొండా సుస్మిత లైన్ దాటి ఆరోప ణలు చేశారని అన్నారు. అనిరుధ్, కోమటిరెడ్డి రాజ్‌గోపాల్‌రెడ్డి హద్దు మీరలేదని చెప్పారు. పార్టీ లైన్ ఎవరు దాటినా చర్యలు తప్పవని మహేశ్‌గౌడ్ పేర్కొన్నారు. కొండా సురేఖ విషయంలో మరోసారి సమావేశం నిర్వహిస్తామని క్రమ శిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి పేర్కొన్నారు. కొండా సురేఖ వివరణ చదివామని తెలిపారు. తరువాయి 2లో



## రోడ్లు, బ్రిడ్జి పనుల్లో వేగం పెంచాలి

### అధికారులకు మంత్రి కోమటిరెడ్డి సూచన

హైదరాబాద్ : రాష్ట్రంలో సీఆర్ఐఎఫ్ రోడ్లు, సేతుబంధన్, రైలు ఓవర్ బ్రిడ్జ పనుల్లో వేగం పెంచాలని ఉన్నతాధికారులను మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆదేశించారు. శనివారం సచివాలయంలో రోడ్లు, భవనాల శాఖ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఉమ్మడి జిల్లాల్లో నియోజకవర్గాల వారీగా పనుల పురోగతి మరింత మెరుగుపడాల్సి ఉందన్నారు. ఇప్పటి వరకు 3,918 కి.మీ రోడ్లకు రూ.5,159 కోట్లతో 316 పనులు తరువాయి 2లో




## మానవీయ కోణంలో అమలవుతున్న రేషన్ పథకం

### సన్నబియ్యంతో పేదలకు కడుపునిండా తిండి

### కేంద్రం దేశవ్యాప్తంగా ఈ పథకం అమలు చేయాలి

### స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీలో కడియం శ్రీహరి

జనగామ : మానవీయ కోణంలో అమలు చేస్తున్న గొప్ప పథకం సన్న బియ్యం పంపిణి పథకం అని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. దేశంలోనే మొట్ట మొదటి సారిగా స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణి చేస్తున్న రాష్ట్రం తెలంగాణ అని అన్నారు. కోటి 06లక్షల రేషన్ కార్డుల ద్వారా 3కోట్ల 10లక్షల మందికి ఉచిత సన్న బియ్యం 2లో



## 'గొడ్డలి పార్టీ' చెప్పేది ఒకటి.. చేసేది మరొకటి

### టిడిపి శ్రేణులు ఐక్యంగా వైసిపిని అడ్డుకోవాలి

### టిడిపి కేడర్ సమావేశంలో లోకేశ్

విజయనగరం : టీడీపీ నియోజకవర్గ కేడర్ సమావేశంలో మంత్రి నారా లోకేశ్ వైసీపీపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. డీఎస్సీకి, ఏపీపీఎస్సీకి తేడా తెలియని వ్యక్తి తరువాయి 2లో



## 3 దశాబ్దాల వెలిగొండ కల సాకారం

### ఆగస్టు 31న వెలిగొండ ద్వారా నీళ్లు విడుదల

### మూడో విడతలో రూ.250 కోట్ల పరిహారం అందించిన సీఎం

### నిర్వాసితులకు చెక్కును అందజేసిన ముఖ్యమంత్రి

### 48 రోజుల్లో రూ.768 కోట్లు చెల్లించిన కూటమి ప్రభుత్వం

అమరావతి : మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల ప్రజల 30 ఏళ్ల ఆకాంక్షలు నెరవేరేలా వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశ ప్రారంభం కానుంది. ఆగస్టు 31వ తేదీన వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశను ప్రారంభించి నీళ్లు విడుదల చేస్తామని ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు ప్రకటించారు. క్యాంపు కార్యాలయంలో శుక్రవారం వెలిగొండ నిర్వాసితులకు మూడో విడతలో రూ.250 కోట్ల పరిహారం చెక్కును సీఎం చంద్రబాబు అందించారు. దీంతో ఇప్పటి వరకూ 6,206 నిర్వాసిత కుటుంబాలకు రూ.768 కోట్లను ప్రభుత్వం చెల్లించింది. మొదటి విడతలో 2,557 కుటుంబాలకు రూ.318 కోట్లు, రెండో విడతలో 1,622 కుటుంబాలకు రూ.200 కోట్లను ప్రభుత్వం చెల్లించింది. శుక్రవారం మూడో విడతగా 2,027 కుటుంబాలకు రూ.250 కోట్లు పరిహారాన్ని సీఎం చేతుల మీదుగా అందించారు. 48 రోజుల్లోనే నిర్వాసితులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.768 కోట్లను చెల్లించింది. నిర్వాసితులకు మరో రూ.132 కోట్లు మాత్రమే చెల్లించాల్సి ఉంది. వెలిగొండ ప్రాజెక్టు తొలిదశ ద్వారా మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లోని 1.19 లక్షల ఎకరాల ఆయకట్టుకు, 4 లక్షల మందికి తాగునీరు అందనుంది. వెలిగొండ నిర్వాసితులతో తరువాయి 2లో

## ఫ్లోరైడ్ జిల్లాలకు వరంగా వెలిగొండ



### ఆయా ప్రాంతా ప్రలజ నీటి కష్టాలు తొలగిపోతాయి

### మంత్రి నిమ్మల రామానాయుడు

అమరావతి : ప్రకాశం, కడప, నెల్లూరు జిల్లాల్లోని కరవు, ఫ్లోరైడ్ బాధిత ప్రాంతాలకు వెలిగొండ ప్రాజెక్టు వరమని ఆంధ్రప్రదేశ్ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా ఆయా ప్రాంతాల ప్రజల నీటి కష్టాలు తీరుతాయని పేర్కొన్నారు. 4.47 లక్షల ఎకరాలకు సాగునీరు, 23 లక్షల మందికి తాగునీరు అందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తరువాయి 2లో

# హర్మూజ్‌పై ట్రంప్ కొత్త మెలిక

మరోసారి తమను భయపెట్టాలని చూస్తే విధ్వంసకరంగా బదులిస్తామని పేర్కొంది టెహ్రాన్. ఆరు నెలలకు పైగా ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రభాం చూపిస్తోంది ఇరాన్ ? ఇజ్రాయేల్ ? అమెరికా యుద్ధం. అంతర్జాతీయ జల రవాణాలో కీలకమైన హర్మూజ్ జలసంధిపై ఇరాన్ పట్టు వదులుకునేందుకు సిద్ధంగా లేకపోవడం.. అమెరికా మాత్రం ఆ జలసంధిని తమ భూభాగంగా ప్రకటించడం తాజాగా మరింత ఉద్రిక్తతలకు ఆజ్యం పోశాయి.

# ఫ్లోరైడ్ జిల్లాలకు వరంగా వెలిగొండ

ఈ సందర్భంగా ఆగస్టు 31న వెలిగొండను సీఎం చంద్రబాబు ప్రారంభిస్తారని స్పష్టం చేశారు. ఉండవల్లిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి నిమ్మల మాట్లాడారు. ఈ సందర్భంగా ఆగస్టు 31న వెలిగొండ టన్నెల్స్ నుంచి 10.5 టీఎంసీల కృష్ణా జలాలను నల్లమల సాగర్‌కు సీఎం చంద్రబాబు విడుదల చేస్తారని మంత్రి నిమ్మల తెలిపారు. ప్రాజెక్టు కోసం భూములిచ్చిన త్యాగధనులకు పరిహారం ఇచ్చాకే నీళ్లు వదలాలని చంద్రబాబు చెప్పారన్నారు. ఈ మేరకు 40 రోజుల్లోనే మూడు దశల్లో రూ.760 కోట్లను వెలిగొండ నిర్వాసితులకు ఇచ్చామని పేర్కొన్నారు. అధికారం చేపట్టిన రెండేళ్ల వ్యవధిలోనే ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్వాసితులకు రూ.3 వేల కోట్లు పంపిణీ చేశామన్నారు. వెలిగొండలో అర్హత ఉన్న ఆఖరి నిర్వాసితుడి వరకు న్యాయం చేస్తామని మంత్రి నిమ్మల చెప్పుకొచ్చారు. ÷లిగొండ పనులు పూర్తి కాకుండానే వైఎస్ జగన్ నాడు ప్రాజెక్టును జాతికి అంకితం చేసి ప్రకాశం జిల్లా ప్రజలను మోసం చేశారని నిమ్మల మండిపడ్డారు. ఈ సందర్భంగా మూడు దశాబ్దాల కలను సీఎం చంద్రబాబు నిజం చేస్తున్నారని ప్రశంసించారు. ఎల్-నినో వంటి క్లిష్ట సమయంలోనూ నల్లమల సాగర్‌కు 10.5 టీఎంసీల జలాలను తీసుకొస్తున్నామని ధీమా వ్యక్తం చేశారు. భవిష్యత్తులో వెలిగొండ నీళ్లతో ప్రకాశం జిల్లా సస్యశ్యామలం అవుతుందని మంత్రి ఆకాంక్షించారు. కాగా, ఈరోజు వెలిగొండ నిర్వాసితులకు రూ.250 కోట్లను మూడో విడత కింద సీఎం చంద్రబాబు విడుదల చేశారు.

# సుష్మిత వ్యాఖ్యలపై కాంగ్రెస్ సీరియస్

కొండా సుస్మిత మాటల వీడియోలను చూశామని చెప్పారు. ముఖ్యమంత్రిపై సుస్మిత అనుచిత వ్యాఖ్యలు చేశారని అన్నారు. మంత్రి సురేఖ వివరణపై మరోసారి సమావేశం కావాలని భావించామన్నారు. క్రమశిక్షణ కమిటీకి మరి కొందరు ఎమ్మెల్యేలు మరిన్ని వివరాలు ఇస్తామన్నారని చెప్పారు. అలాగే, చిన్నారెడ్డి వివరణ లేఖ చదివామని మల్లు రవి అన్నారు. చిన్నారెడ్డి వ్యాఖ్యల వీడియోలు చూశామని తెలిపారు. చిన్నారెడ్డి విషయంలో ఎమ్మెల్యే మేఘారెడ్డితో మాట్లాడతామని అన్నారు. చిన్నారెడ్డి వ్యాఖ్యలకు, మేఘారెడ్డి ఫిర్యాదుకు చాలా అంతరం ఉందని చెప్పారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి మాట్లాడిన అంశాలు తనకు తెలుసని.. కానీ ఒక ప్రాసెస్ ప్రకారం విచారణ ఉంటుందని మల్లురవి తెలిపారు. ఆయా వ్యక్తులపై తమకు ఎలాంటి అభిప్రాయం ఉండదని చెప్పారు. పార్టీనే తమ మొదటి ప్రాధాన్యం అని స్పష్టం చేశారు. ఆదిలాబాద్ ఇన్‌చార్జ్ కంది శ్రీనివాస్ వివరణ లేఖ తమకు అందిందని మల్లురవి తెలిపారు. తన వ్యాఖ్యలపై కంది శ్రీనివాస్ విచారం వ్యక్తం చేశారని అన్నారు. ఆదిలాబాద్ డీసీసీ అధ్యక్షుడిని ఫోన్‌లో సంప్రదించే ప్రయత్నం చేశామని చెప్పారు. కంది శ్రీనివాస్ రెడ్డి అంశాన్ని సైతం మరోసారి కూర్చొని మాట్లాడతామని మల్లురవి పేర్కొన్నారు.

## రోడ్లు, బ్రిడ్జి పనుల్లో వేగం పెంచాలి

మంజూరు అయ్యాయని వివరించారు. 2025-26లో రూ.868 కోట్లతో 422.36 కి.మీ రోడ్ల పనులు చేపట్టామని తెలిపారు. హై లెవెల్ బ్రిడ్జిలు, పనులు నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. మిర్యాలగూడ, నంది పహాడ్ బ్రిడ్జి పనులు వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. నార్కట్‌పల్లి బ్రిడ్జి పనుల పురోగతిపై ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి సంతృప్తి వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో మరింత కష్టపడి పని చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. డిసెంబర్ నాటికి సచివాలయంలో సోలార్ కార్ పార్కింగ్ పనులు పూర్తి చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. రూ.26.81 కోట్ల అంచనా వ్యయంతో సోలార్ కార్ పార్కింగ్ పనులు చేపడుతున్నట్లు చెప్పారు. సోలార్ పార్కింగ్‌తో సచివాలయానికి 90 వేల యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుందని వివరించారు. దీంతో నెల వారీ విద్యుత్ బిల్లులో 16 శాతం ఆదా అవుతుందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వెల్లడించారు.

# పూర్తిస్తాయి వైద్య కేంద్రాలుగా కమ్యూనిటీ ఆస్పత్రులు

### టీచింగ్ హాస్పిటళ్లలో 607 అసిస్టెంట్ ప్రొఫెసర్ల భర్తీ

### వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

హైదరాబాద్,ఆగస్ట్22 : ఆయా కమ్యూనిటీ, ఏరియా, జిల్లా ఆస్పత్రులను పూర్తిస్థాయి వైద్య కేంద్రాలుగా అభివృద్ధి చేస్తామని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ వ్యాఖ్యానించారు. జిల్లా, ఏరియా ఆస్పత్రుల్లోనూ మేజర్ సర్జరీలు అందుబాటులోకి తీసుకువచ్చామని పేర్కొన్నారు. శనివారం సచివాలయంలో మీడియాతో మంత్రి దామోదర్ మాట్లాడారు. టీచింగ్ హాస్పిటళ్లలో 607 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేస్తామని తెలిపారు. జిల్లా, ఏరియా ఆస్పత్రులు, 1,616 మంది స్పెషలిస్ట్ డాక్టర్లను నియమిస్తామని చెప్పారు. చిన్న సమస్యలకే పెద్ద ఆస్పత్రులకు రిఫర్ చేయొద్దని ఆదేశించారు.అవసరమైతేనే పేషెంట్లను పై స్థాయి ఆస్పత్రులకు రిఫర్ చేయాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ సూచించారు. అత్యవసర రిఫరల్‌కు ముందు సంబంధిత ఆస్పత్రికి సమాచారం ఇవ్వాలని సలహా ఇచ్చారు. అవసరమున్న ఆస్పత్రుల్లో కొత్త సీటీ స్కాన్లు, వైద్య పరికరాలను అందుబాటులో ఉంచుతామని అన్నారు. పరికరాల ప్రతిపాదనలకు రోగుల సంఖ్య, అవసరంపై జస్టిఫికేషన్ తప్పనిసరని చెప్పారు. డీసీహెచ్‌ఎస్‌లు వారానికి కనీసం ఒకరోజు ఆకస్మిక తనిఖీలు చేయాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు. డీసీహెచ్‌ఎస్‌లు విధులకు గైర్హాజరు, విధుల నుంచి ముందే వెళ్లిపోతే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఆయా ఆస్పత్రుల్లో సమస్యలను ముందుగానే గుర్తించి పరిష్కరించాలని అన్నారు. పరిశుభ్రత, తాగునీరు, బయోమెడికల్ వేస్ట్‌పై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. ప్రతి నెలా డీసీహెచ్‌ఎస్‌ల వర్క్ రిపోర్ట్ ప్రభుత్వానికి సమర్పించాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు.

# కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఏనాడు మాట్లాడలేదు: చిన్నారెడ్డి

హైదరాబాద్,ఆగస్ట్22 : వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి ఇచ్చిన ఫిర్యాదుతో కాంగ్రెస్ రాష్ట్ర క్రమశిక్షణ వ్యవహారాల కమిటీ ఇచ్చిన షోకాజ్ నోటీసులపై ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి స్పందించారు. తానేం తప్పుగా మాట్లాడలేదని లేఖలో పేర్కొన్నారు. 'ఏ రోజూ నేను పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడలేదు. ఎవరిపైనా అనుచిత వ్యాఖ్యలు చేయలేదు. రెండున్నరేళ్లుగా కార్యకర్తల ఆవేదనను వ్యక్తంచేశా. స్థానిక ఎమ్మెల్యే వ్యవహారం ఒంటెద్దుపోకడలా ఉంది. నేతలు, కార్యకర్తలు పడుతున్న ఆవేదననే తెలిపా. పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడాలనే ఉద్దేశం నాకు లేదు. పార్టీకి నష్టం కలిగించేవారిని ప్రశ్నించడమే నా ఉద్దేశం. నాపై వచ్చిన ఆరోపణలు అవాస్తవం. వాటిపై విచారణ జరిపి న్యాయం చేయాలి' అని లేఖలో పేర్కొన్నారు.

# తెలంగాణలో విద్యా, పరిశోధనలకు కేంబ్రిడ్జ్ సహకారం

తెలంగాణ యువతలో ఉన్న ప్రతిభను ప్రపంచస్థాయి వేదికలకు తీసుకెళ్లేందుకు కేంబ్రిడ్జ్ సహకారం అందించడంపై సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. తెలంగాణలో విద్య, పరిశోధన, ఆవిష్కరణలకు ఉన్న అవకాశాలపై కేంబ్రిడ్జ్ విద్యావేత్తలు సానుకూల అభిప్రాయం వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో చేపట్టాల్సిన కార్యక్రమాలపై స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, భాగస్వామ్యాన్ని ఆచరణలోకి తీసుకురావాలని ఇరుపక్షాలు అంగీకరించాయి. ఈ భాగస్వామ్యం ద్వారా హైదరాబాద్‌ను అంతర్జాతీయ విద్యా, పరిశోధన, స్టార్టప్ హబ్‌గా అభివృద్ధి చేయడంతో పాటు తెలంగాణ యువతకు ప్రపంచస్థాయి అవకాశాలు మరింత అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

# 3 దశాబ్దాల వెలిగొండ కల సాకారం

ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. "ఆయా జిల్లాల ప్రజల 30 ఏళ్ల కలను సుసాధ్యం చేసి చూపించాం. సీఎంగా 1995లో ఆ ప్రాంతానికి వెళ్లినప్పుడు రైతులు సాగు, తాగునీరు ఇవ్వాలని కోరారు. 1996లో నేనే ప్రాజెక్టుకు రూపకల్పన చేసి శంకుస్థాపన చేసి... 2026లో ప్రారంభిస్తున్నాను. వెలిగొండ ప్రాజెక్టు తొలిదశ పూర్తి చేసి ఇప్పుడు ప్రారంభించేలా రెండేళ్లలో రూ.2,250 కోట్లు ఖర్చు చేశాం. నాడు ఎన్టీఆర్ శంకుస్థాపన చేసిన వివిధ ప్రాజెక్టులను పూర్తి చేసి ప్రారంభించటం నా అదృష్టం. ఈ ఏడాది ఎల్ నినో కారణంగా 50 శాతం లోటు వర్షపాతం ఉంది. శ్రీశైలం, నాగార్జున సాగర్‌లకు నీళ్లు రాలేదు. చాలా పొదుపుగా నీటిని వినియోగించుకోవాల్సి ఉంది. ఇబ్బందులు ఉన్నా ఎట్టి పరిస్థితుల్లోనూ వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేసి నీరు ఇవ్వాలని సంకల్పించుకున్నాం. 2021లోనే దీనిని పూర్తి చేసి నీరివ్వాల్సి ఉన్నా గత పాలకులు చేసిన డ్రామాలతో అది సాధ్యం కాలేదు. పోలవరం పూర్తి చేసి కృష్ణాడెల్టాకు, శ్రీశైలంలో నీరు పొదుపు చేసి ప్రకాశం, నెల్లూరు, కడప, రాయలసీమ ప్రాంతానికి నీరు ఇవ్వొచ్చు. గంగా-గోదావరి- కావేరి అనుసంధానించాలని సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశంలో ప్రతిపాదించాను. ఐదు నదులను అనుసంధానిస్తే నాలుగు రాష్ట్రాల్లో సమస్యలు తీరిపోతాయి. దేశానికే నీటి సమస్య పరిష్కారమై నీటి భద్రత వస్తుంది. వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు మేలు జరిగేలా ప్రయత్నం చేస్తున్నాం. ఈ నెల 31 తేదీన వెలిగొండ ద్వారా నీళ్లు విడుదల చేస్తాం. మార్కాపురం జిల్లాలో జల్ జీవన్ మిషన్ ద్వారా ప్రతీ ఇంటికి కుళాయి నీరు ఇస్తాం. సెప్టెంబరులోనే హార్టికల్చర్ హబ్‌కు ఫౌండేషన్ వేస్తాం. రామాయపట్నం పోర్టు ద్వారా రైతులు ఉద్యాన ఉత్పత్తుల్ని ఎగుమతి చేసుకునే అవకాశం ఉంటుంది. గత పాలకులు ఆర్థిక వ్యవస్థకు తీవ్ర నష్టం చేశారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా సూపర్ సిక్స్ లాంటి పథకాలు అమలు చేస్తున్నాం. అభివృద్ధితో పాటు ప్రాజెక్టులు కూడా పూర్తి చేయాల్సి ఉంది. త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు వస్తున్నాయి. మంచి చేసే ప్రభుత్వాన్ని గుర్తించాలని ప్రజల్ని కోరుతున్నాను."అని ముఖ్యమంత్రి అన్నారు. పునరావాస ప్యాకేజీ పై నిర్వాసితుల సంతృప్తి.. గత ప్రభుత్వం పరిహారం ఇవ్వకుండా ఇబ్బందులు పెట్టిందని.. నాటి సీఎం ప్రకాశం జిల్లాకు వచ్చినప్పుడు పరిహారం అడుగుతామని నోటీసులు ఇచ్చి బయటకు రాకుండా చేశారని.. ప్రాజెక్టు కింద పొలాలను కోల్పోయినా కూటమి ప్రభుత్వం ఇచ్చిన పరిహారం సంతోషం కలిగించిందని వెలిగొండ నిర్వాసిత రైతు కాశిరెడ్డి అన్నారు. చంద్రబాబు చేతుల మీదుగా శంకుస్థాపన చేసిన ప్రాజెక్టును ఆయనే ఇప్పుడు ప్రారంభిస్తున్నారని.. తాము కలగా భావించిన ప్రాజెక్టు తమ కళ్ల ముందే సాకారమైందని..తమ ప్రాంతానికి సాగునీరు, తాగునీరు రావటం సంతోషంగా ఉందని నిర్వాసిత రైతు బోగెం శ్రీనివాసులు అన్నారు. తమకు పరిహారం పూర్తిగా అందించిందని.. కాలనీల్లో వసతుల కల్పన బాగుందని నిర్వాసితులకు ప్రభుత్వం అండగా నిలవటం సంతృప్తిగా ఉందని మహిళా నిర్వాసితురాలు ఉషమ్మ తెలిపారు. ఈ సమావేశంలో జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి, గిద్దలూరు ఎమ్మెల్యే అశోక్ రెడ్డి, కనిగిరి ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి, ఎర్రగొండపాలెం ఇంచార్జి ఎరిక్షన్ బాబు, ఆర్ అండ్ ఆర్ కమిషనర్ ప్రశాంతి, వెలిగొండ నిర్వాసితులు పాల్గొన్నారు.

# మానవీయ కోణంలో అమలవుతున్న రేషన్ పథకం

పంపిణి జరుగుతందన్నారు. కేంద్ర ప్రభుత్వానికి పేద ప్రజల. పట్ల ప్రేమ ఉంటే దేశవ్యాప్తంగా సన్న బియ్యం పంపిణి చేయాలన్నారు. బడా వ్యాపారవేత్తలకు వేల కోట్ల రుణాలు మాఫీ చేస్తారు కానీ పేద ప్రజలకు కడుపు నిండా అన్నం పెట్టరని విమర్శించారు. పేద ప్రజలకు రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం పంపిణి చేస్తున్న ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టే ప్రజా సంక్షేమ పథకాలను చూసి బిఆర్ఎస్ ఓర్వలేక పోతుందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై బిఆర్ఎస్ నాయకులు దుర్మార్గంగా తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు. ఎన్నికలు ఏవైనా నిజాయితీగా ఉండే వారిని, ప్రజల కోసం పని చేసే వారిని ఎన్నుకుంటేనే గ్రామంలో అయినా, నియోజకవర్గంలో అయినా అభివృద్ధి జరుగుతుందని కడియం శ్రీహరి సూచించారు.. వేలేరు మండల కేంద్రంలోని రైతు వేదికలో, ధర్మసాగర్ మండల కేంద్రంలోని సుస్మిత గార్డెన్స్ లో ఏర్పాటు చేసిన వేలేరు, ధర్మసాగర్ మండలాలకు సంబంధించిన కొత్త డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణి కార్యక్రమానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి గారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా లబ్దిదారులకు రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా అత్యంత భద్రతా ప్రమాణాలతో జారీ చేసిన డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణి చేశారు.. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టే ప్రజా సంక్షేమ కార్యక్రమాలను చూసి ఓర్వలేక బిఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వంపై దుర్మార్గంగా తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు. రెండు రోజుల క్రితం ఎక్కడో ఆదిలాబాద్ లో సంజీవ రెడ్డి అనే వ్యక్తికి ఇతర కాంగ్రెస్ నాయకులకు గొడవ జరిగితే అది కడియం శ్రీహరిపైనే జరిగింది అని సోషల్ మీడియాలో ప్రచారం చేశారు. ఇంత దుర్మార్గంగా అబద్దపు వార్తలు చేయడం బిఆర్ఎస్ నాయకుల దిగజారుడు రాజకీయాలకు నిదర్శనం అని అన్నారు. బిఆర్ఎస్ పార్టీ కొన్ని యూట్యూబ్ ఛానల్స్ కొని నెల జీతాలు ఇస్తూ కాంగ్రెస్ ప్రభుత్వంపై, నాయకులపై సంబంధంలేని, స్జబెక్ట్ లేని వార్తలతో విష ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజా స్వామ్య వ్యవస్థలో ఇది సరైన పద్ధతి కాదని సూచించారు. నా 35ఏళ్ల రాజకీయ జీవితంలో ఏనాడూ ఎవరి దగ్గర రూపాయి అవినీతికి పాల్పడలేదని స్పష్టం చేశారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం, పేద ప్రజల సంక్షేమం కోసమే నిరంతరం కృషి చేస్తున్నాని తెలిపారు. దేశంలోనే మొట్ట మొదటి సారిగా సన్న బియ్యంతో పాటు స్మార్ట్ డిజిటల్ రేషన్ కార్డులు పంపిణి చేసిన రాష్ట్రం తెలంగాణ రాష్ట్రం మాత్రమే అని చెప్పారు. తెలంగాణ చేపట్టిన సన్న బియ్యం పంపిణి కార్యక్రమం ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయని తెలిపారు. ఏడాదికి 13వేల 800కోట్ల ఖర్చుతో కోటి 06లక్షల రేషన్ కార్డుల ద్వారా 3కోట్ల 10లక్షల మందికి ఒక్కరికి 6కిలోల చొప్పున ఉచిత సన్న బియ్యం పంపిణి చెస్తున్నట్లు పేర్కొన్నారు. అత్యున్నత భద్రతా ప్రమాణాలతో రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా డిజిటల్ రేషన్ కార్డులను పంపిణి చేస్తుందని అన్నారు. ఈ రేషన్ కార్డులపై ప్రధాని నరేంద్ర మోడీ ఫోటో పెట్టాలని బీజేపీ వాళ్ళు అంటున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం దొడ్డు బియ్యం ఇస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం మాత్రం సన్న బియ్యం పంపిణి చేస్తుందని రాష్ట్ర ప్రభుత్వం వేల కోట్ల ఖర్చుతో చేపట్టే కార్యక్రమానికి మోడీ ఫొటో ఎలా పెడతారని ప్రశ్నించారు. పేద ప్రజల కడుపు నింపాలనే ఆలోచన కేంద్ర ప్రభుత్వానికి ఉంటే దేశ వ్యాప్తంగా సన్న బియ్యం పంపిణి చేయాలని డిమాండ్ చేశారు. బడా బడా వ్యాపారవేత్తలకు వేల కోట్ల రుణాలు మాఫీ చేస్తారు కానీ పేద ప్రజలకు కడుపు నిండా అన్నం పెట్టరని ఇది మంచి పద్ధతి కాదని విమర్శించారు. పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. పేద ప్రజల పక్షాన, రైతుల పక్షాన, మహిళల పక్షాన నిలబడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజల ఆశీర్వాదం ఉండాలని కోరారు. ÷రిత్తగా ఏర్పడిన వేలేరు మండలంలో మూడు ప్రధాన సమస్యలు ఉన్నాయని అన్నారు. అందులో మొదటిది మల్లన్న గండి రిజర్వాయర్ నుండి సాగు నీరు అందించాలని చెప్పారు. మల్లన్న గండి లిఫ్ట్-1 పనులు వేగంగా జరుగుతున్నాయని అతి త్వరలోనే వేలేరుకు గోదావరి జలాలు తీసుకువస్తానని తెలిపారు. కొత్త మండలంలో మండల కార్యాలయాలు నిర్మాణం చేయాల్సి ఉందని ఇప్పటికే తహసీల్దార్ కార్యాలయం నిర్మాణానికి 2కోట్ల 25లక్షలు మంజూరు అయ్యాయని, రెండు మూడు రోజుల్లో ఎంపీడీవో కార్యాలయానికి మరో 2కోట్లు మంజూరు కానున్నాయని అన్నారు. నెల రోజులలోపు మండల కార్యాలయాల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తానని వెల్లడించారు. వేలేరు నుండి కొమ్ముగుట్ట వరకు రోడ్డు అభివృద్ధికి పంచాయతీ రాజ్ హ్యామ్ పథకం ద్వారా 14కోట్లు మంజూరు అయ్యాయని త్వరలోనే పనులు పూర్తి చేయిస్తానని తెలిపారు. అలాగే వేలేరు మండల కేంద్రంలో అసంపూర్తిగా ఉన్న ప్రధాన రహదారిని పూర్తి చేయాల్సి ఉందని అన్నారు. వేలేరుకు సాగు నీరు తీసుకురాలేకపోయినా, మండల కార్యాలయాలు నిర్మాణం చేయకపోయినా, రోడ్డు పనులు పూర్తి చేయకపోయినా మళ్ళీ కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేయమని అడగనని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వేలేరు, ధర్మసాగర్ మండలాల సర్పంచులు, తహసీల్దార్లు, ఎంపిడివోలు, మండల నాయకులు, ఇతర ప్రజా ప్రతినిధులు, రేషన్ డీలర్లు, లబ్దిదారులు తదితరులు పాల్గొన్నారు..

# సన్న వడ్లకు బోనస్‌లో కీలక మార్పులు

### ప్రభుత్వం నిర్దేశించిన 7 రకాలకే బోనస్

హైదరాబాద్,ఆగస్ట్22 : తెలంగాణ ప్రభుత్వం సన్న వడ్లకు సంబంధించి క్వింటాకు 500 రూపాయల బోనస్ పథకంలో కీలక మార్పులు తీసుకొచ్చింది. అక్రమాలను అరికట్టి నిజమైన లబ్దిదారులకు మేలు చేయడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వ్యవసాయ శాఖ ప్రకటించింది. అయితే కొత్తగా విధించిన నిబంధనలు క్షేత్రస్థాయిలో రైతులకు తీవ్ర అయోమయాన్ని, ఆందోళనను కలిగిస్తున్నాయి. ఈ బోనస్ సొమ్ము అందాలంటే ప్రభుత్వం ప్రత్యేకంగా నిర్దేశించిన 7 రకాల సన్న వరి విత్తనాలను మాత్రమే సాగు చేసి ఉండాలి. అందులో ఆర్ఎస్ఆర్ 15048 (తెలంగాణ సోనా), కేఎన్ఎం 1638 (కూనారం వరి-2), జైశ్రీరామ్, కేఎన్ఎం 7715, బీపీటీ 5204 (సాంబమసూరు), హెచ్ఎంటీ సోనా, డబ్ల్యూజీఎల్-44 (సిద్ధి) రకాలు ఉన్నాయి. రైతులు తాము విత్తనాలు కొనుగోలు చేసిన దుకాణాలకు వెళ్లి ఆధార్ కార్డు, పట్టాదారు పాస్‌పుస్తకం, కొనుగోలు బిల్లు సమర్పించి సెప్టెంబర్ 10వ తేదీలోగా తమ పేర్లను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని అధికారులు ఆదేశించారు. నెల రోజుల కిందటే విత్తనాలు కొనుగోలు చేసినందున ఇప్పుడు పాత బిల్లులు దొరకక, దుకాణాల చుట్టూ తిరగలేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చాలాచోట్ల వ్యాపారుల వద్ద రికార్డులు లేకపోవడంతో వాగ్వాదాలు జరుగుతున్నాయి. మరోవైపు మార్కెట్లో లభించే ఇతర రకాల సన్న వరిని సాగు చేసిన రైతులు తమకు బోనస్ వర్తించకపోవడంపై నిరాశ వ్యక్తం చేస్తున్నారు. సొంతంగా విత్తనాలు ఉత్పత్తి చేసుకుని సాగు చేసిన రైతులు కూడా ఏ దుకాణంలో నమోదు చేసుకోవాలో తెలియక గందరగోళానికి గురయ్యారు. ఈ సమస్యపై స్పందించిన జిల్లా వ్యవసాయాధికారి మోహన్ రెడ్డి స్పష్టతనిచ్చారు. సొంత విత్తనాలు వాడిన రైతులు దుకాణాలకు వెళ్లాల్సిన అవసరం లేదని, స్థానిక వ్యవసాయ అధికారులకు సొంత డిక్లరేషన్ (÷ూ।-÷బిఆ।ఈజీసజీబితినీని) రాసి ఇస్తే సరిపోతుందని తెలిపారు. సెప్టెంబర్ 10 లోపు ఈ పక్రియ పూర్తి చేయాలని సూచించారు. కామారెడ్డి జిల్లాలోనే దాదాపు 2.51 లక్షల ఎకరాల్లో సన్న రకాలు సాగవుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిబంధనలను మరింత సులభతరం చేయాలని రైతాంగం కోరుతోంది.

# 75 దేశాలకు వీసాల నిలిపివేత నిర్ణయం

### ట్రంప్ సర్కార్ నిర్ణయాన్ని కొట్టివేసిన న్యాయస్థానం

వాషింగ్టన్,ఆగస్ట్22 : అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నకు స్థానిక కోర్టులో షాక్ తగిలింది. పాకిస్థాన్, బంగ్లాదేశ్, నేపాల్, రష్యా సహా మొత్తం 75 దేశాల పౌరులకు తమ దేశ ఇమిగ్రెంట్ వీసా ప్రాసెసింగ్‌ను నిలిపివేయాలని ఈ ఏడాది జనవరిలో ట్రంప్ సర్కార్ తీసుకున్న నిర్ణయాన్ని న్యాయస్థానం కొట్టేసింది. ఈ ప్రకటన ఫెడరల్ వలస చట్ట నిబంధనలకు వ్యతిరేకంగా ఉందని యూఎస్ డిస్ట్రిక్ట్ జడ్జి జీనెట్ వెల్లడించారు. వలస వీసాల విషయంలో కాన్సులర్ అధికారుల జోక్యంపై విదేశాంగ కార్యదర్శికి ఉన్న అధికారాన్ని ఆ చట్టం తొలగించిందన్నారు. వారి వీసాలను నిలిపివేసే అధికారం ప్రభుత్వానికి లేదని స్పష్టం చేశారు. 75 దేశాల వ్యక్తులు అమెరికా ప్రజల నుంచి ఆమోదయోగ్యం కానంత అధికంగా సంక్షేమ ఫలాలు పొందుతున్నారు! అందుకే వారికి ఇమ్మిగ్రెంట్ వీసా ప్రాసెసింగ్‌ను నిలిపివేయాలని నిర్ణయించాం. కొత్త వలసదారులు అమెరికన్ల సంపదను సంగ్రహించకుండా రక్షణ కల్పించేంతవరకూ, వారు మాకు భారంగా మారరని నిర్ధారణ అయ్యేంతవరకూ ఈ నిలిపివేత అమల్లో ఉంటుంది. ట్రంప్ సర్కారు ఎప్పుడూ అమెరికా ప్రయోజనాలకే ప్రథమ ప్రాధాన్యం ఇస్తుంది' అని ఆ దేశ విదేశాంగ శాఖ అప్పట్లో పేర్కొన్న విషయం తెలిసిందే.

# ఫ్లోరైడ్ జిల్లాలకు వరంగా వెలిగొండ

జగన్‌మోహన్‌రెడ్డి అని ఎద్దేవా చేశారు. అలాంటి వ్యక్తి ముఖ్యమంత్రి ఎలా అయ్యారో తనకు అర్థం కావడం లేదని వ్యాఖ్యానించారు. 'గొడ్డలి పార్టీ' చెప్పేది ఒకటి.. చేసేది మరొకటని విమర్శించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో టీడీపీ శ్రేణుల్లో చాలామందిపై అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేశారని ఆరోపించిన లోకేశ్.. ఎక్కడెక్కడ అక్రమ కేసులు నమోదు చేశారో వాటన్నింటినీ రద్దు చేస్తామని స్పష్టం చేశారు. మరోసారి అధికారంలోకి వచ్చేందుకు వైసీపీ ప్రయత్నాలు చేస్తోందని, అయితే టీడీపీ శ్రేణులంతా ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. 'రెడ్ బుక్ తన పని తాను చేసుకుపోతుంది' అని వ్యాఖ్యానించారు. మూడు పర్యాయాల పాటు టీడీపీ అధికారంలో ఉంటేనే రాష్ట్రంలో అభివృద్ధి మరింత వేగంగా జరుగుతుందని మంత్రి నారా లోకేశ్ అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ విజయమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలని సూచించారు. పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కేడర్ సమావేశం అనంతరం 2023-24 సంవత్సరంలో 'భవిష్యత్ గ్యారంటీ' కార్యక్రమాన్ని విజయవంతం చేసి ఉత్తమ పనితీరు కనబరిచిన 100 మంది టీడీపీ కార్యకర్తలకు నారా లోకేశ్ ప్రశంసాపత్రాలు అందజేశారు. పార్టీ కోసం కష్టపడుతున్న కార్యకర్తలను గుర్తించి ప్రోత్సహించడం ద్వారా కేడర్‌లో మరింత ఉత్సాహం పెరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

# రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం మోకాలడ్డు

ఎన్డీయే ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు, ప్రాజెక్టుల కోసం రాష్ట్ర బీజేపీ నాయకులు ఎందుకు గళమెత్తడం లేదని మంత్రి ప్రశ్నించారు. కేంద్రం పక్క రాష్ట్రాలకు నిధులు ఇస్తున్నప్పుడు తెలంగాణకు నిధులు ఎందుకు ఇవ్వడం లేదని వారిని సూటిగా ప్రశ్నించారు. ÷ూజకీయాలకు అతీతంగా తెలంగాణ ప్రయోజనాల కోసం కేంద్రంతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నట్లు మంత్రి తెలిపారు. అదే విధంగా కేంద్రం కూడా రాష్ట్రాభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం 'ప్లలె ప్లలెకు పొన్నం అన్న- ప్లలె ప్లలెలో ప్రజా పాలన' కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రతి గ్రామంలో ప్రజలతో ముఖాముఖి సమావేశాలు నిర్వహించి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు మంత్రి పొన్నం వెల్లడించారు.

# నా భర్తను విడిచి పెట్టండి

### బ్రిటన్‌కు భారతీయ నావికుడి భార్య వినతి

న్యూఢిల్లీ,ఆగస్ట్22 : రష్యా 'షాడో ఫ్లీట్'కు చెందినదిగా అనుమానిస్తున్న చమురు ట్యాంకర్‌పై ఇటీవల బ్రిటన్ దళాలు దాడి చేసి.. ఓ భారతీయుడిని అరెస్ట్ చేశాయి. ఈ ఘటనపై ఆ భారత నావికుడి భార్య మాట్లాడుతూ.. తన భర్తను బలిపశువును చేశారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన కేవలం తన యజమాని ఆదేశాలను మాత్రమే పాటించారని చెప్పారు. సదరు నౌక ఇంగ్లిష్ ఛానల్ మీదుగా ప్రయాణిస్తుండగా.. బ్రిటన్ కమాండోలు అందులోకి ప్రవేశించారు. నౌక కెప్టెన్‌గా ఉన్న 38ఏళ్ల అజయ్ పంత్‌ను అరెస్ట్ చేశారు. ఇటీవల అతడిని కోర్టులో హాజరుపర్చగా న్యాయస్థానం బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించింది. ఈ కేసులో అతడు గరిష్ఠంగా 10ఏళ్ల జైలు శిక్షను ఎదుర్కొనే అవకాశం ఉంది. ఈ క్రమంలోనే అజయ్ భార్య రితూ పంత్ మీడియాతో మాట్లాడుతూ.. 'నౌక యజమాని వద్ద నా భర్త కేవలం ఓ ఉద్యోగి మాత్రమే. యాజమాన్యం ఎలా చెబితే అలాగే చేశారు. తాను చేసిన తప్పేంటో కూడా అర్థం కావట్లేదని ఆయన వాపోతున్నారు. చేయని తప్పునకు జైల్లో కుమిలిపోతున్నారు' అని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నౌకలో 98వేల టన్నుల చమురును అక్రమంగా రవాణా చేస్తున్నారన్నది బ్రిటన్ ఆరోపణ. నౌక కెప్టెన్‌గా కార్గోలో ఏముందో అజయ్ పంత్‌కు కచ్చితంగా తెలుసునని బ్రిటిష్ ప్రాసిక్యూషన్ కోర్టులో వాదించింది. అయితే, దీన్ని అజయ్ న్యాయవాది తోసిపుచ్చారు. కెప్టెన్ బాధ్యత కేవలం నౌకలోని కార్గోను సురక్షితంగా గమ్యస్థానానికి చేర్చడమేనని, అందులో ఏముందో వారికి తెలిసే అవకాశం లేదని అన్నారు. ఈ కేసుపై డిసెంబరు 15 నుంచి విచారణ జరగనుంది. మరోవైపు, కాన్సులార్ అనుమతితో బ్రిటన్ జైల్లో ఉన్న అజయ్ పంత్‌ను భారత విదేశాంగ శాఖ కలిసి ఘటన గురించి తెలుసుకుంది. జూన్ 14న ఈ ఘటన చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. కామెరూన్ జెండాతో ఉన్న చమురు ట్యాంకర్ 'స్కిట్రోస్'.. ఇంగ్లిష్ ఛానల్‌లో ప్రయాణిస్తున్న సమయంలో బ్రిటన్ సైనిక దళాలు అందులోకి ప్రవేశించాయి. 6 గంటలపాటు సాగిన ఈ ఆపరేషన్‌లో బ్రిటన్ రాయల్ మెరైన్ కమాండోలు, ఎన్‌సీఏ అధికారులు పాల్గొన్నారు. నౌకలో మొత్తం 24 మంది సిబ్బంది ఉండగా.. కెప్టెన్‌గా ఉన్న అజయ్‌ను బ్రిటన్ దళాలు అరెస్ట్ చేశాయి. ఉక్రెయిన్ యుద్ధం తర్వాత విధించిన ఆంక్షలను తప్పించుకునేందుకు.. రష్యా వందల సంఖ్యలో నౌకలను వివిధ దేశాల జెండాలతో నడుపుతోంది. ఈ 'షాడో ఫ్లీట్'లో భాగంగానే ఈ ట్యాంకర్ రష్యా నుంచి చమురు రవాణా చేస్తోందని బ్రిటన్ ఆరోపించింది. జూన్ 5న ఇది రష్యా పోర్టు నుంచి ఈజిప్టునకు బయల్దేరిందని పేర్కొంది. ప్రస్తుతం ఈ నౌక ఇంగ్లాండ్ దక్షిణ తీరంలో ఓ సురక్షిత స్థానంలో ఉంది.

## కాంగ్రెస్ ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావుకు నిరసన సెగ

ఎల్లారెడ్డి, ఆగస్టు 22 : కాంగ్రెస్ ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావుకు నిరసన సెగ తగిలింది. ఎల్లారెడ్డి మండలం మల్కాపూర్ గ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యేను గ్రామస్తులు అడ్డుకున్నారు. తమ గ్రామ సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎమ్మెల్యే ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఎమ్మెల్యేను నిలదీయడంతో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

## 22ఏ నిషేధిత భూముల పేరిట పెద్ద ఎత్తున అక్రమాలు

### భూభారతి పోర్టల్‌పై సిట్టింగ్ జడ్జితో విచారణ

### కేంద్రమంత్రి కిషన్ రెడ్డి డిమాండ్

హైదరాబాద్,ఆగస్ట్22 : రాష్ట్రంలో 22ఏ నిషేధిత భూముల పేరిట పెద్ద ఎత్తున అక్రమాలు జరుగుతున్నాయని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆరోపించారు. భూభారతి పోర్టల్‌పై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ వేలాది ఎకరాలను నిషేధిత జాబితాలో పెట్టి దండుకోగా.. కాంగ్రెస్ హయాంలో అది లక్షలాది ఎకరాలకు చేరిందని విమర్శించారు. హైదరాబాద్‌లో కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. రాత్రికి రాత్రే ప్రైవేటు భూములను 22ఏ జాబితాలో పెట్టి ప్రభుత్వం వేధిస్తోంది. దశాబ్దాలుగా పన్నులు చెల్లిస్తున్న భూములను నిషేధిత జాబితాలో ఎలా చేరుస్తారు? ప్రజల వ్యతిరేకతను తప్పించుకోవడం కోసం సీఎం ఇంటిని నిషేధిత జాబితాలో చేర్చారా? ధరణి స్థానంలో వచ్చిన భూభారతి నవ్వులపాలైంది. బీఆర్ఎస్ 10శాతం కమిషన్ తీసుకుంటే.. కాంగ్రెస్ 30 శాతం తీసుకుంటోంది. హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న ఓపెన్ భూములను అమ్మాలని చూస్తున్నారు. ప్రైవేటు భూముల్లో 50శాతం కమిషన్ అడుగుతున్నారు. ప్రభుత్వ భూముల్ని ఎందుకు అమ్ముతున్నారో సమాధానం చెప్పాలి. రియల్ ఎస్టేట్ కంపెనీలను బెదిరించి వాటాలు తీసుకుంటున్నారు. భాజపా అధికారంలోకి వచ్చాక ఈ భూములపై మళ్లీ పరిశీలన చేస్తాం. ఎమ్మెల్యేకు ఇష్టంలేకపోతే ఆ భూమి 22ఏలోకి వెళ్లిపోతుంది. ఈ భూముల విషయంలో భాజపా లీగల్ సెల్ ప్రజలకు సహాయం అందిస్తోంది. ప్రాముఖ్యతను బట్టి ముఖ్యమంత్రికి విదేశీ పర్యటనలకు అనుమతులు ఇస్తారు. విదేశీ పర్యటనలపై కాంగ్రెస్ హయాంలో ఉన్న నిబంధనలే ఇప్పుడూ ఉన్నాయని కిషన్ రెడ్డి అన్నారు.

## జాతీయ ఉత్తమ ఉపాధ్యాయురాలుగా బొంపెల్లి భవాని

కామారెడ్డి,ఆగస్ట్22 : జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు కామారెడ్డి జిల్లా గాంధారి మండల కేంద్రంలోని బాలికల ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బొంపెల్లి భవాని ఎంపికయ్యారు. కేంద్ర ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసిన 48 మందితో కూడిన జాబితాలో తెలంగాణ నుంచి ఆమెకు చోటు దక్కింది. గురుపూజోత్సవాన్ని పురస్కరించుకొని సెప్టెంబరు 5న దిల్లీలో రాష్ట్రపతి చేతులమీదుగా ఆమె ఈ అవార్డు అందుకోనున్నారు. గాంధారి మండలానికి చెందిన భవాని 2018 నుంచి బాలికల ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తూ.. యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్ ఎకౌంట్ల ద్వారా వినూత్న రీతిలో విద్యార్థులకు కృత్యాధార బోధన చేస్తూ పేరుపొందారు. తెలంగాణ ఎస్సీఈఆర్టీ 'ట్రయల్ బ్లేజర్స్' పేరిట ప్రచురించిన పుస్తకంలో.. అవరోధాలను అధిగమించి పాఠశాలలో ప్రవేశాల సంఖ్యను పెంచారంటూ భవాని పాఠాన్ని అందులో చేర్చారు. సీఎం చేతుల మీదుగా ఆమె ఇటీవల రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్నారు. ఏపీ నుంచి విజయనగరం జిల్లాకు చెందిన కౌలూరి రాజేష్, అండమాన్ నికోబార్ నుంచి తెలుగు వ్యక్తి జెల్లి ప్రకాశ్‌రావు ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు.

## సచివాలయం ముందు పెద్ద గుంత

### లంకె బిందల కోసం తవ్వారా అంటూ కెటిఆర్ సెటైర్లు

హైదరాబాద్ : హైదరాబాద్‌లోని రోడ్ల దుస్థితికి సంబంధించిన ఓ వీడియో సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. ఏకంగా తెలంగాణ సచివాలయం ముందే పెద్ద గుంత తవ్వి అలాగే వదిలేయడంపై ఓ నెటిజన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ భారీ గుంతను చూపిస్తూ ఎక్స్‌లో చేసిన పోస్టుపై ఇప్పుడు పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ఈ పోస్టుపై స్పందించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. రేవంత్ సర్కార్‌పై సెటైర్లు వేశారు. సెక్రటేరియట్ ముందే ఇంత పెద్ద గుంత ఉంది. ఎవరైనా సెక్రటేరియట్ చూసుకుంటూ వస్తే ఈ గుంతలో పడి ఛస్తారని ఆందోళన వ్యక్తం చేశాడు. ఇంతమంది పోలీసులు వెళ్తుంటారు. ఇంతమంది జనాలు వెళుతుంటారు.. అలాంటి చోట ఏంటి గుంతనా అని ప్రశ్నించారు. సీఎం గారూ హుస్సేన్ సాగర్‌ను ఇక్కడ కూడా పెట్టాలని అనుకుంటున్నారా? అని వ్యంగ్యంగా ప్రశ్నించారు. రోజూ ఎంతోమంది తిరుగుతుంటారు.. దీన్ని క్లోజ్ చేద్దామన్న రెస్పాన్సిబిలిటీ ఉండదా? జీహెచ్ఎంసీ వాళ్లు రోడ్లపై తిరుగుతూ చూడరా? అస్తమానం ఎవరో ఒకరు కంప్లయింట్ ఇస్తేనే తెలుస్తుందా? అని నిలదీశారు. వీలైనంత తొందరగా దీనిపై చర్యలు తీసుకోవాలని కోరాడు. అంతేకాకుండా.. లోపల ఇలాంటివి చాలా ఉన్నాయ్.. లోపల దాచిపెట్టాం అని జీహెచ్ఎంసీ అన్నట్లుగా క్యాప్షన్ పెట్టాడు. పోస్టు వైరల్‌గా మారడంతో హైదరాబాద్ రోడ్ల పరిస్థితి, కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై నెటిజన్లు మండిపడుతున్నారు. ఈ క్రమంలోనే కేటీఆర్ కూడా స్పందించారు. లంకెబిందెల కోసం తవ్వుతున్నారేమో అని వ్యంగ్యంగా కామెంట్ పెట్టారు. దీనికి నవ్వుతున్న ఎమోజీని కూడా జత చేశారు. దీంతో కేటీఆర్ కామెంట్ కూడా వైరల్‌గా మారింది.

# ఇందిరమ్మ ఇళ్ల పేరుతో ఓట్లు అడగం

### అర్హులైన పేదలందరికీ విడతల వారీగా ఇళ్లు మంజూరు

### హైదరాబాద్ తరహాలో హౌజింగ్ టవర్స్ నిర్మాణం

### నిజామాబాద్ పర్యటనలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



నిజామాబాద్,ఆగస్ట్22 : నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చి.. ఆ పేరుతో ఓట్లు అడిగే ప్రసక్తే లేదని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. నిజామాబాద్‌లో పర్యటించిన మంత్రి.. నగరంలో హౌసింగ్ టవర్ నిర్మాణ పనులను పరిశీలించారు. పాముల బస్తీలో ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. గృహ ప్రవేశం చేసిన మహిళలకు నూతన వస్త్రాలు అందించి శుభాకాంక్షలు చెప్పారు. నిర్మాణ దశలో ఉన్న ఇళ్ల పనుల్లో వేగం పెంచాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ విడతల వారీగా ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. కొత్త టెక్నాలజీతో ఇందిరమ్మ మోడల్ టవర్స్ నిర్మిస్తున్నామని మంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా పట్టణాలలో హైదరాబాద్ తరహా ఇందిరమ్మ ఇండ్ల టవర్స్ నిర్మాణం చేపడతామని అన్నారు. పైలట్ ప్రాజెక్ట్ గా నిజామాబాద్ కార్పోరేషన్ పరిధిలో శ్రీకారం చుట్టామని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు 230 రూపాయలకే సిమెంట్ బస్తా ఇవ్వడానికి కంపెనీలు ముందుకు వచ్చాయని అన్నారు. నిజామాబాద్ జిల్లాలో విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి పనులకు మంతంరి ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయడం జరిగింది. పట్టణంలో రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో నిర్వహించిన డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపు పత్రాల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని లబ్ధిదారులకు మంజూరు అంజేయడం జరిగింది. అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ, మరియు గృహనిర్మాణ అంశాల మీద అధికారుతో సమీక్షా సమావేశం నిర్వహించడం జరిగింది. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ షాపింగ్ కాంప్లెక్స్ లో గంగస్థాన్ ఫేజ్ 2 భవనానికి ప్రారంభోత్సవం చేయడం జరిగింది. నిజామాబాద్ జిల్లాలోని వివిధ మండలాలకు మంజూరైన నూతన తహసీల్దార్ కార్యాలయాల భవనాలతో పాటు నిజామాబాద్ రూరల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవన నిర్మాణానికి మరియు గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 6 అదనపు తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపనతో పాటు భూమి పూజ చేయడం జరిగింది. బీఆర్ఎస్ ప్రభుత్వం 10 సంవత్సరాలో సంవత్సరానికి 2 లక్షల చొప్పున ఇండ్లు కట్టి ఉంటే పదేండ్లలో 20లక్షల ఇండ్లు పూర్తి అయ్యేవి. కేవలం 60 వేల ఇండ్లను మాత్రమే పూర్తి చేసింది. 30వేల ఇండ్లను మొండిగోడలతో అసంపూర్తిగా వదిలేసేసింది. నిజామాబాద్ టౌన్ లో కూడ సుమారు 400 ఇండ్లను అసంపూర్తిగా వదిలేస్తే, ప్రజాప్రభుత్వం వచ్చాక వాటికి నిధులు కేటాయించి నివాసయోగ్యానికి అనుకూలంగా ఉండేలా యుద్ధ ప్రతిపాదికన పనులు పూర్తి చేసి, డ్రా పద్ధతిలో అర్హులైన పేదలకు ఇండ్లను కేటాయించడం జరిగింది. అదేవిధంగా మహిళా స్వయం సహాయక సంఘ సభ్యులకు రూ. 3 కోట్ల 72 లక్షల 65 వేల చెక్కు అందజేశాము. రాబోయే 20 రోజుల్లో నిజామాబాద్ టౌన్ లో పైలట్ ప్రాజెక్ట్ కింద హైదరాబాద్ తరహా ఇందిరమ్మ ఇండ్ల టవర్స్ నిర్మాణాలు శ్రీకారం చుట్టబోతున్నాం. సొంత జాగలేని అర్హులైన నిరుపేదలకు తప్పకుండా ఇందిరమ్మ ఇండ్లను అందిస్తామని అన్నారు. ఇక సిమెంట్ బస్తా ధర 330 వరకు ఉంది. ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకునే వారికి అది భారంగా కాకుడదు అనే ఆలోచనతో ప్రజాప్రభుత్వం సిమెంట్ పరిశ్రమల యాజమాన్యంతో మాట్లాడి, ఒప్పించి 230 రూపాయలకే సిమెంట్ బస్తా అందించేలా ఒప్పందం చేసుకోవడం జరిగిందన్నారు. ప్రస్తుతం ప్రతి జిల్లాలో 70 గ్రామాల చొప్పున సర్వే కార్యక్రమాన్ని వేగవంతం చేస్తున్నామం, సర్వే సందర్భంగా ప్రజల అభిప్రాయాలను కూడా సేకరిస్తున్నాం, వారి సూచనలను పరిగణనలోకి తీసుకుని తదుపరి చర్యలు చేపడతాం అన్నారు. పేదలకు కేటాయించే ఇంటి స్థలాలు భవిష్యత్‌లో ఎలాంటి వివాదాలకు గురికాకుండా ఉండాలన్న ఉద్దేశంతోనే భూముల సర్వే ర్వహిస్తున్నాం. నిజామాబాద్‌లోని గిరిరాజ్ ప్రభుత్వ కళాశాలలో నూతనంగా నిర్మించనున్న అదనపు తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి , ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి తో కలిసి పిసిసి చీఫ్ మహేధ్ గౌడ్ పాల్గొన్నారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వసతులు, ఆధునిక మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా అదనపు తరగతి గదుల నిర్మాణం చేపడుతున్నామని పిసిసి చీఫ్ తెలిపారు. కొత్త తరగతి గదులతో విద్యార్థులకు మరింత మెరుగైన, అనుకూలమైన విద్యా వాతావరణం అందుబాటులోకి రానుంది. కార్యక్రమంలో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి గారు, నిజామాబాద్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, మేయర్ శ్రీమతి ఉమారాణి , డీసీసీ అధ్యక్షులు నగేష్ రెడ్డి , బొబ్బిలి రామకృష్ణ , కవిత, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## అంజయ్యనగర్‌లో అక్రమ నిర్మాణాలు తొలగిస్తాం

### అక్రమ నిర్మాణాదారులను ఎవ్వరినీ వదలం

### హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పష్టీకరణ

హైదరాబాద్,ఆగస్ట్22 : అంజయ్యనగర్‌లోని అక్రమ నిర్మాణాలన్నీ తొలగిస్తామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పష్టం చేశారు. అక్రమ నిర్మాణాలపై ఎవరినీ ఉపేక్షించబోమని హెచ్చరించారు. ఘటనాస్థలి పక్కన భవనాల వారు ఖాళీ చేసి వెళ్లాలని రంగనాథ్ ఆదేశించారు. గచ్చిబౌలిలోని అంజయ్యనగర్‌లో ఏడంతస్తుల భవనం కుప్పకూలిన ఘటనలో ఇద్దరు మృతిచెందగా.. మరో ఇద్దరు గాయపడ్డారు. ఈ ఘటన విషయం తెలియడంతో అక్కడకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ చేరుకుని ప్రమాద వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ ప్రమాదంలో ఇప్పటివరకు ఇద్దరు మృతిచెందారని రంగనాథ్ తెలిపారు. బిల్డింగ్ యజమాని ఇంకా అందుబాటులోకి రాలేదని అన్నారు. ఈ బిల్డింగ్ నిర్మాణంపై సైబరాబాద్ మునిసిపల్ కమిషనర్‌కి కొంతమంది ఫిర్యాదు చేశారని వెల్లడించారు. గతంలో హైడ్రాకు ఈ బిల్డింగ్ నిర్మాణంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని చెప్పారు. ఏడు అంతస్తులు, ఒక పెంట్ హౌస్ మొత్తం ఎనిమిది అంతస్తుల బిల్డింగ్‌ను నిర్మిస్తున్నారని వివరించారు. నాలాను అతిక్రమించి ఈ బిల్డింగ్ నిర్మాణం జరుగుతోందని రంగనాథ్ అన్నారు. చుట్టుపక్కల ఉన్న భవనాలను పరిశీలించి త్వరలోనే కూల్చివేస్తామని తెలిపారు. బిల్డర్ సాజిద్ 50 గజాల్లో భవనాలు కట్టి హాస్టళ్లు నిర్వహిస్తున్నారని తెలిపారు. సాజిద్ పరారీలో ఉన్నారని చెప్పారు. 50 గజాల్లో ఈ బిల్డింగ్ నిర్మించారని వెల్లడించారు. హాస్టల్ బిల్డింగులను నిర్మించి.... రెంట్‌కు ఇస్తుంటాడని చెప్పారు. హైడ్రా ఈ ఘటన సహాయక చర్యల్లో పాల్గొంటుందని.... ప్రస్తుతం సహాయక చర్యలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. శిథిలాల కింద అదృష్టవశాత్తూ ఇంకెవరూ ఉండకపోవచ్చని భావిస్తున్నామని రంగనాథ్ పేర్కొన్నారు. అలాగే, ఈ ఘటన గురించి సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన మాట్లాడారు. గతంలోనే ఈ నిర్మాణాలపై తమకు ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. నాలుగు నెలల క్రితమే ఈ నిర్మాణ పనులను ఆపేసి, సీజ్ చేశామని వెల్లడించారు. మళ్లీ నిన్న వర్క్ మొదలుపెట్టారని చెప్పారు. ఈరోజు నోటీసులు ఇచ్చేందుకు సిద్ధమయ్యామని అన్నారు. ఈ లోపు ఈ ప్రమాదం చోటు చేసుకుందని చెప్పారు. ఈ నాలాను ఆక్రమించి నిర్మాణలు చేస్తున్నారన్నారు. ఈ బిల్డింగ్ చుట్టూ చాలా అక్రమ నిర్మాణాలు ఉన్నాయని అన్నారు. హాస్టల్ బిల్డింగ్ కోసం ఈ నిర్మాణాన్ని చేపట్టారని సృజన తెలిపారు.

## కాళేశ్వరంతో ఎలాంటి సమస్యలు లేవు

### వెంటనే నీటి విడుదలకు చర్యలు తీసుకోవాలి

### మాజీమంత్రి జీవన్ రెడ్డి డిమాండ్

సిరిసిల్ల,ఆగస్ట్22 : తెలంగాణకు వరప్రదాయిని కాళేశ్వరం ప్రాజెక్టులో బాగమైన అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టు నిర్మాణంలో ఎలాంటి సమస్యలు లేవని కేంద్ర జల విద్యుత్ పరిశోధన సంస్థ క్లీన్‌చిట్ ఇచ్చిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. అన్నారం, సుందిళ్ల ఎక్సలెంట్, గుడ్ అని రిపోర్ట్ ఇచ్చిందని రిపోర్ట్ తో నైనా రేవంత్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి కళ్లు తెరవాలని హితవు పలికారు. సిరిసిల్ల తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికైనా కాళేశ్వరం ప్రాజెక్టు వినియోగం లోకి తేవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ఎల్‌నినోతో రాబోయే పంట కాలంలో సాగు నీటి కి ఇబ్బందులు వస్తాయని హెచ్చరిస్తున్నాయని అన్నారు. రెండు నెలల క్రితమే బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కన్నెపల్లి పంపు హౌజ్ ను సందర్శించి, సాగు నీరు, తాగు నీటికి వచ్చే ఇబ్బందులు వస్తాయని ప్రభుత్వానికి సూచించా రని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు వినియోగం లోకి తెస్తే కేసీఆర్ కు పేరొస్తుందని ప్రభుత్వ భేషజాలకు పోతుందని విమర్శించారు. కన్నెపల్లి నుంచి వృథాగా దిగువన నీరు పోతున్నదని, చంద్రబాబు కోసం గురు దక్షణగా నీటిని రేవంత్ రెడ్డి అందజేస్తున్నారని విమర్శించారు. కన్నెపల్లి పంపు హౌజ్ వద్ద రూ.100 కోట్ల తో కాఫర్ డ్యాం కట్టి వినియోగంలోకి తేవాలని సూచించారు. కేసీఆర్ దూర దృష్టితో కాళేశ్వరం కట్టారని గుర్తు చేశారు.

## నిషేధిత జాబితా పేరుతో వేధింపులు

### ప్రజలను ఇబ్బంది పెట్టే అధికారం ఎక్కడిది

### ఉప్పల్ బాధితులతో హరీష్ రావు

హైదరాబాద్,ఆగస్ట్22 : నిషేధిత జాబితా పేరుతో ప్రజల భూములను కబ్జా చేసే హక్కు ఎవరు ఇచ్చారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు ప్రశ్నించారు. ఇది 30శాతం కమిషన్ సర్కార్ అని ప్రజలే అంటున్నారని తెలిపారు. హైదరాబాద్ బోడుప్పల్ పరిధిలోని తిరుమల మెడోస్, లక్ష్మీ గణపతి కాలనీ, హేమానగర్ కాలనీలకు చెందిన వందలాది మంది 22ఎ బాధితులు వచ్చి తమ ఆవేదన చెబుతుంటే గుండె కలిచివేసిందని అన్నారు. సర్వే నంబర్ 215, 215 పార్ట్‌లలో 30 ఏళ్లుగా ఎలాంటి వివాదాలు లేకుండా సుమారు 1,500 కుటుంబాలు నివసిస్తున్న ఇళ్లను రాత్రికి రాత్రే కాంగ్రెస్ ప్రభుత్వం అర్బన్ ల్యాండ్ సీలింగ్ కింద 22ఎ నిషేధిత జాబితాలో చేర్చడం అత్యంత దుర్మార్గమని హరీశ్‌రావు మండిపడ్డారు. కష్టాల్లో ఉన్నప్పుడు ఇల్లు అమ్ముకుందామని రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్తే.. ఆస్తి ప్రొహిబిషన్‌లో ఉందన్న విషయం తెలియడంతో కాలనీ వాసులు తీవ్ర మానసిక క్షోభకు గురవుతున్నారని అన్నారు. చట్టబద్ధంగా రిజిస్ట్రేషన్ అయిన ఇళ్లను అడ్డుపెట్టుకుని ప్రజలపై ఒత్తిడి తెచ్చి 30 శాతం కమిషన్లు దండుకునేందుకే ఇలాంటి కృత్రిమ వివాదాలు సృష్టిస్తున్నారని రాష్ట్ర వ్యాప్తంగా కోడై కూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దశాబ్దాలుగా ప్రశాంతంగా జీవిస్తున్న ప్రజలకు ఇప్పుడు 22ఎ భయం చూపిస్తూ, బినామీలతో సెటిల్మెంట్లు చేసుకునే దందాకు తెరలేపారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారని హరీశ్‌రావు తెలిపారు. దీనికి మీ సమాధానం ఏంటని రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. బోడుప్పల్ కాలనీ వాసులు సహా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బాధితులందరూ అధైర్యపడవద్దు. ఈ వసూళ్ల సర్కార్ మెడలు వంచైనా సరే మీ ఆస్తులను కాపాడే బాధ్యతను బీఆర్ఎస్ పార్టీ తీసుకుంటుందని స్పష్టం చేశారు. మాటలు పక్కనబెట్టి, తక్షణమే ఆయా కాలనీలను 22ఎ నిషేధిత జాబితా నుంచి తొలగించి, బాధితులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేదంటే బాధితుల పక్షాన బీఆర్ఎస్ పెద్ద ఎత్తున పోరాటం చేస్తుందని హెచ్చరించారు.

## రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మృతి

హైదరాబాద్,ఆగస్ట్22 : రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధి ఖాజాగూడలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజీ సమీపంలో తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. రాయదుర్గం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ముగ్గురు యువకులు బైక్‌పై ఖాజాగూడ నుంచి గచ్చిబౌలి అంజయ్య నగర్‌వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో స్టాఫ్ ఇంజినీరింగ్ కాలేజ్ 2వ గేటు సమీపంలో కేర్ హాస్పిటల్ మెయిన్ రోడ్డు వైపు మలుపు తీసుకుంటుండగా బైక్ అదుపుతప్పి కిందపడిపోయారు. ఈ ప్రమాదంలో పశ్చిమ్‌బెంగాల్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అబ్బాస్ సిద్ధిక్ (25) తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. అదే రాష్ట్రానికి చెందిన బైక్ నడిపిన సహస్ర ఛటోపాధ్యాయ (25), వెనుక కూర్చున్న అభిజిత్ సింగ్ (25) తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స కోసం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి,దర్యాప్తు చేస్తున్నారు. సిద్ధిక్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.

## హేజో లేబొరేటరీస్ కెమికల్ కంపెనీలో పేలుడు

### ఇద్దరు కార్మికుల మృతి..క్షతగాత్రులను హైదరాబాద్‌కు తరలింపు

యాదాద్రి భువనగిరి,ఆగస్ట్22 : యాదాద్రి భువనగిరి జిల్లాలో భారీ ప్రమాదం చోటుచేసుకుంది. భూదాన్ పోచంపల్లి మండలం దోతిగూడెం శివారులోని హేజో లేబొరేటరీస్ కెమికల్ కంపెనీలో రియాక్టర్ భారీ శబ్దంతో పేలింది. శుక్రవారం రాత్రి జరిగిన ఈ ప్రమాదంలో ఇద్దరు కార్మికులు మృతి చెందగా.. మరో పది మందికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. కంపెనీలోని సి-బ్లాక్‌లో నైట్ షిఫ్ట్‌లో 18 మంది కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. రియాక్టర్ వద్ద పనులు జరుగుతుండగా ఒక్కసారిగా భారీ శబ్దంతో పేలుడు సంభవించింది. క్షణాల్లో మంటలు వ్యాపించడంతో కార్మికులు భయంతో పరుగులు తీశారు. పేలుడు ధాటికి పెద్దవూర మండలానికి చెందిన చిన్న నాగిరెడ్డి, ఖమ్మం జిల్లాకు చెందిన నాగన్న బోయిన నరేష్‌కుమార్ మృతి చెందారు. రియాక్టర్ సమీపంలో పనిచేస్తున్న మరో పది మంది కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. రియాక్టర్ పేలిన శబ్దం భారీగా వినిపించడంతో పరిసర గ్రామాల ప్రజలు ఉలిక్కిపడ్డారు. ఏం జరిగిందో తెలియక కొందరు ఇళ్ల నుంచి బయటకు వచ్చి రోడ్లపైకి పరుగులు తీశారు. ప్రమాదం గురించి తెలుసుకున్న స్థానికులు పెద్ద సంఖ్యలో కంపెనీ వద్దకు చేరుకున్నారు. సమాచారం అందుకున్న వెంటనే చౌటుప్పల్ రూరల్ సీఐ సతీష్‌రెడ్డి, ఎస్సై జగన్ పోలీసు సిబ్బందితో ఘటనాస్థలికి చేరుకున్నారు. చౌటుప్పల్, హయత్‌నగర్ నుంచి ÷ర్ ఇంజిన్లు వచ్చి మంటలను అదుపులోకి తీసుకొచ్చాయి. హెజో లేబొరేటరీస్‌లో వరుసగా ప్రమాదాలు చోటుచేసుకోవడంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత జూలై 16న రసాయన వాయువులు పీల్చడంతో అనంతపురం జిల్లా సింగనమల మండలం ఉలికల్లు గ్రామానికి చెందిన ఆలుమూరు కృష్ణారెడ్డి (42) అనే కార్మికుడు మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. ఆ ఘటన జరిగి నెల రోజులు కూడా పూర్తికాకముందే తాజాగా రియాక్టర్ పేలడంతో భద్రతా ప్రమాణాలపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రమాదం తర్వాత కంపెనీ పరిసరాల్లో దుర్వాసన వస్తోందని స్థానికులు చెబుతున్నారు. కంపెనీ ఆవరణలో మురుగునీరు చేరి ఉండటంతో పరిసర ప్రాంతాల్లో దుర్గంధం వ్యాపిస్తోందని ఆరోపిస్తున్నారు. ఈ దుర్వాసన కారణంగా కొందరికి తలతిరగడం, వాంతులు వంటి ఇబ్బందులు ఎదురైనట్లు చెబుతున్నారు. కెమికల్ కంపెనీలో వరుస ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు తగిన స్థాయిలో పర్యవేక్షణ చేయడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. రియాక్టర్ పేలుడు, గతంలో కార్మికుడి మృతి ఘటనల నేపథ్యంలో కంపెనీలో భద్రతా ప్రమాణాలను అధికారులు పూర్తిస్థాయిలో పరిశీలించాలని కోరుతున్నారు.

## దానం నాగేందర్ అన్హత పిటిషన్

### తీర్పును రిజర్వ్ చేసిన హైకోర్టు

హైదరాబాద్,ఆగస్ట్22 : ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హత పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు తీర్పును రిజర్వ్ చేసింది. సెప్టెంబర్ 16వ తేదీన తుది తీర్పు ఇవ్వనున్నట్లు జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ ధర్మాసనం శనివారం వెల్లడించింది. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై దాఖలైన అనర్హత పిటిషన్‌ను కొట్టివేస్తూ స్పీకర్ ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ తెలంగాణ హైకోర్టులో బీఆర్ఎస్ నాయకులు పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ విచారణలో భాగంగా, దానం నాగేందర్ బీఆర్ఎస్ పార్టీలో గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరి, లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ కూడా చేశారని బీఆర్ఎస్ తరపు న్యాయవాదులు కె.వివేక్ రెడ్డి, గండ్ర మోహన్ రావు కోర్టుకు వివరించారు. పార్టీ మారినట్టు అన్ని ఆధారాలు ఉన్నా స్పీకర్ అనర్హత పిటిషన్ కొట్టివేశాడని వెల్లడించారు. తాను ఇంకా బీఆర్ఎస్ పార్టీలోనే ఉన్నారని ఫిరాయింపు ఎమ్మెల్యేల తరపు న్యాయవాదులు కోర్టుకు వెల్లడించారు. ఇరు వర్గాల వాదనలు విని తుది తీర్పును రిజర్వ్ చేస్తూ, సెప్టెంబర్ 16వ తేదీకి వాయిదా వేసింది.

## కాంట్రాక్ కండక్టర్ల ఆందోళన

హనుమకొండ,ఆగస్ట్22 : వరంగల్ రీజియన్ ఆర్టీసీలో ఏడాది నుంచి 90 మంది కండక్టర్లు కాంట్రాక్ట్ ప్రాతిపదికన పనిచేస్తున్నారు. యాజమాన్యం ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా రాత్రికి రాత్రే విధుల నుంచి తొలగించింది. దీంతో వారు శనివారం హనుమకొండలోని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. సంవత్సరం నుంచి తమతో విధులు చేయించుకుని, ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఉద్యోగాల నుంచి తొలగించడం అన్యాయమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీసీకి సంబంధించిన పలు కీలక సమయాల్లో మేడారం మహాజాతరను విజయవంతం చేయడంలో తమ పాత్ర ఎంతో ఉందని అన్నారు. అలా తమ సేవలను వినియోగించుకున్న తర్వాత అకస్మాత్తుగా ఉద్యోగాల నుంచి తొలగించడంతో తమ కుటుంబాలు ఇబ్బందుల్లో పడే పరిస్థితి ఏర్పడిందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే తమను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, తమ కుటుంబాలను రోడ్డున పడకుండా ప్రభుత్వం, ఆర్టీసీ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఆర్టీసీ సంస్థకు చెందిన కొన్ని ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలు తమను తీసుకుని ఇప్పుడు తొలగించడం అన్యాయమని, డబ్బులు ఇచ్చినవారిని తొలగించలేదని వాపోయారు. గత ఆర్ఎం-ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలు కుమ్మక్కయ్యారని, డిసెంబర్ వరకు అగ్రిమెంట్ ఉన్నా కూడా చెప్పకుండా అకారణంగా తొలగించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏజెన్సీలు కొంతమంది వద్ద డబ్బులు తీసుకుని ఇప్పుడు తొలగించాలరని, ఇందులో ముఖ్యంగా చంద్రశేఖర్ ఏజెన్సీ ఎక్కువ మందిని తీసుకున్నట్లు వారు ఆరోపించారు. డబ్బులు తీసుకుని నియమించిన ఆర్టీసీ ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీల యజమానులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

# సంపాదకీయం

## రూపాయి బియ్యంతో దళారుల దందా

ఉచిత రూపాయికే కిలో బియ్యం ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పక్కదారి పడుతోంది. బియ్యం స్మార్ట్ కార్డులు అందచేసినా, చాలావరకు బియ్యం అక్రమంగా మార్కెట్‌కు తరలిస్తున్నారు. గత వైసిపి ప్రభుత్వంలో టన్నుల కొద్ది బియ్యం పోర్టులు దాటిపోయాయి. తెలంగాణలో కూడా అదే విధంగా బియ్యాన్ని బ్లాక్ మార్కెట్ తరలించి నయాదందా తెరతీసారు. ఎన్టీఆర్ హాయంలో పేదలకు బియ్యం అందించాలని కిలో రెండు రూపాయలకే పథకం తెచ్చారు. అది పలు రూపాంతరాలు చెంది. ఉమ్మడి ఎపిలో కిరణ్ కుమార్ రెడ్డి సిఎంగా ఉండగా కిలో రూపాయికే అందిస్తున్నారు. దీని ధరలు పెంచడానికి ప్రభుత్వాలు జంకుతున్నాయి. ఎక్కడ ఓటు బ్యాంక్ పోతుందో అన్న భయంలో పాలకులు ఉన్నారు. పేదవాడి కడుపు నింపాలనే సంకల్పంతో ప్రభుత్వాలు రూపాయి ఖర్చుకు వెనుకాడకుండా ఉచితంగా బియ్యం ఇస్తుంటే, క్షేత్రస్థాయిలో మాత్రం ఆ లబ్ధి అక్రమార్కుల పాలిట 'కాసుల పంట'గా మారుతోంది. రూపాయి లేకపోయినా పేదవాడు ఆకలితో అలమటించకూడదని ప్రభుత్వం ఉచితంగా సన్నబియ్యం అందిస్తుంటే, ఆ పథకం ఆశయం కాస్తా దారి మళ్లుతోంది. ఉచిత బియ్యం అర్హులైన పేదల కడుపు నింపాల్సింది పోయి, బ్లాక్ మార్కెట్ వ్యాపారుల జేబులు నింపుతుండటం తీవ్ర విచారకరం. తినడానికి ఇచ్చే బియ్యం.. గడప దాటక ముందే విక్రయం జరుగుతోంది. వందలకోటల బిసినెస్ దీనివెనక నడుస్తోంది. ఈ రోజుల్లో చాలా చోట్ల రేషన్ కార్డు ఉండి, రేషన్ బియ్యాన్ని ఆహారంగా వాడుకోని వర్గాలు దాన్ని ఒక అదనపు ఆదాయ మార్గంగా మార్చుకుంటున్నాయి. ప్రతి నెల లేదా మూడు నెలల కోటా పంపిణీ మొదలవగానే లబ్ధిదారుల ఇళ్ల ముందే దళారులు ప్రత్యక్షమవుతున్నారు. ప్రభుత్వం అందించిన నాణ్యమైన బియ్యాన్ని ఇంట్లో ఉంచుకోవాల్సిన పేదలు, కేవలం ఐదు-పది రూపాయల ఆశకు లోనై వ్యాపారులకు అమ్మేస్తున్నారు. మరికొన్ని చోట్ల దందా ఇంకొంచెం ముందుకెళ్లింది. అసలు బియ్యం సంచులను ఇళ్లకు కూడా తీసుకెళ్లడం లేదు. షాపు వద్దకు వెళ్లి వేలిముద్ర వేసి, బియ్యాన్ని అక్కడ వదిలేసి, కిలోకు రూ.10 నుండి రూ.15 తీసుకుని వెళ్లిపోతున్నారు. ఈ విధంగా మిగిలిపోయిన బియ్యాన్ని రేషన్ డీలర్లు, దళారులు చీకటి పడగానే గోదాములకు, పక్క రాష్ట్రాలకు తరలిస్తున్నారు. ఇంకొన్ని రేషన్ షాపుల్లో డీలర్లు స్థానిక హోటళ్లకు అమ్మేస్తున్నట్లు తెలుస్తోంది. ఇలా.. బహిరంగ మార్కెట్లో వీటిని కేజీకి రూ.20 నుండి రూ.25 వరకు విక్రయిస్తూ అక్రమ సంపాదనకు అలవాటు పడుతున్నారు. పేదవాడి ఆకలి తీర్చాలనే ప్రభుత్వ ప్రాథమిక లక్ష్యం ఇక్కడ తీవ్రంగా నీరుగారిపోతోంది. ఈ దందాను అరికట్టేందుకు పౌరసరఫరాల శాఖ అధికారులు చర్యలు కఠినతరం చేసినా లాభం లేకుండా పోయింది. ప్రభుత్వం ఉచితంగా ఇచ్చే సన్నబియ్యాన్ని బయట మార్కెట్లో అమ్మినా, కొనుగోలు చేసినా చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని పౌరసరఫరాల అధికారులు హెచ్చరించడం షరామామూలుగా మారింది. దీంట్లో జరుగుతున్న అవినీతిని అరికట్టేందుకు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు పెద్దగా చొరవ చూపడం లేదు. దీంతో వ్యారం యధావిధిగా సాగుతోంది. చ్చరించారు. లబ్ధిదారులు బియ్యం అమ్ముకున్నట్లు ఆధారాలతో సహా నిరూపణ అయితే వారి రేషన్ కార్డును శాశ్వతంగా రద్దు చేస్తారు. వరుసగా ఆరు నెలల పాటు రేషన్ సరుకులు తీసుకోని వారిని అనర్హులుగా గుర్తించి జాబితా నుంచి తొలగిస్తారు. ఆకస్మిక తనిఖీల్లో బియ్యం నిల్వల్లో తేడాలు వచ్చినా, రీసైక్లింగ్ దందాలో భాగస్వామ్యమైనా డీలర్ల లైసెన్సులను రద్దు చేసి క్రిమినల్ కేసులు నమోదు చేస్తారు. ప్రభుత్వం వేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వెచ్చించి ఉచితంగా అందిస్తున్న ఆహార ధాన్యాలను కేవలం ఆకలి తీర్చుకోవడానికే ఉపయోగించాలి. వ్యాపార వస్తువుగా మార్చి చట్టపరమైన సమస్యల్లో చిక్కుకోవద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఆహార భద్రత కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని వేగవంతం చేసింది. ఇందులో భాగంగా అర్హులైన ప్రతి కుటుంబానికీ రాబోయే 15 రోజుల్లో కొత్త రేషన్ కార్డుల పంపిణీ పూర్తి చేస్తామని రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. పౌర సరఫరాల శాఖను నేరుగా ప్రజల చెంతకు చేర్చాలనే తపనతోనే ప్రభుత్వం ఈ చర్యలు తీసుకుంటోంది. గతంలో ఇచ్చిన దొడ్డు బియ్యాన్ని తినలేక రీసైక్లింగ్‌కు తరలించే దుస్థితి ఉండేదని, దానిని మారుస్తూ దేశంలోనే తొలిసారిగా తెల్ల రేషన్ కార్డుదారులందరికీ ఉచితంగా నాణ్యమైన సన్న బియ్యం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 3.42 కోట్ల మంది పేదలు లబ్ధి పొందుతున్నారు. గత పదేళ్లలో రేషన్ కార్డులు అందక ఇబ్బంది పడిన వారికి ఉపశమనం కలిగిస్తూ.. ప్రభుత్వం కొత్తగా 16 లక్షల కుటుంబాలను రేషన్ పరిధిలోకి తీసుకువచ్చింది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 1.06 కోట్ల కుటుంబాలకు ఈ స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా ఆహార భద్రత అందుతోంది. ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు వంటి సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలు కావడానికి కూడా ఈ కార్డులు ఎంతో కీలకం కానున్నాయి. అయితే ప్రభుత్వాలు కఠిన చర్యలు తసీఉకోనంత వరకు ఈ దందా ఆగదు. అక్రమంగా తరలింపు కూడా ఆతదని పాలకులు గుర్తించాలి.

# పత్తి రైతులను నిండా ముంచిన అధికారులు



### టిఆర్ఎస్ పత్రాలతో బురిడీ కొట్టించిన సెక్రటరీలు
### ఏడుగురి సస్పెన్షన్‌తో బయటపడ్డ వైనం
### వ్యవహారంపై లోతుగా దర్యాప్తు చేస్తున్న అధికారులు

హైదరాబాద్ : పంట ఏదైనా రైతులు చిత్తవుతున్నారు. పంటలు దండిగి పండించినా గిట్టుబాటు ధరలు లేకపోవడం, మోసపోవడం ఏటా షరామామూలుగా మారింది. ప్రధానంగా మార్కెట్ కమిటీలు, ఉత్సవ విగ్రహాల్లా మారాయి. రైతుల ప్రయోజనాలను కాపాడాల్సిన మార్కెటింగ్ అధికారులు, దళారులతో కుమ్మక్కవుతున్నారు. లేని రైతుల పేరుతో టెంపరరీ రిజిస్ట్రేషన్ పత్రాలు సృష్టించి కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) అధికారులనే బురిడీ కొట్టిస్తున్నారు. రైతుల వద్ద తక్కువ ధరకు పత్తిని కొని ఎక్కువ రేటుకు అమ్ముకొని కోట్లు వెనకేసుకున్నారు. ఈ క్రమంలో మార్కెట్ కమిటీ సెక్రటరీలకు భారీ మొత్తంలో ముట్టజెప్పారు. కొందరు సీసీఐ అధికారులు, రైతుసంఘాల నుంచి ఫిర్యాదులు రావడంతో ఉన్నతాధికారులు ఎంక్వైరీ చేయగా, అక్రమాలు బయటపడ్డాయి. దీంతో ఏడుగురు మార్కెట్ సెక్రటరీలను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ కావడం రెండు శాఖల్లో సంచలనం సృష్టించింది. టీఆర్ పత్రాలు చేతిలో ఉండడంతో మార్కెట్ కార్యదర్శులు, దళారులతో కలిసి అక్రమాలకు తెరలేపారు. పత్తి రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొన్న దళారులు పత్తి క్వాలిటీ లేదని, గింజ పొడవు లేదని, మాయిశ్చర్ రావడం లేదని రకరకాల సాకులు చెప్పి క్వింటాల్ రూ.5 వేలు, ఆలోపే కొని సీసీఐకి రూ.7,121 చొప్పున అమ్ముకున్నారు. ఈక్రమంలో ఒక్కో క్వింటాల్‌కు రూ.2 వేల చొప్పున కోట్లు వెనకేసుకొని.. మార్కెట్ కార్యదర్శులకు కమిషన్ కింద లక్షల్లో ముట్టజెప్పారు. టీఆర్ పత్రాలపై పదే పదే అవే పట్టాదారు పాస్‌బుక్ నంబర్లు వేస్తే దొరికి పోయే ప్రమాదం ఉండడంతో ఏజెన్సీలోని పోడు, పట్టాబుక్‌లు లేని ఇతర భూముల్లో పత్తి పండించినట్లు చూపిస్తూ.. దందా కొనసాగించారు. ముఖ్యంగా ఏజెన్సీ భూములు ఎక్కువగా ఉన్న ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మార్కెట్ల పరిధిలో ఈ తరహా అక్రమాలు ఎక్కువగా జరిగినట్టు మార్కెటింగ్?శాఖ అధికారులు గుర్తించారు. రైతులు సీసీఐ ఏర్పాటుచేసిన కేంద్రాల్లో పత్తిని విక్రయించాలం టే ముందుగా ఆయా మండలాల్లోని వ్యవసాయ అధికారుల వద్ద తమ పేర్లను నమోదు చేసుకోవాలి. ఇందుకు పట్టా పాస్‌బుక్, ఆధార్ కార్డు వెంట తీసుకెళ్లి.. తాను ఈ సీజన్‌లో ఎన్ని ఎకరాల్లో పత్తి సాగుచేస్తున్నది, ఎంత దిగుబడి వస్తున్నది వివరించాలి. దీనిని ధ్రువీకరించుకున్నాక సంబంధిత ఏఈవో రిజిస్ట్రేషన్ చేసుకుంటారు. అనంతరం సీసీఐ కేంద్రాల్లో పత్తిని అమ్ముకునే ముందు సంబంధిత ఏఈవో దగ్గరికి వెళ్తే రిజిస్ట్రేషన్? పత్రాలను ఇస్తారు. వాటిని మార్కెట్‌కు తెస్తేనే సీసీఐ అధికారులు కొనుగోలు చేస్తారు. కానీ ఈ విషయం తెలియని రైతులు నేరుగా సీసీఐ కేంద్రాలకు పత్తిని తీసుకొస్తున్నారు. ఇలాంటి వారు వేల మంది ఉండడంతో వీరికి టెంపరరీ రిజిస్ట్రేషన్( పత్రాలు జారీ చేసే అధికారాన్ని మార్కెట్ సెక్రటరీలకు మార్కెటింగ్‌శాఖ అప్పగించింది. ఇది దళారులకు వరంగా మారింది. టీఆర్ అక్రమాలపై సీసీఐ అధికారులతోపాటు కొందరు రైతు సంఘాల నేతలు ఫిర్యాదు చేయడంతో మార్కెటింగ్‌శాఖ ఉన్నతాధికారులు ఇటీవల ఆదిలాబాద్, చెన్నూర్, పెద్దపల్లి, వరంగల్, జనగామ, భద్రాచలం, సిద్దిపేట జిల్లాల్లో విచారణ చేశారు. ఆయా చోట్ల సీసీఐ కొనుగోళ్ల కోసం జారీ చేసిన టెంపరరీ రిజిస్ట్రేషన్‌లో తేడాలను గుర్తించి నివేదిక పంపించారు. దీంతో ఆయా జిల్లాల్లో సెక్రటీరీలపై వేటు పడింది. ఆఫీసర్ల పాత్రపైనా ఆ శాఖ ఉన్నతాధికారులకు లేఖ రాసినట్టు తెలిసింది. మార్కెటింగ్‌శాఖ అధికారులు ఇచ్చిన ఆధారాలతో ఆయా చోట్ల పలువురు ఏఈవోలపైనా వేటు పడవచ్చనే చర్చ జరుగుతున్నది.

# వందశాతం పంచాయితీ పన్నుల వసూలు లక్ష్యం

### స్పెషల్ టీమ్స్‌తో ఇంటి పన్నులకు యత్నం

కామారెడ్డి : కామారెడ్డి జిల్లాలో 100 శాతం ఇంటి పన్నుల వసూళ్లపై యంత్రాంగం దృష్టి సారించింది. నిధులు లేక పంచాయితీలు నీరసించడంతో పాటు, అభివృద్ధి ఆగిపోయింది. జిల్లాలో కచ్చితంగా వందశాతం ఇంటి పన్నులు , ఇతర పన్నులను వసూళ్లు చేస్తాం అని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్‌రావు అన్నారు. ఇప్పటికే 74 శాతం దాటింది. మిగతా 26 శాతాన్ని మార్చి చివరి వరకు పూర్తి చేస్తామన్నారు. మార్చి మొదటి వారం వరకు పన్నుల వసూళ్లపై సమీక్షించి ఎక్కువగా బకాయిలు ఉన్న పంచాయతీల్లో స్పెషల్ టీమ్స్‌ద్వారా పూర్తి స్థాయిలో కలెక్షన్ చేయిస్తామని అన్నారు. పన్నులు పూర్తి స్థాయిలో కలెక్షన్‌అయితే గ్రామాల్లో పనులు చేపట్టానికి వీలుంటుందని వివరించారు. ఇంటి పన్నులు డ్యూ ఉంటే వారి చేత కట్టిస్తున్నారు. ఈ ఏడాది మార్చి 31కి ఆర్థిక సంవత్సరం ముగింపు ఉన్న దృష్ట్యా అప్పటి లోగా100 శాతం ఇంటి పన్నులు వసూళ్లు చేయటం లక్ష్యంగా పెట్టుకున్నారు. ఎక్కువగా ఇంటి పన్నులు చెల్లించని గ్రామాలు, మండలాలను గుర్తించి అవసరమైతే స్పెషల్? టీమ్స్? ఏర్పాటు చేయనున్నారు. మార్చి 2వ వారం వరకు అధిక మొత్తంలో కలెక్షన్లు ఉన్న చోట మండల పరిధిలోని పంచాయతీ సెక్రెటరీలు, ఎంపీవోలు టీమ్‌గా వెళ్లి కలెక్షన్ చేస్తారు. పన్నులు చెల్లించటం ద్వారానే గ్రామాల్లో వీధి దీపాలు (స్ట్రీట్? లైట్లు) శానిటేషన్‌ను సక్రమంగా చేపట్టడానికి వీలుంటుందని ప్రజలకు తెలియజేస్తూ పూర్తిస్థాయిలో పన్నులు చేయటానికి కార్యాచరణ రెడీ చేస్తున్నారు. జిల్లాలో 535 గ్రామ పంచాయతీల్లో 2024-25 ఆర్థిక ఏడాదిలో ఇంటి పన్నులు చెల్లించాల్సింది రూ. 7.97 కోట్లు కాగా.. ఇప్పటి వరకు రూ. 6. 17 లక్షలు మాత్రమే వసూల్ అయ్యాయి. నాన్ ట్యాక్స్‌ల కింద రూ. 2.71 కోట్లకు రూ. 2 కోట్లు వచ్చాయి. ఇంటి పన్నులు, ఇతర ట్యాక్స్‌లు కలిపి ఇప్పటి వరకు మొత్తం రూ. 8 .19 కోట్లు కలెక్ట్ అయ్యాయి. ఆర్థిక ఏడాది మరో 45 రోజులే మిగిలి ఉండటంతో మిగతా ట్యాక్స్ వసూలుకు చర్యలు తీసుకుంటున్నారు. అవసరమైతే స్పెషల్‌టీమ్స్‌ఏర్పాటు చేసి 100 శాతం పన్నులు వసూళ్లు చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. గ్రామాల్లో వీధి దీపాల నిర్వహణ, శానిటేషన్ కార్మికుల జీతాలు, ఇతర స్టాప్? జీతాలు, బ్లీచింగ్, ఆఫీసు నిర్వహణ, బోర్ మోటార్ల నిర్వహణ ఇంటి పన్నులపై ఆధారపడి ఉంటాయి. ఇంటి పన్నులు, నీటి కుళాయి బిల్లులు, నాన్ ట్యాక్స్‌ల లాంటి పన్నుల ద్వారానే పంచాయతీకి ఆదాయం వస్తుంటుంది. ఈ పన్నులు పూర్తి స్థాయిలో కలెక్షన్ అయితేనే స్థానికంగా ఇబ్బందులు లేకుండా పాలన అందించటానికి వీలుంటుంది. పంచాయతీల్లో వసూళ్లు అయ్యే వివిధ రకాల పన్నులపై ఎప్పటికప్పుడు సంబంధిత బ్యాంక్ అకౌంట్లలో జమ చేసి ట్రెజరీ ద్వారా ఖర్చు చేస్తున్నారు. గతంలో ఏండ్ల తరబడి ఇంటి పన్నులు బకాయిలు ఉండేవి. కానీ పంచాయతీలకు సెక్రటరీల నియామకం తర్వాత అన్ని పంచాయతీల్లో 100 శాతం పన్నులు వసూళ్లు చేయాలని జిల్లా అధికారులు లక్ష్యంగా పెట్టారు. ప్రతినెలా మండలాల వారీగా పన్నుల వసూళ్లపై రివ్యూ చేస్తున్నారు. వివిధ ధ్రువీకరణ పత్రాలు పంచాయతీ నుంచి జారీ చేసేటప్పుడు సంబంధిత ఇంటి యజమాని పన్నులు పెండింగ్ లో లేకుండా చూస్తున్నారు.

# ద్వారంపూడిలో అతిపెద్ద ఆదియోగి విగ్రహం

### కోయంబత్తూరు నమూనాలో ఏర్పాటు

రాజమండ్రి : తెలుగు రాష్ట్రాల్లోనే అతిపెద్ద ఆదియోగి విగ్రహం ఏర్పాటయ్యింది. 60 అడుగుల ఎత్తు, 100 అడుగుల వెడల్పుతో ఈ విగ్రహాన్ని ఆంధ్రా శబరిమలగా ప్రసిద్ధిగాంచిన ద్వారపూడి అయ్యప్ప స్వామి ఆలయం వద్ద నిర్మించారు. మహాశివరాత్రి పర్వదినం రోజున ఈ విగ్రహాన్ని ప్రారంభించనున్నారు. తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరు ఈసా యోగా కేంద్రంలో ఉన్న ఆదియోగి విగ్రహ నమూనా ఆధారంగా అచ్చం అలాంటి విగ్రహాన్నే ద్వారపూడిలో ఏర్పాటు చేశారు. కోయంబత్తూరులో ఉన్న విగ్రహం 112 అడుగుల ఎత్తు, 82 అడుగుల వెడల్పులో ఉంటుంది. అదే నమూనాను బిక్కవోలు మండలం కొమరిపాలెం కు చెందిన శిల్పి పెద్ద రాఘవ బృందం పదినెలలు పాటు శ్రమించి ఈ విగ్రహాన్ని రూపొందించారు. సుమారు రూ.20 లక్షల వ్యయంతో పూర్తిగా సిమెంట్ తో ఈ విగ్రహాన్ని నిర్మించినట్లు ఆలయ గురుస్వామి ఎస్ఎల్ కనకరాజు తెలిపారు. ఇప్పటికే ద్వారపూడి అయ్యప్ప స్వామి ఆలయ ప్రాంగణంలో అరుదైన శివాలయం, వెంకటేశ్వర స్వామి ఆలయాలతో పాటు పదుల సంఖ్యలో ఆలయాలు రూపుదిద్దుకున్నాయి. ఇప్పుడు ఈ ఆదియోగి విగ్రహం ద్వారా ఈ ఆలయానికి మరింత ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. మండపేట మండలానికి చెందిన ఈ ద్వారపూడి.. రాజమహేంద్రవరం నుంచి 20 కిలోమీటర్లు, అనపర్తికి నుంచి రెండు కిలోమీటర్ల దూరంలో సామర్లకోట కెనాల్ రోడ్ ను ఆనుకుని ఈ ఆలయం ఉంటుంది.


# విహారయాత్ర విషాదాంతం

### ఈత కోసం తుంగభద్ర నదిలో దిగిన డాక్టర్ మృతి

హైదరాబాద్ : హైదరాబాద్‌కు చెందిన ఓ లేడీ డాక్టర్‌కు ఈతే ఆమె పాలిట మృత్యువుగా మారింది. కర్ణాటక రాష్ట్రంలోని హంపిలో ఈ ఘటన చోటుచేసుకుంది. హంపి వద్ద హైదరాబాద్‌కు చెందిన లేడీ డాక్టర్ మృతి తీవ్ర కలకలం రేపుతోంది. విహారయాత్రకు వెళ్లిన అనన్యరావు ఈత కోసం తుంగభద్ర నదిలో దూకారు. అయితే కాసేపటికే నీటి ప్రవాహంలో ఆమె కొట్టుకుపోయారు. రెండు రోజుల క్రితం స్నేహితులతో కలిసి ట్రిప్‌కు వెళ్లారు డాక్టర్ అనన్య రావు. హంపిలోని ఓ రిసార్ట్‌లో స్నేహితులతో కలిసి స్టే చేశారు. బుధవారం మధ్యాహ్నం 2 గంటల తర్వాత తుంగభద్ర నదిని చూసేందుకు వెళ్లిన సమయంలో ఆ నదిలో ఈతకొట్టాలని వారు భావించారు. ఈ క్రమంలో డాక్టర్ అనన్య రావు 25 అడుగుల ఎత్తు నుంచి కిందకు దూకారు. కాసేపు స్విమ్మింగ్ చేశారు. అయితే కొద్దిసేపటికే మరోవైపు నుంచి అలలు రావడంతో నీటి ప్రవాహంలో డాక్టర్ కొట్టుకుపోయారు. ఈ విషయాన్ని గుర్తించిన స్నేహితులు ఆమెను కాపాడేందుకు తీవ్రంగా ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. తుంగభద్రలో అనన్యరావు దూకుతున్న దృశ్యాలను స్నేహితులు వీడియో తీశారు. రెండు నిమిషాల పాటు స్విమ్మింగ్ చేయగా.. ఆ సమయంలో వ్యతిరేక దిశలో అలలు రావడంతోనే లేడీ డాక్టర్ కొట్టుకుపోయినట్లు తెలుస్తోంది. స్థానికంగా ఉన్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు స్నేహితులు. వెంటనే వారు అక్కడకు చేరుకుని దాదాపు మూడు గంటల పాటు తుంగభద్ర నదిలో గాలింపు చర్యలు చేపట్టి ఎట్టకేలకు అనన్యరావు మృతదేహాన్ని బయటకు తీశారు. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ డాక్టర్ కుమార్తె అనన్యరావు. ఆమె కూడా డాక్టర్ చదవు పూర్తి చేశారు. ఈ నేపథ్యంలో స్నేహితులతో కలిసి విహారయత్రకు వెళ్లిన అనన్యరావు ప్రాణాలు కోల్పోయింది. కుమార్తె మృతి సమాచారం తెలుసుకున్న అనన్యరావు తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగిపోయారు.

# శివుడికి పంచామృత అభిషేకకం శ్రేష్టం

శ్రీశైలం : పరమశివునికి అత్యంత పవిత్రమైన పండుగలలో శివరాత్రి ప్రధానమైనది. ఈ పండుగ భక్తులకు ఎంతో విశిష్టమైనది. ఈ పర్వదినాన శివుని ఆరాధించడం, శివలింగానికి పూజలు చేయడం ఎంతో పుణ్యప్రదమని నమ్ముతారు. ఈ సమయంలో శివలింగానికి అనేక పదార్థాలు సమర్పిస్తారు. వాటిలో పాలు ముఖ్యమైనవి. కొన్ని ప్రాంతాలలో పంచామృతంతో అభిషేకం చేస్తారు. పంచామృతం అంటే పాలు, పెరుగు, తేనె, నెయ్యి, చక్కెర కలిపిన మిశ్రమం. మహాశివరాత్రి పూజలో భక్తి, శ్రద్ధ ముఖ్యమైనవి. శివునికి ప్రీతికరమైన పదార్థాలను సమర్పించి ఆయనను ప్రార్థించడం వల్ల మనోభీష్టాలు నెరవేరుతాయి. రాగి చెంబులో పాలు పోయకూడదనే నియమం గురించి తెలుసుకొని దానికి అనుగుణంగా పూజ చేయడం మంచిది. భక్తితో శివుని పూజించడం వల్ల సకల శుభాలు కలుగుతాయని విశ్వాసం. ఏదైనా సందేహం ఉంటే పూజారులు లేదా పెద్దల సలహా తీసుకోవడం మంచిది. అయితే రాగి చెంబులో పాలు పోసి శివలింగానికి సమర్పించకూడదని శాస్త్రాలు చెబుతున్నాయి. పాలు వస్తువులలోని నెగటివ్ ఎనర్జీని తొలగిస్తాయని నమ్మకం. అలాగే పాలు దాదాపు ప్రతి పూజలోనూ ఉపయోగిస్తారు. పాలు స్వచ్ఛతకు, పవిత్రతకు చిహ్నంగా భావిస్తారు. రాగి ఆరోగ్యానికి కూడా మంచిది. కానీ రాగికి కొన్ని పరిమితులు ఉన్నాయి. కొన్ని పదార్థాలతో రాగి చర్య జరుపుతుంది. పాలు ఏ వస్తువు నుండైనా నెగటివ్ ఎనర్జీని గ్రహిస్తాయి. రాగి చెంబు చుట్టూ ఏదైనా అశుద్ధం ఉంటే రాగి చెంబులో పాలు పోసినప్పుడు ఆ అశుద్ధం పాలతో కలిసిపోతుంది. దీనివల్ల పాలు అపవిత్రమవుతాయి. అలాంటి పాలను శివలింగానికి సమర్పించడం మంచిది కాదు. శివునికి సమర్పించే పాలు స్వచ్ఛంగా, పవిత్రంగా ఉండాలి. అందుకే రాగి చెంబులో పాలు పోసి శివలింగానికి సమర్పించకూడదు. హాశివరాత్రి రోజున శివుడిని భక్తితో పూజించడం వల్ల ఆయన అనుగ్రహం పొందవచ్చు. శివలింగానికి స్వచ్ఛమైన పాలతో అభిషేకం చేయడం ఎంతో పుణ్యప్రదమని భక్తులు విశ్వసిస్తారు. అయితే రాగి చెంబులో పాలు పోసి అభిషేకం చేయకూడదు.



ఆధ్యాత్మికం

# కరీంనగర్ కార్పొరేషన్‌పై 'జెన్--జీ వాచ్‌డాగ్' నిఘా!

## ● కొండా సుస్మిత వీధి రౌడీ లాగా మాట్లాడడం దారుణం ● ప్రజల మధ్యన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి క్షమాపణ చెప్పాలి ● కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు

**కరీంనగర్ టౌన్, ఆగస్టు22(ది క్రైమ్ న్యూస్)** కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో అవినీతికి అడ్డుకట్ట వేయడంతో పాటు ప్రజలకు పారదర్శకమైన పాలన అందించేందుకు కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు సరికొత్త కార్యాచరణకు శ్రీకారం చుట్టనున్నారు. నగరంలో తొలిసారిగా యువతను భాగస్వామ్యం చేస్తూ 'జెన్--జీ విజిలెన్స్ వాచ్‌డాగ్ కమిటీ'ని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు.కరీంనగర్ మైత్రి హోటల్‌లో శనివారం మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నర్సన్న, కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు, సర్పంచులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, కాంగ్రెస్ నాయకులతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో రాజేందర్‌రావు ఈ కీలక ప్రకటన చేశారు.అవినీతిపై ప్రజలే 'వాచ్‌డాగ్' నగరపాలక సంస్థలో జరుగుతున్న అభివృద్ధి పనులు, ఇంజనీరింగ్ పనులు, టౌన్ ప్లానింగ్ వ్యవహారాలపై నిరంతరం పర్యవేక్షణ ఉండేలా 40 నుంచి 50 మందితో ప్రత్యేక విజిలెన్స్ వాచ్‌డాగ్ కమిటీని ఏర్పాటు చేస్తామని రాజేందర్‌రావు తెలిపారు.ఈ కమిటీలో యువ లాయర్లు, ఆర్టీఐ కార్యకర్తలు, ఐటీ ప్రొఫెషనల్స్‌తో పాటు ప్రజా సమస్యలపై అవగాహన ఉన్న యువతను ఎంపిక చేస్తామని చెప్పారు. "అవినీతిని చూస్తూ ఊరుకునే పరిస్థితి ఇక ఉండదు. ప్రజల డబ్బుతో చేపట్టే ప్రతి అభివృద్ధి పనికి లెక్క ఉండాలి. ప్రతి పనిపై ప్రజలకు సమాచారం అందుబాటులో ఉండాలి" అని రాజేందర్‌రావు స్పష్టం చేశారు. ఆర్టీఐతో సమాచారం.. క్షేత్రస్థాయిలో తనిఖీలు నగరపాలక సంస్థ చేపడుతున్న అభివృద్ధి పనులకు సంబంధించిన వివరాలను ఆర్టీఐ ద్వారా సేకరించి, వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలిస్తామని తెలిపారు. ఏ డివిజన్‌లో ఏ పని మంజూరైంది? ఎంత నిధులు కేటాయించారు? టెండర్ విలువ ఎంత? పనులు ఎక్కడ జరుగుతున్నాయి? నాణ్యత ఎలా ఉంది? బిల్లులు ఎలా చెల్లించారు? వంటి అంశాలను పరిశీలిస్తామని చెప్పారు. పేపర్లపై ఒకలా.. క్షేత్రస్థాయిలో మరోలా ఉండే పరిస్థితులకు చెక్ పెట్టడమే వాచ్‌డాగ్ కమిటీ లక్ష్యమని పేర్కొన్నారు. టౌన్ ప్లానింగ్‌పై ప్రత్యేక నిఘా:కరీంనగర్ నగరంలో పెద్ద పెద్ద కాంప్లెక్సులు, వాణిజ్య భవనాలు, ఇతర నిర్మాణాలకు సంబంధించిన అనుమతులపై కూడా వాచ్‌డాగ్ కమిటీ ప్రత్యేక దృష్టి సారిస్తుందని రాజేందర్ రావు తెలిపారు. సాంక్షన్డ్ ప్లాన్, నిర్మాణం జరిగిన తీరు, అనుమతులకు విరుద్ధంగా డివియేషన్లు ఉన్నాయా? తదితర అంశాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తామని చెప్పారు. "అనుమతి ఒకటి.. నిర్మాణం మరొకటి అనే పరిస్థితి ఉండకూడదు. నిబంధనలు అందరికీ సమానంగా వర్తించాలి" అన్నారు.'చైన్ గ్యాంగ్' వ్యవహారాలపైనా నిఘా నగరపాలక సంస్థలో చైన్‌మెన్‌లు, డ్రైవర్లు, రిటైర్డ్ ఉద్యోగులు తదితరుల ద్వారా అవినీతి వ్యవహారాలు సాగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయని రాజేందర్‌రావు పేర్కొన్నారు.అలాంటి ఆరోపణలు, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, మధ్యవర్తిత్వ వ్యవహారాలపై కూడా వాచ్‌డాగ్ కమిటీ దృష్టి సారిస్తుందని చెప్పారు. "ఎవరైనా అధికారిక వ్యవస్థను అడ్డుపెట్టుకుని ప్రజలను ఇబ్బంది పెడితే.. ఆ వ్యవహారాన్ని కూడా పరిశీలిస్తాం. ప్రజలకు ఇబ్బంది కలిగించే ఏ వ్యవహారాన్నీ వదిలిపెట్టం" అని అన్నారు. ఏసీబీ తలుపు తట్టడం ఆందోళనకర పరిణామం ఇటీవల నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ విభాగంలో ఏసీబీ అధికారులు తనిఖీలు నిర్వహించిన విషయాన్ని ప్రస్తావిస్తూ రాజేందర్‌రావు స్పందించారు."టౌన్ ప్లానింగ్ విభాగం వద్దకు ఏసీబీ అధికారులు వచ్చే పరిస్థితి ఏర్పడిందంటే.. అక్కడ సమస్య ఎంత తీవ్రమైనదో ప్రజలు అర్థం చేసుకోవాలి. అవినీతికి తావులేని వ్యవస్థను తీసుకురావాల్సిన అవసరం ఉంది" అన్నారు.ప్రధాన చౌరస్తాల్లో 'వాచ్‌డాగ్' నంబర్లు ప్రజలు నగరపాలక సంస్థ అధికారులతో లేదా టౌన్ ప్లానింగ్ విభాగంతో ఇబ్బందులు ఎదుర్కొంటే వెంటనే సమాచారం అందించేలా ప్రత్యేక వ్యవస్థను రూపొందిస్తామని రాజేందర్‌రావు తెలిపారు.వాచ్‌డాగ్ కమిటీ సభ్యుల సంప్రదింపు నంబర్లను నగరంలోని ప్రధాన చౌరస్తాల్లో హోర్డింగుల ద్వారా ప్రదర్శిస్తామని చెప్పారు. అవసరమైన హోర్డింగుల ఏర్పాటుకు తన సొంత ఖర్చుతో ముందుకు వస్తానని తెలిపారు. వెలిచాల ప్రజా కార్యాలయం ద్వారా కూడా ఈ కార్యక్రమంపై విస్తృత ప్రచారం నిర్వహిస్తామని చెప్పారు. అలాగే ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్ తదితర సోషల్ మీడియా వేదికల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తామని తెలిపారు.'క్లీనింగ్ ఆపరేషన్'కు శ్రీకారం నగరపాలక సంస్థలో ప్రజలకు ఇబ్బందులు కలిగించే వ్యవహారాలను గుర్తించి, వ్యవస్థను ప్రక్షాళన చేసే దిశగా 'క్లీనింగ్ ఆపరేషన్' నిర్వహిస్తామని రాజేందర్‌రావు ప్రకటించారు. టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్ విభాగాల్లో ప్రజలకు ఇబ్బందులు లేకుండా పారదర్శకమైన విధానాలను తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. కరీంనగర్ నగరపాలక సంస్థలో గత బీఆర్ఎస్ పాలకుల కంటే ప్రస్తుతం బీజేపీ పాలకుల హయాంలో అవినీతి వ్యవహారాలు మరింత పెరిగినట్లు తమకు సమాచారం వస్తోందని రాజేందర్‌రావు ఆరోపించారు. "ఎవరు అధికారంలో ఉన్నా అవినీతికి కాంగ్రెస్ వ్యతిరేకమే. ప్రజల డబ్బు దుర్వినియోగం కాకూడదు. పాలకులు మారినా వ్యవస్థలో పారదర్శకత రావాలి" అన్నారు.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణను అన్ని రంగాల్లో దేశంలోనే అగ్రగామిగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని రాజేందర్‌రావు తెలిపారు.ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి రెండింటినీ సమానంగా అందించడంతో పాటు పాలనలో పారదర్శకతకు ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు.మంత్రి కొండా సురేఖ కుమార్తె సుస్మిత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై చేసిన వ్యాఖ్యలను రాజేందర్‌రావు తప్పుబట్టారు. కాంగ్రెస్ పార్టీ సభ్యత్వం



లేకపోయినా ముఖ్యమంత్రి, మంత్రిపై అనుచితంగా విమర్శలు చేయడం సరికాదన్నారు. "రెండు మూడు సార్లు ఇదే విధంగా వ్యవహరించారు. ముఖ్యమంత్రిని విమర్శిస్తే మాత్రం సహించేది లేదు. ప్రజల ముందు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సుస్మిత క్షమాపణలు చెప్పాలి" అని డిమాండ్ చేశారు.కరీంనగర్‌లో 22ఏ నిషేధిత భూముల సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని రాజేందర్‌రావు తెలిపారు. రేకుర్తి, విద్యానగర్, కొత్తపల్లి ప్రాంతాలకు సంబంధించి దాదాపు 140 సర్వే నంబర్లలో సుమారు వెయ్యి ఎకరాల వరకు భూములు 22ఏ నిషేధిత జాబితాలోకి వెళ్లినట్లు బాధితులు తన దృష్టికి తీసుకొచ్చారని చెప్పారు. రిజిస్ట్రేషన్లు నిలిచిపోవడంతో బాధిత కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, పిల్లల చదువులు, వివాహాలు, ఇతర అవసరాలకు కూడా డబ్బు సమకూర్చుకోలేని పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ఈ సమస్య తన దృష్టికి వచ్చిన వెంటనే సుమారు 300 మంది బాధితులను వెలిచాల ప్రజా కార్యాలయానికి పిలిపించి వారి సమస్యలను స్వయంగా విన్నానని రాజేందర్‌రావు తెలిపారు. అనంతరం సమస్య పరిష్కారం కోసం జగిత్యాలకు వెళ్లి రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశానని చెప్పారు. మంత్రి సానుకూలంగా స్పందించి జిల్లా కలెక్టర్‌కు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారని తెలిపారు. 22ఏ సమస్యపై జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రాతో రెండుసార్లు మాట్లాడానని రాజేందర్‌రావు తెలిపారు. కలెక్టర్ కూడా సానుకూలంగా స్పందించారని, ఈ అంశంపై సీసీఎల్ఏ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నామని హామీ ఇచ్చారని చెప్పారు. "ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా స్థాయిలో ఈ సమస్య పరిష్కారానికి చర్యలు కొనసాగుతున్నాయి. అతి త్వరలోనే 22ఏ బాధితులకు పరిష్కారం లభిస్తుందనే నమ్మకం ఉంది" అని రాజేందర్‌రావు అన్నారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే రాష్ట్రవ్యాప్తంగా వేల ఎకరాల భూములు 22ఏ నిషేధిత జాబితాలోకి వెళ్లాయని రాజేందర్‌రావు ఆరోపించారు.ఆ సమస్యలన్నింటినీ ఒక్కొక్కటిగా పరిష్కరించి బాధితులకు ఉపశమనం కల్పించే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు."22ఏ సమస్య పరిష్కారమైతే వేలాది కుటుంబాలకు ఆర్థిక ఉపశమనం లభిస్తుంది. ఈ సమస్యను కేవలం ఒక భూ సమస్యగా చూడడం లేదు.. కుటుంబాల భవిష్యత్తుతో ముడిపడిన సమస్యగా చూస్తున్నాం. పరిష్కారం లభించే వరకు బాధితులకు అండగా ఉంటాం" అని రాజేందర్‌రావు స్పష్టం చేశారు.కరీంనగర్ కార్పొరేషన్‌లో అవినీతిని అరికట్టేందుకు యువత, ఆర్టీఐ కార్యకర్తలు, న్యాయవాదులు, ఐటీ నిపుణులను కలుపుకొని 'జెన్--జీ వాచ్‌డాగ్' ఏర్పాటు చేస్తామన్న వెలిచాల రాజేందర్‌రావు ప్రకటన రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ప్రజలు ఫిర్యాదు చేయడం మాత్రమే కాదు.. ప్రజల తరఫున వ్యవస్థను పరిశీలించే ఒక పౌర నిఘా వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నది ఈ కొత్త కాన్సెప్ట్ లక్ష్యం అని రాజేందర్‌రావు పేర్కొన్నారు.అవినీతిని ప్రశ్నించే గొంతుకకు భయపడాల్సిన అవసరం లేదు.. అవినీతి చేసే వారే భయపడాలి. కరీంనగర్‌ను పారదర్శకమైన, బాధ్యతాయుతమైన నగరంగా తీర్చిదిద్దడమే మా లక్ష్యం అని ఆయన స్పష్టం చేశారు. ఈ విలేకరుల సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న, కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు గుమ్మడి రాజకుమార్, భాస్కర్ నాయక్, ఆకుల నందిని ఉదయ్ విక్రమ్ సికిందర్, కళ్లేపల్లి శారద బాలరాజు, గంట శ్రీనివాస్ సర్పంచులు కమలాకర్ గౌడ్, తిరుపతిరెడ్డి బోగొండ ఐలయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మీసాల శంకరు జగ్గానీ కనకయ్య, ఎండి ఖాజా రావనవేని సంపత్, కాంగ్రెస్ నాయకులు గండి రాజేశ్వర్ మూల కృష్ణారెడ్డి, గసికంటి కుమార్, సముద్రాల రమణారావు, వేల్పుల వెంకటేష్ అనంతుల రమేష్ జల్లోజు శ్రీనివాస్ పత్యం రాజేష్, వేముల శ్రీనివాసు, సలీం తిప్పారపు శ్రీనివాస్, కపిల్ మాధవ్,కనకరాజు, వెలిచాల యువసేన జిల్లా అధ్యక్షుడు కాసారపు కిరణ్ కుమార్, గండి గణేష్ ఉపసర్పంచ్ కాశీపాక రాకేష్, సలీం, చిందం శ్రీనివాస్ యువజన కాంగ్రెస్ నాయకుడు కోహెడ వేణు, మీసా రమాదేవి కర్రె పావని, పోరండ్ల రమేష్ సత్తినేని శ్రీకాంత్, 22 ఏ భూ బాధితుల ఐక్యవేదిక అధ్యక్షుడు పాషా మోహన్ రెడ్డి, రేకుర్తి మాజీ ఉపసర్పంచ్ గొల్ల కృష్ణయ్య, సుధీర్ రెడ్డి, పలువురు కాంగ్రెస్ నాయకులు మాజీ ప్రజా ప్రతినిధులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# చిరంజీవితో నా అనుబంధం ప్రత్యేకం ప్రజారాజ్యంలో కలిసి పనిచేశాం

## ● మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకల్లో వెలిచాల రాజేందర్‌రావు ● చిరంజీవి యువత తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు వేల్పుల వెంకటేష్ ఆధ్వర్యంలో ఘనంగా చిరంజీవి జన్మదిన వేడుకలు వేడుకలు

**కరీంనగర్ టౌన్, ఆగస్టు22(ది క్రైమ్ న్యూస్):** మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు కరీంనగర్‌లో ఘనంగా జరిగాయి. శనివారం మైత్రి హోటల్‌లో చిరంజీవి యువత తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు వేల్పుల వెంకటేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు కరీంనగర్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వెలిచాల రాజేందర్‌రావు కేక్ కట్ చేసి చిరంజీవి అభిమానులకు స్వీట్లు తినిపించారు. అనంతరం అభిమానులు, కాంగ్రెస్ నాయకులు, కార్పొరేటర్లతో కలిసి మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా రాజేందర్‌రావు మాట్లాడుతూ మెగాస్టార్ చిరంజీవితో తనకు ఎంతో ఆత్మీయ అనుబంధం ఉందని తెలిపారు. ప్రజారాజ్యం పార్టీలో ఉన్న సమయంలో చిరంజీవితో కలిసి పనిచేశామని, ఆ రోజుల్లో తమ మధ్య మంచి సాన్నిహిత్యం ఏర్పడిందని గుర్తుచేశారు. "చిరంజీవితో నాకు ఎంతో ఆత్మీయ అనుబంధం ఉంది. ప్రజారాజ్యం పార్టీలో కలిసి పనిచేశాం. ఆయనతో మా కుటుంబానికి కూడా మంచి అనుబంధం ఉంది" అని రాజేందర్‌రావు అన్నారు.మెగాస్టార్ చిరంజీవి సినీ రంగంలో రాబోయే రోజుల్లో మరింతగా రాణించాలని, ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆయన ఆకాంక్షించారు. చిరంజీవి అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కేక్ కట్ చేసి, స్వీట్లు పంచుకుంటూ మెగాస్టార్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో



మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న,కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు గుమ్మడి రాజకుమార్, భాస్కర్ నాయక్, ఆకుల నందిని ఉదయ్, ఇక్రమ్ సికిందర్, కళ్లేపల్లి శారద బాలరాజు, గంటమిడిదొడ్డి కపిల్ మాధవ,గాలిపెల్లి కుమార్ శ్రీనివాసు రావనవేని సంపత్, సముద్రాల రమణారావు, జల్లోజు శ్రీనివాస్, పత్యం రాజేష్, వేముల శ్రీనివాసు, సలీం తిప్పారపు శ్రీనివాస్, కనకరాజు, కాసారపు కిరణ్ కుమార్, గండి గణేష్ రాకేష్, సలీం, కోహెడ వేణు, మీసా రమాదేవి,కర్రె పావని, పోరండ్ల రమేష్ సత్తినేని శ్రీకాంత్, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రెస్ క్లబ్ అధ్యక్షుడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర నాయకులు దామెర రామ్ సుధాకర్ రావు



**ధర్మపురి, ఆగస్టు 22, (ది క్రైమ్ న్యూస్):** ధర్మపురి పట్టణ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు మధు మాధవ్ శర్మ మరియు బిజెపి సీనియర్ నాయకులు కొంపల నర్సయ్య హార్ట్ సర్జరీ ముగించుకుని ఇంటికి చేరుకున్న విషయం తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర నాయకులు దామెర రామ్ సుధాకర్ రావు వారి నివాసాలకు వెళ్లి శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. ఇద్దరూ సంపూర్ణ ఆరోగ్యంతో త్వరగా కోలుకుని సాధారణ జీవితాన్ని కొనసాగించాలని, వారికి భవిష్యత్తులో కూడా తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని దామెర రామ్ సుధాకర్ రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు గాజుభాస్కర్, మండల అధ్యక్షులు కమలాపూర్ గ్రామ సర్పంచ్ కుమ్మరి తిరుపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి బెజ్జారపూ లవన్ కుమార్, కందాల మూర్తి, పట్టణ ప్రధాన కార్యదర్శి తిరుమందాస్ నారాయణ, బీజేవైఎం నాయకులు సోమిశెట్టి శివ సాయి, మరియు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల ఆరోగ్యం, పౌష్టికాహారం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

## సర్పంచ్ పల్లె ప్రతిమ పివీరావు



**రామగిరి, ఆగస్టు 22(ది క్రైమ్ న్యూస్):-** విద్యార్థుల ఆరోగ్యం, పౌష్టికాహారం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఉందని రత్నాపూర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పల్లె ప్రతిమ పివీరావు అన్నారు. రామగిరి మండలం రత్నాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని రాంనగర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు అల్పాహారంగా ఉచితంగా ఇడ్లీ, సాంబార్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సర్పంచ్ పల్లె ప్రతిమ పివీరావు విద్యార్థులకు స్వయంగా ఇడ్లీ, సాంబార్ అందజేశారు. పాఠశాల విద్యార్థులకు పౌష్టికాహారం అందించడం ద్వారా వారి ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు చదువుపై ఆసక్తి పెరుగుతుందని పేర్కొన్నారు. విద్యార్థుల సంక్షేమం కోసం అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు గ్రామపంచాయతీ తరఫున కృషి చేస్తామని తెలిపారు. ఇప్పటి నుంచి ప్రతిరోజు అల్పాహారం పంపిణి చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఎం.ఈశ్వరమ్మ, బి. సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 9న వరంగల్ జాతీయ సదస్సును విజయవంతం చేయండి: ఎమ్మార్పీఎస్, ఎమ్ఎస్పీ పిలుపు



**కరీంనగర్ టౌన్, ఆగస్టు22(ది క్రైమ్ న్యూస్):** పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు, వచ్చే సెప్టెంబర్ 9వ తేదీన వరంగల్‌లో జరగబోయే ఎమ్మార్పీఎస్ , ఎమ్ఎస్పీ నూతన మండల కమిటీల జాతీయ సదస్సును విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ సదస్సును విజయవంతం చేయడంలో భాగంగా శనివారం కొత్తపల్లి హవేలి మండల ఇన్‌ఛార్జ్ దండు అంజయ్య మాదిగ ఆధ్వర్యంలో ఎమ్ఎస్పీ నూతన మండల కమిటీ ఎన్నికను ఏకగ్రీవంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మార్పీఎస్ కరీంనగర్ జిల్లా ఇన్‌ఛార్జ్ మందరాజు మాదిగ, జాతీయ సీనియర్ నాయకులు రుద్రవరపు రామచందర్ మాదిగలు హాజరై, నూతన కమిటీని ప్రకటించారు.ఎమ్ఎస్పీ కొత్తపల్లి హవేలి నూతన మండల కమిటీ వివరాలు:మండల అధ్యక్షుడు కొమ్ము మహేష్ మాదిగ,అధికార ప్రతినిధి మేక అశోక్ మాదిగ,ప్రధాన కార్యదర్శి లంక రవి మాదిగ ఉపాధ్యక్షులు దేవుని నర్సింగరావు మాదిగ, కాదశి ప్రశాంత్ మాదిగ,కోశాధికారి లింగాల శివ చరణ్ మాదిగ,ఈ కార్యక్రమంలో ఎమ్ఎమ్ఎస్ కరీంనగర్ జిల్లా రూరల్ మండల్ ఇన్‌ఛార్జ్ దండు వరలక్ష్మి మాదిగ, గాలి వెంకటస్వామి మాదిగ, జేరిపోతుల మల్లేశం మాదిగ, గుడిపాక స్వామి మాదిగ, కవంపల్లి నారాయణ మాదిగ, జేరుపోతుల మధు మాదిగ, కొమ్ము రామసాయం మాదిగ, జేరిపోతుల సుదర్శన్ మాదిగ తదితర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఈ నెల 24న కరీంనగర్‌లో 'మాదిగ మహాశక్తి' ముఖ్య నాయకుల సమావేశం

## - వచ్చే నెలలో జరిగే భారీ సదస్సుకు దిశానిర్దేశం
## - మాదిగలు జెండాలు మోసేవారే కాదు.. శాసించే నాయకులుగా ఎదగాలి: కనుకం విద్యాసాగర్ పిలుపు



**కరీంనగర్ టౌన్, ఆగస్టు22(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఈ నెల 24 సోమవారం రోజున 'మాదిగ మహాశక్తి' ఆధ్వర్యంలో ముఖ్య నాయకుల అత్యవసర సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు కనుకం విద్యాసాగర్ ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే నెలలో నిర్వహించబోయే 'మాదిగ మహాశక్తి' భారీ బహిరంగ సదస్సును విజయవంతం చేయడం కోసం, ఈ దిశానిర్దేశక సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.ఈ ప్రాముఖ్యత కలిగిన సమావేశానికి ముఖ్య అతిథులుగా మాదిగల పెద్దన్న, మాజీ మంత్రి మోత్కుపల్లి నరసింహులు , రాష్ట్ర ప్రభుత్వ విప్, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ , రాష్ట్ర ఎస్సీ సెల్ చైర్మన్, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, ఉమ్మడి జిల్లాకు చెందిన కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారు.ఈ సందర్భంగా కనుకం విద్యాసాగర్ మాట్లాడుతూ మాదిగలు కేవలం పార్టీల జెండాలు మోయడానికే పరిమితం కాకూడదని, రాజకీయ నాయకులుగా ఎదిగి శాసించే స్థాయికి చేరుకోవాలన్నారు. అగ్రవర్ణ రాజకీయ నాయకులు ఎవరైనా సరే మన మాదిగలకు సముచిత ప్రాధాన్యత ఇచ్చేలా మన రాజకీయ శక్తిని చాటడమే ఈ సమావేశం యొక్క ముఖ్య ఉద్దేశమని స్పష్టం చేశారు.వచ్చే నెలలో కనీసం 20,000 మందితో భారీ ఎత్తున నిర్వహించ తలపెట్టిన 'మాదిగ మహాశక్తి' సదస్సుకు రోడ్ మ్యాప్ తయారు చేయడానికి ఈ నెల 24న కరీంనగర్ లో కనీసం 2000 మంది ముఖ్య నాయకులతో ఈ సన్నాహక సమావేశం జరుగుతుందని వివరించారు. మాదిగ సహోదరులు, నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయి ముఖ్య నాయకులు, యువకులు మరియు మేధావులు అందరూ పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఈ సమావేశాన్ని విజయవంతం చేయాలని, తద్వారా వచ్చే నెలలో జరిగే మహాసభకు పునాది వేయాలని కనుకం విద్యాసాగర్ హృదయపూర్వకంగా ప్రార్థిస్తూ పిలుపునిచ్చారు.

# జనరల్ బాడీ సమావేశంలో తమ వానిని వినిపించిన సర్పంచ్ ఆదిలక్ష్మి



**మధిర ప్రతినిధి ఆగస్టు 22 (ది క్రైమ్ న్యూస్):** మధిర మండల జనరల్ బాడీ సమావేశంలో సర్పంచ్ ఆదిలక్ష్మి తను వానిని వినిపించారు,ఇల్లూరు ఏటి పై నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి అసంపూర్తిగా ఉంది. ఈ బ్రిడ్జి పనులను త్వరగా పూర్తి చేసి, రైతులకు రవాణా సౌకర్యం కల్పించాలని సర్పంచ్ చేకూరి ఆదిలక్ష్మి గట్టిగా కోరారు. ఇల్లూరు--కొణతమాత్మకూరు గ్రామాల మధ్య వాగుపై నిర్మిస్తున్న బ్రిడ్జి పనులు 70 శాతం పూర్తయ్యాయి. మిగిలిన పనులను కూడా త్వరగా పూర్తి చేసి, రెండు గ్రామాల మధ్య రాకపోకలకు సౌకర్యం కల్పించాలని ఆమె కోరారు. ఇల్లూరు--ఖమ్మంపాడు ప్రాంతంలో గత 10 సంవత్సరాలుగా మరమ్మతులకు నోచుకోకుండా ఉన్న లిఫ్ట్‌ను వెంటనే రిపేర్ చేయాలని కోరారు. ఈ లిఫ్ట్ ద్వారా సుమారు 300 ఎకరాల వ్యవసాయ భూములకు నీటి సౌకర్యం కల్పించవచ్చని తెలిపారు. లిఫ్ట్ పనిచేయకపోవడంతో చిన్న, సన్నకారు రైతులు గత 10 సంవత్సరాలుగా ఇబ్బందులు పడుతున్నారని, వారి భూములు సాగుకు దూరంగా ఉన్నాయని పేర్కొన్నారు. కాబట్టి లిఫ్ట్‌ను త్వరగా మరమ్మతు చేసి రైతులకు సాగునీటి సౌకర్యం కల్పించాలని కోరారు. ఇల్లూరు గ్రామంలో నిర్మిస్తున్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో మొత్తం 40 ఇళ్లు ఉన్నాయి. వాటిలో 20 ఇళ్ల నిర్మాణం పూర్తయిందని, మిగిలిన 20 ఇళ్లను కూడా త్వరగా పూర్తి చేసి, అర్హులైన పేద కుటుంబాలకు 40 ఇళ్లు పూర్తి చేసి పంపిణీ చేస్తే ఇళ్లు సమస్య తీరుతుంది కావున త్వరగా పూర్తి చేసి పంపిణీ చేయాలని సర్పంచ్ కోరారు.

# మడుపల్లి ప్రసాద్ మాతృ మూర్తి మృతి పట్ల నివాళులర్పించిన కొత్తపల్లి గురు ప్రసాద్



**మధిర ప్రతినిధి ఆగస్టు 22 (ది క్రైమ్ న్యూస్):** మధిర నియోజకవర్గ ఎర్రుపాలెం మండలం రామన్న పాలెం గ్రామంలో శుక్రవారం నాడు గ్రామపంచాయతీ వార్డు సభ్యులు మడుపల్లి ప్రసాద్ మాతృ మూర్తి గుండెపోటుతో హఠాత్తుగా కన్నుమూశారు, గురు ఫౌండేషన్ చైర్మన్ కొత్తపల్లి గురుప్రసాద్ ఆమె భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి అంత్యక్రియలులో పాల్గొన్నారు,ఆమె భర్త జానుకోటి ని ఓదార్చి,, వారి కుమారుడు ప్రసాద్ కి బిడ్డలకు నైతిక స్థైర్యం కల్పించారు, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు, ఈ కార్యక్రమంలో గురుప్రసాద్ తో పాటు బొబ్బిళ్ళపాటి రమేష్, కొత్తపల్లి ప్రభాకర్, వేల్పుల ప్రభాకర్, కొత్తపల్లి ప్రశాంత్, మడుపల్లి ఉద్దండుబాబు,తో పాటు బంధువులు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఖిల్లా రోప్ వే పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలి

## ● జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్





**ఖమ్మం ప్రతి నిధి, (ది క్రైమ్ న్యూస్) ఆగష్టు 22:** ఖిల్లా రోప్ వే నిర్మాణ పనులను వేగవంతం చేసి, నిర్ణీత షెడ్యూల్ ప్రకారం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. శనివారం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఖిల్లా రోప్ వే నిర్మాణ పనుల పురోగతిని క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఇప్పటివరకు పూర్తయిన పనులు, జరుగుతున్న నిర్మాణ ప్రక్రియ, పనుల పురోగతి తదితర వివరాలను సంబంధిత అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఖిల్లా పైకి వెళ్లి నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ రోప్ వే నిర్మాణ పనులు ఆశించిన వేగంతో జరగడం లేదని, పనుల్లో వేగం పెంచాలని సూచించారు. నిర్మాణానికి అవసరమైన మెటీరియల్‌ను ముందస్తుగానే పక్కా ప్రణాళికతో సమకూర్చుకోవాలని, మెటీరియల్ కొరత కారణంగా పనులకు ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పనుల పురోగతిపై సంబంధిత అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు నిరంతరం పర్యవేక్షిస్తూ ఫాలోఅప్ చేయాలని కలెక్టర్ సూచించారు. నిర్ణీత షెడ్యూల్ ప్రకారం ప్రతి దశ పనులను పూర్తి చేసేలా పక్కా కార్యాచరణ రూపొందించుకోవాలని అన్నారు. రోప్ వే నిర్మాణంలో నాణ్యతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఖిల్లా ప్రాంతంలో షీట్ రాక్ ఉన్నందున జియాలజిస్ట్‌తో సమన్వయం చేసుకుని భౌగోళిక పరిస్థితులను పూర్తిగా పరిశీలించాలని సూచించారు. నిర్మాణానికి సంబంధించిన అవసరమైన అన్ని సాంకేతిక పరీక్షలను తప్పనిసరిగా నిర్వహించాలని ఆదేశించారు. రోప్ వే నిర్మాణం అత్యంత పటిష్టంగా, సురక్షితంగా ఉండేలా అన్ని సాంకేతిక ప్రమాణాలను పాటించాలని కలెక్టర్ అన్నారు. పనుల నాణ్యత, భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని, ప్రతి నిర్మాణ దశలో నాణ్యతా ప్రమాణాలను పరిశీలిస్తూ ముందుకు సాగాలని స్పష్టం చేశారు. పనులు వేగవంతంగా నాణ్యతతో పూర్తయ్యేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ఖమ్మం ఖిల్లాపై పర్యాటక ఆకర్షణలు అభివృద్ధి చేయాలి: ఖమ్మం ఖిల్లాకు మరింత మంది పర్యాటకులను ఆకర్షించేలా ప్రత్యేక పర్యాటక ఆకర్షణ కార్యక్రమాలు, సౌకర్యాలను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఖిల్లాపై స్టార్ గేజింగ్ కోసం టెలిస్కోప్ ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని, దీనివల్ల సందర్శకులకు ప్రత్యేక అనుభూతి కల్పించడంతో పాటు పర్యాటక ఆకర్షణ మరింత పెరుగుతుందని అన్నారు. పర్యాటకుల సౌకర్యార్థం ఖిల్లాపై ఒక క్యాంటీన్‌ను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తద్వారా పర్యాటకులకు అవసరమైన ఆహార, త్రాగునీటి సౌకర్యాలు అందడంతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించవచ్చని అన్నారు. పర్యాటకుల వాహనాల పార్కింగ్‌కు అనువైన స్థలాన్ని తహసీల్దార్ క్షేత్రస్థాయిలో పరిశీలించి గుర్తించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఖిల్లాకు వచ్చే పర్యాటకులకు సౌకర్యవంతంగా ఉండేలా పార్కింగ్ ప్రాంతాన్ని ముందస్తుగా ప్రణాళిక చేసుకోవాలని సూచించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట జిల్లా టూరిజం శాఖ అధికారి సుమన్ చక్రవర్తి, ఖమ్మం అర్బన్ మండల తహసీల్దార్ జయచంద్ర, సంబంధిత అధికారులు, ఇంజినీరింగ్ అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# రీ--సర్వే డేటా ఎంట్రీలో తప్పులకు తావులేకుండా జాగ్రత్తగా నమోదు చేయాలి

## ● జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్





**ఖమ్మం ప్రతినిధి, (ది క్రైమ్ న్యూస్) ఆగష్టు 22:** రీ--సర్వే డేటా ఎంట్రీలో తప్పులకు తావు లేకుండా జాగ్రత్తగా నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. కూసుమంచి మండలం భగత్‌వీడు గ్రామంలో కొనసాగుతున్న రీ--సర్వే, డేటా ఎంట్రీ ప్రక్రియను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ శనివారం పరిశీలించారు. కూసుమంచి తహసీల్దార్ కార్యాలయంలో జరుగుతున్న డేటా ఎంట్రీ ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్, సర్వే బృందాలు నమోదు చేస్తున్న వివరాలను క్షేత్రస్థాయి సర్వే వివరాలతో పరిశీలించారు. ఈ సందర్భంగా భగత్‌వీడు గ్రామానికి చెందిన ఎ. వీరభద్రం, కె. శ్రీనివాస రెడ్డి, పసుపులేటి నాగేశ్వరరావు, తదితరుల భూముల సర్వే వివరాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ రీ--సర్వేలో భాగంగా చేపడుతున్న డేటా ఎంట్రీ ప్రక్రియలో సర్వే బృందాలు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. భూ విస్తీర్ణం, హద్దులు, ఇతర వివరాలను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఖచ్చితంగా నమోదు చేయాలని ఆదేశించారు. శాటిలైట్ సాంకేతికతను ఉపయోగించి సర్వే నిర్వహిస్తున్నందున క్షేత్రస్థాయిలో వాస్తవంగా ఉన్న భూ విస్తీర్ణం మేరకే వివరాలు నమోదవుతాయని కలెక్టర్ తెలిపారు. రీ--సర్వే ద్వారా నమోదు చేసే భూ వివరాలు భవిష్యత్‌లో అనేక సంవత్సరాల పాటు ఉపయోగపడతాయని, అందువల్ల డేటా ఎంట్రీ సమయంలో ప్రతి వివరాన్ని ఒకటికి రెండుసార్లు పరిశీలించి నమోదు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. రీ--సర్వే పూర్తయిన అనంతరం భూ వివరాలతో పాటు కోఆర్డినేట్లతో కూడిన మ్యాప్‌ను అందించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రతి భూమికి సంబంధించిన వివరాలు ఖచ్చితంగా నమోదయ్యేలా సర్వే బృందాలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. సర్వే ప్రక్రియలో క్షేత్రస్థాయిలో గుర్తించిన వివరాలు, డేటా ఎంట్రీలో నమోదు చేసిన వివరాలకు పూర్తి అనుసంధానం ఉండేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట కూసుమంచి తహసీల్దార్ సైదులు, ఆర్ఐ జ్యోతి , సర్వే అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమకారుల సమస్యలపై సమగ్ర చర్చ జరగాలి

## ● ప్రజాభిప్రాయానికి ప్రాధాన్యత ఇవ్వాలి ● తెలంగాణ ఉద్యమకారుల సమస్యల పరిష్కారానికి బలమైన విధానాన్ని రూపొందించాలి ● తెలంగాణ ప్రజా ఫ్రంట్ పెద్దపల్లి జిల్లా కమిటీ



**రామగిరి, ఆగష్టు 22(ది క్రైమ్ న్యూస్):-** తెలంగాణ ప్రజా ఫ్రంట్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రేపు 23ఆగష్టు,2026 ఆదివారం, వరంగల్ ప్రెస్ క్లబ్, హన్మకొండలో జరిగే బహిరంగ చర్చ వేదిక కరపత్రాలు పెద్దపల్లి లోని స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద ఆవిష్కరణ చేశారు.ఈ సందర్భంగా తెలంగాణ ప్రజా ఫ్రంట్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు గుమ్మడి కొమురయ్య మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్ర సాధనలో విద్యార్థులు, యువత, ఉద్యోగులు, కార్మికులు, ప్రజలు చేసిన త్యాగాలు చారిత్రాత్మకమైనవని అన్నారు.వేలాది మంది ఉద్యమకారుల పోరాటం, అమరవీరుల త్యాగాల ఫలితంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగ సమస్య, యువతకు ఉపాధి అవకాశాలు, ప్రభుత్వ శాఖల్లో ఖాళీల భర్తీ వంటి కీలక అంశాలు పూర్తిస్థాయిలో పరిష్కారం కాలేదని జిల్లా కమిటీ ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యమకారుల హక్కులు, నిరుద్యోగ యువత సమస్యలు, ప్రభుత్వ ఉద్యోగ వ్యవస్థలో అవసరమైన మార్పులపై ప్రభుత్వం సమగ్రంగా దృష్టి సారించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. రాష్ట్ర కార్యదర్శి గాండ్ల మల్లేశం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఉద్యోగుల కమిటీ ప్రజాభిప్రాయ సేకరణ చేపడుతున్న నేపథ్యంలో తెలంగాణ ప్రజా ఫ్రంట్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 23వ తేదీన ఉదయం 11 గంటలకు వరంగల్ ప్రెస్ క్లబ్, హన్మకొండ లో నిర్వహించనున్న “బహిరంగ చర్చా--వేదిక” ఉద్యమకారులు, నిరుద్యోగ యువత, విద్యార్థులు, మేధావులు, ప్రజాసంఘాల ప్రతినిధులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై తమ అభిప్రాయాలను తెలియజేయాలని కోరారు. జిల్లాప్రధాన కార్యదర్శి పులిపాక రవీందర్ మాట్లాడుతూ... ఉద్యమకారులకు ఉపాధి, ఇళ్ల స్థలాలు, నిరుద్యోగులకు ఉపాధి కల్పన, ఖాళీ పోస్టుల భర్తీ, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు, ప్రభుత్వ ఉద్యోగ వ్యవస్థ బలోపేతం, ఉద్యోగుల సమస్యల పరిష్కారం తదితర అంశాలపై బహిరంగ చర్చ జరుగుతున్నదని పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, మేధావులు, విద్యార్థి, యువజన, మహిళలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలనీ కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రజా ఫ్రంట్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు గుమ్మడి కొమురయ్య,రాష్ట్ర కార్యదర్శి గాండ్ల మల్లేశం,జిల్లా ప్రధాన కార్యదర్శి పులిపాక రవీందర్,జిల్లా కమిటీ సభ్యుడు కంపల్లి అంజన్న, కె రాజు,రైతు సమస్యల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు ముడిమడుగుల మల్లన్న,సామాజిక ఉద్యమకారులు రామిల్ల బాపు, మంచినీళ్ల లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం పెవిలియన్ గ్రౌండ్‌లో ఘనంగా మెగాస్టార్ చిరంజీవి 72వ జన్మదిన వేడుకలు



**ఖమ్మం ప్రతినిధి, (ది క్రైమ్ న్యూస్) ఆగష్టు 22:** ఖమ్మం పెవిలియన్ గ్రౌండ్‌లో వాకర్స్ కమిటీ మరియు అభిమానుల ఆధ్వర్యంలో ఘనంగా మెగాస్టార్ చిరంజీవి 72వ జన్మదిన వేడుకలు నిర్వహించి కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టి సంబరాలు చేసుకున్నారు. అనంతరం ఒకరికి ఒకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా ఆలిండియా మెగాస్టార్ చిరంజీవి ఫ్యాన్స్ సభ్యులు పూలగార భాస్కర్ మాట్లాడుతూ. చిరంజీవి సినీ రంగంలో అందిస్తున్న సేవలను, సామాజిక కార్యక్రమాలను కొనియాడారు. మెగాస్టార్ చిరంజీవి 71 సంవత్సరాలు పూర్తి చేసుకొని 72వ సంవత్సరంలో అడుగిడుతున్న సందర్భంగా మరెన్నో సంవత్సరాలు ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వాకర్స్ కమిటీ అధ్యక్షులు రామనాథం, మాజీ కార్పొరేటర్ బుడిగెం శ్రీనివాస్, కోలగట్ల హరి, శేఖర్, యం.ఇ.ఓ దామోదర్ రెడ్డి, నర్సింహారావు, మంద వెంకటేశ్వర్లు, సొంటి వెంకట్, సీనియర్ నడక సాధకులు మరియు చిరంజీవి అభిమానులు పాల్గొన్నారు.

# గ్రామంలోని వీధుల్లో పేరుకుపోయిన చెత్త, చెదారం తొలగింపు

## రాంనగర్‌లో పారిశుధ్య పనులను పరిశీలించిన సర్పంచ్



**రామగిరి, ఆగష్టు 22(ది క్రైమ్ న్యూస్):-** రత్నాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని రాంనగర్‌లో చేపడుతున్న పారిశుద్య పనులను గ్రామ సర్పంచ్ పల్లె ప్రతిమపివీరావు శనివారం పరిశీలించారు. గ్రామంలోని వీధుల్లో పేరుకుపోయిన చెత్త, చెదారం తొలగింపు పనులను ఆమె దగ్గరుండి పరిశీలించి, పారిశుధ్య సిబ్బందికి పలు సూచనలు చేశారు.గ్రామంలో ఎక్కడా చెత్త పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, డ్రైనేజీలు, కాలువల్లో వ్యర్థాలను తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రజలు కూడా చెత్తను రోడ్లపై వేయకుండా పంచాయతీ సిబ్బందికి సహకరించాలని సర్పంచ్ కోరారు. పరిశుభ్రమైన వాతావరణం ద్వారా ప్రజల ఆరోగ్యాన్ని కాపాడవచ్చని, గ్రామాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు పంచాయతీ తరఫున నిరంతరం పారిశుధ్య కార్యక్రమాలు చేపడుతున్నామని సర్పంచ్ పల్లె ప్రతిమపివీరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్ అల్లి రమేష్ పాల్గొన్నారు.

# స్వామి వారిని దర్శించుకున్న విజిలెన్స్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ బస్వా రెడ్డి దంపతులు



**ధర్మపురి, ఆగష్టు 22, (ది క్రైమ్ న్యూస్):** జగిత్యాల జిల్లా ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి దేవస్థానమునకు విజిలెన్స్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ బస్వా రెడ్డి దంపతులు స్వామి వారిని దర్శించుకున్నారు. వీరికి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానము అధికారులు ముందుగా దేవస్థాన సాంప్రదాయం ప్రకారం సాదరంగా స్వాగతం పలికిన పిదప వేద పండితులు అర్చకులు స్వామివారి ఆశీర్వచనం అందించారు. తదుపరి దేవస్థానం సూపరింటెండెంట్ అల్వాల శ్రీనివాస్ శ్రీ స్వామివారి శేష వస్త్రం ప్రసాదం చిత్రపటం ఇచ్చి సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో దేవస్థానం సూపరింటెండెంట్ అల్వాల శ్రీనివాస్, వేదపండితులు బొజ్జ రమేష్ శర్మ, అర్చకులు నంబి నరసింహమూర్తి, అభిషేకం పురోహితులు బొజ్జా సంతోష్ కుమార్, స్థానిక సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ రవీందర్ మరియు అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# గంగమ్మ మృతికి మంత్రి అడ్లూరి సంతాపం



ధర్మపురి, ఆగష్టు 22, ,(ది క్రైమ్ న్యూస్): ధర్మపురి పట్టణ మున్సిపల్ చైర్మన్ వేముల నాగలక్ష్మి తల్లి కట్కం గంగమ్మ శుక్రవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర సంక్షేమ శాఖమంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం గంగమ్మ పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

# పాలిటెక్నిక్ విద్యార్థులకు శాపంగా మారిన జీవో 97

## ప్రభుత్వం తక్షణమే జీవో 97ని వెనక్కి తీసుకోవాలి

## పి డి ఎస్ యు సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి కె శ్రీకాంత్



**సంగారెడ్డి జిల్లా (ది క్రైమ్ న్యూస్)పఠాన్ చేరు,** ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం పి డి ఎస్ యు ఆధ్వర్యంలో స్కిల్ యూనివర్సిటీ నిర్ణయాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని పాలిటెక్నిక్ విద్యార్థుల పాలిట శాపంగా మారింది. జీవో 97ను తక్షణమే రద్దు చేయాలని పాలిటెక్నిక్ కళాశాల నుండి పఠాన్ చేరు ఎమ్మార్వో ఆఫీస్ వరకు భారీ ర్యాలీ గా వచ్చి ఎమ్మార్వో అందుబాటు లో లేకపోవడంతో డిప్యూటీ తాసిల్దార్ కి తక్షణమే జీవో 97ను రద్దు చేయాలని కోరుతూ వినతిపత్రం ఇచ్చారు, అనంతరం పి డి ఎస్ యు జిల్లా ప్రధాన కార్యదర్శి కే శ్రీకాంత్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పాలిటెక్నిక్ విద్యను శక్తిలో విలీనం చేయడానికి ప్రభుత్వం తీసుకొచ్చిన పాలిటెక్నిక్ జీవో 97ని వెంటనే వెనక్కి తీసుకోవాలని స్కిల్ యూనివర్సిటీలో పాలిటెక్నిక్ విద్యను కలపడం ద్వారా ప్రభుత్వ గవర్నమెంటుతో నడుస్తున్నందున విద్యార్థి తల్లిదండ్రులు అధిక ఫీజు భారానికి గురవుతారని అంతేకాకుండా పాలిటెక్నిక్ విద్యార్థులను నైపుణ్య నేర్చుకునే విద్యార్థులుగా కాకుండా టాటా,మహేంద్ర, టయోటా, అశోక్ లేలాండ్ లాంటి కార్పొరేట్ మాన్ఫచరింగ్ చేసే కంపెనీలకు కార్మికులను తయారు చేసే ట్రేనర్స్ గా తీర్చిదిద్దడం బాధాకరమైన విషయం, అంతే కాకుండా వీరి ఉన్నంత చదువులపై ప్రభుత్వం ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు, ప్రభుత్వాలు కార్పొరేట్ కంపెనీల తొత్తులుగా మారకుండా విద్యార్థుల ఉన్నంత భవిష్యత్తుపై దృష్టి పెట్టి దేశాన్ని అభివృద్ధి చెందే విధంగా విద్యను బోధించాలని కోరారు తక్షణమే పాలిటెక్నిక్ విద్యను శక్తిలో కలిపే నిర్ణయాన్ని వెనక్కి తీసుకుపోతే పి డి ఎస్ యు రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతారని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పి డి ఎస్ యు డివిజన్ నాయకులు సలాఉద్దీన్, రేణుక, చైత్ర, సూచన, రోహిణి, రాహుల్, సాత్విక్, తదితరులు పాల్గొన్నారు.

# సుల్తానాబాద్‌లో ప్రత్యేక లోక్ అదాలత్: ఇరు వర్గాలకు సమ న్యాయం చేకూరుతుంది: జడ్జి దుర్గం గణేశ్



**సుల్తానాబాద్, ఆగష్టు 22 (ది క్రైమ్ న్యూస్)::** లోక్ అదాలత్ లతో ఇరు వర్గాలకు సమ న్యాయం అందుతుందని సుల్తానాబాద్ జూనియర్ సివిల్ జడ్జి దుర్గం గణేశ్ అన్నారు. శనివారం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక కోర్టు ఆవరణలో ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి గణేష్ మాట్లాడుతూ.. లోక్ అదాలత్ లలో ఇరు పక్షాల అంగీకారంతో రాజీ మార్గం ద్వారా కేసులను త్వరగా పరిష్కరించుకోవచ్చని తెలిపారు. కక్షిదారులు కోర్టుల చుట్టూ తిరుగుతూ వ్యయ ప్రయాసలకు గురికాకుండా, పరస్పర అవగాహనతో తమ కేసులను ముగించుకోవాలని సూచించారు. లోక్ అదాలత్ తీర్పులపై ఎలాంటి అప్పీలు ఉండదని ఆయన స్పష్టం చేశారు. ఈ ప్రత్యేక లోక్ అదాలత్‌లో పలు క్రిమినల్ కేసులు, కుటుంబ వివాదాలు, భూమి తగాదాలు, చెక్ బౌన్స్, మరియు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులకు సంబంధించి అనేక వివాదాలను ఇరు వర్గాల అంగీకారంతో విజయవంతంగా పరిష్కరించారు. అనంతరం సమాజానికి సేవ చేసిన పలువురు సీనియర్ సిటిజన్లు, రిటైర్డ్ ఉపాధ్యాయులను జడ్జి దుర్గం గణేష్ శాలువాతో ఘనంగా సన్మానించారు. సన్మానం పొందిన వారిలో అల్లం భాగ్యలక్ష్మి – సత్యనారాయణ దంపతులతో పాటు రిటైర్డ్ ఉపాధ్యాయులు సత్యనారాయణ, ఖాలిక్, నర్సయ్య ఉన్నారు. ఈ కార్యక్రమంలో సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ నేరెళ్ల శంకరయ్య, ఏజీపీ దూడం ఆంజనేయులు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వోద్నాల రవీందర్, ఉపాధ్యక్షుడు ఆవుల శివకృష్ణ, లోక్ అదాలత్ సభ్యులు మాదూరి ఆంజనేయులు, చీకటి సంతోష్ వీరితో పాటు న్యాయవాదులు పడాల శ్రీరాములు, ఆకారపు సరోత్తం రెడ్డి, కోడం అజయ్, బోయిని భూమయ్య, జోగుల రమేష్, రుద్రారపు నర్సయ్య, గుడ్ల వెంకటేష్, వేముల స్నేహ, మాదూరి పృథ్వీ, బొబ్బిలి శ్యామ్, మందల రమేష్, కోర్టు , పోలీస్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రతి బాలబాలికకు భద్రమైన బాల్యాన్ని అందించడం మనందరి బాధ్యత

● జిల్లా న్యాయసేవా సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి నాగరాజు



**ఖమ్మం ప్రతినిధి, (ది క్రైమ్ న్యూస్) ఆగష్టు 22:** ప్రతి చిన్నారికి సురక్షితమైన, భద్రమైన బాల్యాన్ని అందించడం సమాజంలోని ప్రతి ఒక్కరి ప్రాథమిక బాధ్యత అని జిల్లా న్యాయసేవా సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం. నాగరాజు పిలుపునిచ్చారు. శనివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సమావేశ మందిరంలో జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పిల్లలకు అనుకూలమైన న్యాయ సేవల పథకం-2024 క్రింద బాలల సంరక్షణ అధికారుల కోసం ఏర్పాటు చేసిన ఒక రోజు ప్రత్యేక అవగాహన సదస్సును జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ, తల్లి కోడి తన రెక్కల కింద పిల్లలను పెట్టుకుని ప్రమాదాల నుండి ఎలా ఆప్యాయంగా కాపాడుకుంటుందో, సమాజంలో ఉపాధ్యాయులు కూడా విద్యార్థులను అదే రీతిలో ప్రేమతో, బాధ్యతతో సంరక్షించాలని అన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులకు చిన్ననాటి నుంచే చట్టాలపై, తమ ప్రాథమిక హక్కులపై స్పష్టమైన అవగాహన కల్పించాలన్నారు. పాఠశాలల్లో చిన్న పిల్లలకు 'గుడ్ టచ్.. బ్యాడ్ టచ్' గురించి సరైన రీతిలో అర్థమయ్యేలా విడమరిచి చెప్పాలన్నారు. అనవసరపు స్పర్శను గుర్తించి, వెంటనే తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు తెలిపేలా వారిలో ధైర్యాన్ని నింపాలన్నారు. విద్యార్థుల ప్రవర్తనలో ఏవైనా అసాధారణ మార్పులు (భయం, ఒంటరితనం, ఆందోళన) కనిపిస్తే టీచర్లు వెంటనే గమనించాలన్నారు. పిల్లలతో స్నేహపూర్వకంగా ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించే మార్గదర్శకులుగా నిలవాలన్నారు. బాలల సంరక్షణ అధికారులు తమ విధులను కేవలం ఒక ఉద్యోగంగా కాకుండా, సామాజిక బాధ్యతగా భావించి సమర్థవంతంగా పనిచేయాలన్నారు. బాల్య వివాహాలు, బాలకార్మిక వ్యవస్థ, పిల్లలపై జరుగుతున్న వేధింపులపై తక్షణమే స్పందించి బాధితులకు అండగా నిలవాలన్నారు. "మొక్కై వంగనిది.. మానై వంగునా.." అనే సామెతను గుర్తు చేస్తూ, బాల్యం నుంచే పిల్లలకు మంచి నడవడిక, బుద్ధులు, నైతిక విలువలు నేర్పించడం చాలా అవసరమని తెలిపారు. బాల్యాన్ని సరైన మార్గంలో తీర్చిదిద్దితేనే వారి భవిష్యత్తు, సమాజ భవిష్యత్తు బాగుంటుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి అన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ, నేటి డిజిటల్ యుగంలో సమాజం చాలా వేగంగా మారుతోందని, దీనివల్ల బాలలు ఎదుర్కొంటున్న సమస్యలు, సవాళ్లు కూడా కొత్త రూపు సంతరించుకుంటున్నాయని అన్నారు. అధికారులందరూ చట్ట పరిధిని, తాజా నిబంధనలను





క్షుణ్ణంగా అర్థం చేసుకుని, సమర్థవంతంగా విధులు నిర్వహించాలని తెలిపారు. చట్టాల అమలు క్షేత్రస్థాయిలో మాత్రమే స్పష్టమైన ఫలితాలను ఇస్తుందని, అందుకే ప్రాథమిక స్థాయిలో పనిచేసే సిబ్బందికి చట్టాలపై నిరంతరం అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఉన్నతాధికారులపై ఉందన్నారు. బాలల సంక్షేమం, హక్కుల కాపాడటంలో ఎలాంటి అలసత్వానికీ తావులేదని స్పష్టం చేశారు. ప్రతి బిడ్డకు సురక్షితమైన వాతావరణం కల్పించేలా జువైనల్ జస్టిస్ యాక్ట్, పోక్సో చట్టం వంటి విధానాలను బాధ్యతాయుతంగా అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు డా. పి.పి. కృష్ణ అర్జున్, డా. జి.వి. మహేష్ నాథ్, వి. శ్రీనయ్య, ఎం. శ్రీనివాస్, ఎం. కల్పన, వి. శివ రంజని, టి. మురళి మోహన్, పి. దేవి మానస, షేక్ మీరా ఖాసీం సాహెబ్, కె. జ్యోతిర్మయి, బి. రజని, వై. బిందుప్రియ, ఏ. ప్రవీణ్, బి. నాగలక్ష్మి, జి. అఖిల గౌడ్, వి. దీప్తి, జి. నిష్క, బి. నాగ సుమ బాల, వి. లావణ్య, జిల్లా బాల సంరక్షణ అధికారిణి విష్ణు వందన, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

# నీటి కుంటల నిర్మాణంతో భూగర్భ జలాల అభివృద్ధి

**జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**

**ఖమ్మం ప్రతినిధి, (ది క్రైమ్ న్యూస్) ఆగష్టు 22:** రైతుల పొలాల్లో నిర్మిస్తున్న నీటి కుంటలు (ఫారం పాండ్లు) భూగర్భ జలాల అభివృద్ధికి ఎంతగానో దోహదపడతాయని జిల్లా కలెక్టర్ శ్రీ దివాకర టిఎస్ అన్నారు. శనివారం కూసుమంచి మండల కేంద్రానికి చెందిన రైతు అర్వపల్లి వెంకటేశ్వర్లు పొలంలో నిర్మిస్తున్న నీటి కుంటను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రధాన రహదారి నుంచి సుమారు 600 మీటర్ల మేర డొంక రహదారిలో నడుచుకుంటూ వెళ్లి నీటి కుంట నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, నీటి కుంటల నిర్మాణం వల్ల వర్షపు నీటిని నిల్వ చేసుకోవడంతో పాటు, ఆ నీరు భూమిలోకి ఇంకి సమీపంలోని బోర్లు, బావుల్లో భూగర్భ జలమట్టం పెరుగుతుందని అన్నారు. నీటి నిల్వలు పెరగడం వల్ల భవిష్యత్తులో మత్స్య సంపద అభివృద్ధికి కూడా అవకాశం ఉంటుందని తెలిపారు. రైతులు తమ పొలాల్లో నీటి సంరక్షణకు ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం నీటి కుంట నిర్మాణం, పనుల పురోగతి, రైతులకు కలిగే ప్రయోజనాలపై సంబంధిత అధికారులతో కలెక్టర్ వివరాలు తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించి, రైతులకు ఉపయోగపడే విధంగా పనులు నాణ్యతతో చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కూసుమంచి తహసీల్దార్ సైదులు, గ్రామపంచాయతీ సర్పంచ్ కొండ కృష్ణవేణి, గ్రామపంచాయతీ కార్యదర్శి, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.





# మంచి పని చేయండి.. టైమ్‌లైన్ పాటించండి

● రామగుండం సీపీ అంబర్ కిశోర్ ఝా అధికారులు, సిబ్బందితో సమావేశం





**గోదావరిఖని క్రైమ్ (ది క్రైమ్ న్యూస్):** కేసుల దర్యాప్తు లేదా కోర్టు విచారణలో ఏ దశలోనైనా అనవసర జాప్యం జరిగితే దాని ప్రభావం చివరకు పోలీస్ శాఖకే నష్టం కలిగిస్తుందని రామగుండం సీపీ అంబర్ కిశోర్ ఝా తెలిపారు. శనివారం రామగుండం సీపీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో కోర్టు డ్యూటీ, కోర్టు లైజనింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రామగుండం సీపీ అంబర్ కిశోర్ ఝా మాట్లాడుతూ కేసులను ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేయడం వల్ల న్యాయ ప్రక్రియ బలహీనపడే అవకాశం ఉందని, అందువల్ల ప్రతి కేసు పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ నిర్ణీత టైమ్‌లైన్‌లో పూర్తి చేయాలని ఆదేశించారు. పోలీస్ శాఖ బృంద లక్ష్యాలు, నిర్దిష్ట గమ్యాల సాధన దిశగా పనిచేసే వ్యవస్థ అని, వ్యక్తిగత ప్రతిభతో పాటు ప్రతి అధికారి అందించే కృషి మొత్తం బృందం విజయానికి దోహదపడాలని అన్నారు. అందరూ ఒకే దిశలో, ఒకే లక్ష్యంతో పనిచేస్తే మెరుగైన ఫలితాలు సాధించవచ్చని పేర్కొన్నారు. న్యాయం జరిగే కోర్టు ప్రాంగణంలో అవినీతికి ఎలాంటి స్థానం ఉండకూడదని, విధుల నిర్వహణలో ప్రతి ఒక్కరూ నిజాయితీ, పారదర్శకతను పాటించాలని సూచించారు. గత రెండు, మూడు నెలలుగా కోర్టు కేసుల పర్యవేక్షణలో గణనీయమైన పురోగతి సాధించామని, ఆ స్థాయిని కొనసాగించేందుకు మరింత క్రమశిక్షణతో, పట్టుదలతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. దర్యాప్తు అధికారులు, కోర్టు డ్యూటీ సిబ్బంది, పోలీస్ స్టేషన్ సిబ్బంది, పర్యవేక్షణ అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసినప్పుడే కేసుల్లో విజయవంతమైన ఫలితాలు సాధ్యమవుతాయని తెలిపారు. టీమ్‌వర్క్‌తోనే న్యాయపరమైన విజయాలు



సాధించగలమని స్పష్టం చేశారు. సిబ్బందికి వృత్తిపరంగా లేదా వ్యక్తిగతంగా ఏవైనా సమస్యలు ఉన్నా నేరుగా తనను సంప్రదించవచ్చని, సమర్థవంతంగా పనిచేసే సిబ్బందికి తగిన గుర్తింపు, ప్రోత్సాహకాలు ఉంటాయని వెల్లడించారు. విచారణ సమయంలో సాక్షులను సమర్థవంతంగా హాజరుపరచడం, సీసీటీఎన్ఎస్‌లో వివరాలు ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయడంపై ఆదేశాలిచ్చారు. ప్రతిభ చూపిన అధికారులను ఈ సందర్భంగా శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ కె.శ్రీనివాస్, సీఐ దేవయ్య, ఇన్‌స్పెక్టర్లు కిరణ్, అనిల్ కుమార్, చంద్రశేఖర్ గౌడ్, ఎస్ఐలు వినీత, సంతోష్, సీసీ సందీప్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ లక్ష్యాలు సాధించాలి: ఇంపాక్ట్ ట్రైనర్లు, వన్‌టౌన్ ఎస్ఐ

**సింగరేణి హైస్కూల్‌లో 'సే నో టు డ్రగ్స్' అవగాహన కార్యక్రమం**



**గోదావరిఖని క్రైమ్ (ది క్రైమ్ న్యూస్):** విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తూ, చెడు అలవాట్లకు దూరంగా ఉంటే అనుకున్న లక్ష్యాలను సాధించి ఉన్నత శిఖరాలకు ఎదగవచ్చని ఇంపాక్ట్ ట్రైనర్లు దేవి లక్ష్మీనర్సయ్య, మేజిక్ రాజా, వన్‌టౌన్ ఎస్ఐ మనోహర్ అన్నారు. శనివారం గోదావరిఖని విద్యానగర్‌లోని సింగరేణి హైస్కూల్‌లో 'సే నో టు డ్రగ్స్' కార్యక్రమం నిర్వహించి విద్యార్థులకు మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇంపాక్ట్ ట్రైనర్లు దేవి లక్ష్మీనర్సయ్య, మేజిక్ రాజా, వన్‌టౌన్ ఎస్ఐ మనోహర్ మాట్లాడుతూ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఎల్లప్పుడూ విద్యార్థుల మంచి కోరే శ్రేయోభిలాషులని తెలిపారు. వారు చెప్పే మంచి మాటలను అర్థం చేసుకుని ఆచరించాలే తప్ప వారిపై స్పర్ధ పెంచుకోకూడదని సోదాహరణంగా వివరించారు. మితిమీరిన సోషల్ మీడియా వినియోగం చదువుకు, భవిష్యత్తుకు ఆటంకం కలిగిస్తుందని చెప్పారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల జీవితాలు ఛిద్రమవుతాయని, విద్యార్థులు ఎట్టి పరిస్థితుల్లోనూ వాటికి అలవాటు పడకూడదని సూచించారు. మత్తు పదార్థాలను విక్రయించే, వినియోగించే వ్యక్తుల సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని ఎస్ఐ మనోహర్ కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ దర్యాప్తు అధికారిగా ఎన్. వెంకన్నకు పురస్కారం

**కుషాయిగూడ ఎస్ఐకి మల్కాజ్‌గిరి కమిషనర్ బి. సుమతి ఐపీఎస్ చేతుల మీదుగా అవార్డు**



**మేడ్చల్, ఆగష్టు 22(ది క్రైమ్ న్యూస్):** నేరేడ్‌మెట్‌లోని మల్కాజ్‌గిరి కమిషనర్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో కుషాయిగూడ పోలీస్ స్టేషన్ సబ్‌ఇన్‌స్పెక్టర్ ఎన్. వెంకన్నకు ఉత్తమ దర్యాప్తు అధికారి (ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్) పురస్కారం అందించారు. మల్కాజ్‌గిరి కమిషనర్ బి. సుమతి ఐపీఎస్ చేతుల మీదుగా వెంకన్న అవార్డు స్వీకరించారు. కేసుల దర్యాప్తులో ప్రతిభ, ఆధారాల సేకరణ, నిందితుల గుర్తింపు, కేసుల పరిష్కారంలో సమర్థవంతమైన పనితీరును పరిగణనలోకి తీసుకుని ఎన్. వెంకన్నను ఉత్తమ దర్యాప్తు అధికారిగా ఎంపిక చేశారు. విధి నిర్వహణలో నిబద్ధతతో పనిచేస్తూ కేసుల దర్యాప్తును సమర్థవంతంగా పూర్తి చేయడంలో చూపిన ప్రతిభకు ఈ పురస్కారం లభించింది. కార్యక్రమంలో ఉప్పల్ డీసీపీ కే. సురేష్ కుమార్, పోలీస్ అధికారులు, కుషాయిగూడ పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు. పురస్కారం అందుకున్న ఎన్. వెంకన్నను అధికారులు, సిబ్బంది అభినందించారు. దర్యాప్తులో ప్రతిభ కనబరిచిన అధికారులను గుర్తించి ప్రోత్సహించడం ద్వారా పోలీస్ శాఖలో కేసుల దర్యాప్తు, పరిష్కారంలో మరింత మెరుగైన ఫలితాలు సాధించేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

# పద్మాశాలి టౌన్‌షిప్‌లో బెటర్మెంట్ చార్జీలు చెల్లించాలి

**సెప్టెంబర్ 20లోపు చెల్లిస్తే రాయితీలు.. అధ్యక్షుడు సీత అంజనేయులు**




**మేడ్చల్, ఆగష్టు 22(ది క్రైమ్ న్యూస్):** కాప్రాలోని భావనాఋషి కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ (పద్మాశాలి టౌన్‌షిప్) పరిధిలో ప్లాట్లు కలిగి ఉన్న ప్రతి సభ్యుడు కాలనీ అభివృద్ధి కోసం బెటర్మెంట్ చార్జీలు చెల్లించాలని సొసైటీ అధ్యక్షుడు సీత అంజనేయులు కోరారు. శనివారం సొసైటీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఉపాధ్యక్షుడు అతినగరం సుదేష్, కార్యవర్గ సభ్యులు గుర్రం విశ్వేశ్వరరావు, కర్నాటి నాగభూషణంతో కలిసి ఆయన మాట్లాడారు. జీహెచ్ఎంసీ నిబంధనల ప్రకారం సొసైటీ పరిధిలో రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ తదితర మౌలిక వసతుల అభివృద్ధి పనులను ఇప్పటికే సుమారు 1,800 మంది సభ్యులు చెల్లించిన బెటర్మెంట్ చార్జీలతో పూర్తి చేసినట్లు తెలిపారు. కాలనీలో చేపట్టాల్సిన మరిన్ని అభివృద్ధి పనులకు అవసరమైన నిధుల కోసం మిగిలిన సభ్యులు కూడా బెటర్మెంట్ చార్జీలు చెల్లించాలని కోరారు. సెప్టెంబర్ 20వ తేదీలోపు చెల్లించే సభ్యులకు రాయితీలు కల్పిస్తామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బెటర్మెంట్ చార్జీలు చెల్లించని సభ్యులపై సొసైటీ బైలాస్ ప్రకారం చర్యలు తీసుకుంటామని, అవసరమైతే సెల్ డీడ్ రద్దు కోసం కోర్టును ఆశ్రయిస్తామని సీత అంజనేయులు తెలిపారు. సొసైటీ నుంచి ఎన్ఓసీ తీసుకోకుండా కాలనీలో ప్లాట్ల కొనుగోలు, విక్రయాలు చేయవద్దని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా జరిగే లావాదేవీలపై కాప్రా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం, ఎంఎంసీ కాప్రా సర్కిల్ అధికారులకు ఫిర్యాదు చేస్తామని చెప్పారు. కాలనీ అభివృద్ధికి ప్రతి సభ్యుడు సహకరించి బెటర్మెంట్ చార్జీలు చెల్లించాలని కోరారు.

# మంత్రి చొరవతో వైకుంఠ రథం



**రామగిరి, ఆగస్టు 22(ది క్రైమ్ న్యూస్):** కమాన్ పూర్ గ్రామపంచాయతీకి రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్‌బాబు చొరవతో వైకుంఠ రథం రావడం జరిగిందని కమాన్ పూర్ సర్పంచ్ రంగు సతైన గౌడ్ తెలిపారు. మండల అభివృద్ధిలో భాగంగా కమాన్‌పూర్ గ్రామ పంచాయతీకి వైకుంఠ రథం మంజూరైనట్లు సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చొరవతో ఈ వాహనం మంజూరైనట్లు పేర్కొన్నారు. గ్రామపంచాయతీ పరిధిలోని ప్రజలకు అంత్యక్రియల సమయంలో రవాణా పరంగా ఎదురయ్యే ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వైకుంఠ రథాన్ని అందుబాటులోకి తీసుకురావడం ఎంతో ప్రయోజనకరమన్నారు. ముఖ్యంగా ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొనే కుటుంబాలకు ఈ వాహనం అండగా నిలుస్తుందని తెలిపారు. అవసరమైన సందర్భాల్లో గ్రామపంచాయతీ పరిధిలోని ప్రజలకు వైకుంఠ రథం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని సర్పంచ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మహమ్మద్ రఫిక్ సోహెల్, పంచాయతీ కార్యదర్శి రాము, వార్డు సభ్యులు గుంజపడుగునవీన్,పచ్చునూరిరాజ్‌కుమార్,గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# మానవతను చాటుకున్న గాయత్రి విద్యాసంస్థల విద్యార్థులు



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** బసంత్ నగర్ సమీపంలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కరీంనగర్ లోని ఒక్క ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పెద్దపల్లి జిల్లాలోని చీకురాయికి చెందిన పింకాశి సతీష్ కుటుంబాన్ని గాయత్రి విద్యాసంస్థల చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్ పరామర్శించారు.వారి భార్య కుమారుడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు తదుపరి గాయత్రి విద్యానికేతన్, గాయత్రి జూనియర్ కళాశాల, గాయత్రి డిగ్రీ అండ్ పీజీ కళాశాల విద్యార్థులు నుండి సేకరించిన విరాళాల 32,000 రూపాయలను గాయత్రి విద్యాసంస్థల చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్ చేతుల మీదుగా పింకాశి సతీష్ కు అందజేశారు. వారి భార్య కుమారుడి పరిస్థితి చాలా విషమంగా ఉందని దాతలు ముందుకు వచ్చి ఆర్థిక సహాయం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గాయత్రి విద్యాసంస్థల కరస్పాండెంట్ అల్లెంకి శ్రీనివాస్, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# అభివృద్ధి అంటేనే అమీన్ పూర్ ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

## ● పలు కాలనీలలో రూ.8.19 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన.. ● కాలనీల్లో పర్యటించి ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకున్న ఎమ్మెల్యే జీఎంఆర్



**సంగారెడ్డి జిల్లా(ది క్రైమ్ న్యూస్):** అమీన్ పూర్ డివిజన్ లోని ప్రతి కాలనీని ప్రణాళికాబద్ధమైన అభివృద్ధితో ఆదర్శ కాలనీలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని పటాన్ చేరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, కాలనీల్లో నెలకొన్న ప్రతి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు తాము, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజల సమన్వయంతో ముందుకు సాగుతున్నామని స్పష్టం చేశారు. శనివారం అమీన్ పూర్ డివిజన్ రాజేంద్ర రెడ్డి కాలనీ, సాయి అంబిక కాలనీ, పిఎన్ఆర్, నరేంద్ర నగర్, సాయిరామ్ ఎంక్లేవ్, శంకర్ గ్రీన్ హోమ్స్, బృందావన్ టీచర్స్ కాలనీ, నవ్య నందనవనం కాలనీ, నర్రేగూడెం రాజీవ్ గృహకల్ప కాలనీలలో పర్యటించిన ఎమ్మెల్యే జిఎంఆర్.. మొత్తం రూ.8.19 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, అంతర్గత మురుగు నీటి కాలువల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయా కాలనీల్లో ప్రజలు, సంక్షేమ సంఘాల ప్రతినిధులతో ఎమ్మెల్యే నేరుగా సమావేశమై స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సీసీ రోడ్లు, యూజీడీ, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం తదితర సమస్యలపై చర్చించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రతి ఇంటికీ తాగునీరు అందించడమే లక్ష్యం.. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ అమీన్ పూర్ లో దశాబ్దాలుగా కొనసాగుతున్న మంచినీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించామని తెలిపారు. ఇప్పటికే అనేక ప్రాంతాలకు తాగునీటి సరఫరా అందిస్తున్నామని, కొత్తగా ఏర్పడుతున్న కాలనీలకు సైతం తాగునీటిని అందించేందుకు అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేసినట్లు వెల్లడించారు. ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు చర్యలు, కాలనీల్లోని ప్రభుత్వ స్థలాలు, పార్కులు ఆక్రమణలకు గురికాకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు పార్కుల అభివృద్ధి, పచ్చదనం పెంపుపై దృష్టి సారిస్తున్నట్లు చెప్పారు. పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా అవసరమైన మేరకు అదనపు సిబ్బందిని నియమించి, నిరంతర పారిశుద్ధ్య నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా మౌలిక వసతులు అమీన్పూర్‌లో వేగంగా విస్తరిస్తున్న నూతన కాలనీల కారణంగా విద్యుత్ డిమాండ్ గణనీయంగా పెరిగిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా నూతన సబ్‌స్టేషన్ల ఏర్పాటు, అదనపు పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు వంటి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని విద్యుత్ మౌలిక వసతులను బలోపేతం చేస్తున్నామని చెప్పారు. అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం అవసరం, అభివృద్ధిలో ప్రజలు కూడా భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే జిఎంఆర్ పిలుపునిచ్చారు. ప్రభుత్వ నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులను ప్రజలు పర్యవేక్షిస్తూ, వాటి నాణ్యతపై సూచనలు ఇవ్వాలని కోరారు. ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు ఎలాంటి నిర్లక్ష్యం వహించకూడదని స్పష్టం చేస్తూ, అవసరమైన చోట నిధులు సమకూర్చేందుకు తాను సిద్ధంగా ఉన్నానని తెలిపారు. అమీన్ పూర్లో అభివృద్ధి ఒక నిరంతర ప్రక్రియ, ప్రతి కాలనీలో మౌలిక వసతులు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువచ్చి ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అమీన్ పూర్ జిహెచ్ఎంసి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్, మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, మాజీ ఎంపీపీ దేవానందం, డిఈ వెంకటరమణ, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఉపేందర్ రెడ్డి, గోపాల్, మల్లేష్, కృష్ణ, రాములు, బిజిలి రాజు, జగదీష్, బాలరాజు, చంద్రశేఖర్, యూసుఫ్, మల్లేష్, బాల్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# ప్రజా పాలనా?...లేక పంచాయతీల పాలనా?

## ● అధికార పార్టీలో రోజుకో రచ్చ ● పూటకో పంచాయతీ! ● హామీలు గాలికి... పంచాయితీలు నెత్తికి ● ది క్రైమ్ న్యూస్ ప్రత్యేక కథనం..




**బ్యూరో,(ది క్రైమ్ న్యూస్):** పల్లెటూర్లలో వెనుకటి తరం పెద్దలు ఒక కథ చెప్పేవాళ్లు. అప్పు ఇచ్చినవాడు ఎప్పుడైనా ఇంటికి వస్తే చాలు... భార్యాభర్తలు కావాలనే(ఉత్తుత్తిగనే) లొల్లి మొదలుపెట్టి బండ బూతులు తిట్టుకుంటూ, కొట్టుకుంటూ గొడవపడేవారట. ఎందుకంటే రేపు పంచాయతీలో తమ గొడవకు అతడినే గవాయిగా పెట్టుకోవాలి, మరోసారి బాకీ వసూలుకు ఇంటికి రాకూడదు కదా.. అందుకని. ఆ తలనొప్పి భరించలేక అప్పు ఇచ్చినవాడు "ఈ గవాయి బాధ నాకెందుకు నాయనో!" అంటూ అక్కడి నుంచి పారిపోయేవాడట. ఇప్పుడు రాష్ట్రంలో అధికార పార్టీ పరిస్థితి కూడా అచ్చం అలాగే కనిపిస్తోందని ప్రజలు వ్యంగ్యంగా నవ్వుకుంటున్నారు. ప్రజలు ప్రశ్నించకుండా ఉండేందుకు... నాయకులే నాయకులతో పంచాయతీలు పెట్టుకుంటున్నారు! ఇచ్చిన హామీలు ఏమయ్యాయి? రైతుల సమస్యలు ఎక్కడున్నాయి? నిరుద్యోగుల బాధలు ఎవరు పట్టించుకుంటారు? ధరలు, రైతు సమస్యలు, ప్రజా సమస్యలపై సమాధానం చెప్పాల్సిన వాళ్లు... నిత్యం ఒకరి మీద ఒకరు ఆరోపణలు చేసుకోవడంలోనే బిజీ! ఒకరి కుంభకోణాలను మరొకరు బయటపెడుతున్నారు. ఒకరి మీద మరొకరు బురద చల్లుకుంటున్నారు. పదవుల కోసం పాకులాడుతున్నారు. రోజుకో పంచాయతీ... పూటకో గొడవ! ఇంతకీ ఈ పంచాయతీలు ప్రజల కోసమా? పదవుల కోసమా? రాష్ట్రంలో సమస్యలు మాత్రం కొండలా పేరుకుపోతున్నాయి. కానీ వాటిపై మాట్లాడేందుకు వీళ్లకు సమయం లేదు. ప్రజల గోడు వినేందుకు తీరిక లేదు. ఎందుకంటే అధికార పార్టీలోనే ఎవరు ఎవరిని గవాయిగా పెట్టుకుంటారో తెలియని పరిస్థితి! నాయకులు వాళ్లలో వాళ్లే తన్నుకుంటూ ఉంటే... "మా సమస్యలు ఎవరికి చెప్పాలి బాబూ?" అంటూ రైతులు నవ్వుకుంటున్నారు. రోజూ ఒక కొత్త పంచాయతీ. రోజూ ఒక కొత్త ఆరోపణ. రోజూ ఒక కొత్త రాజకీయ డ్రామా. చూస్తుంటే ప్రజలకు ఒక పాత సినిమా పేరు గుర్తొస్తోంది... "అసెంబ్లీ రౌడీ"ని తలపిస్తున్న రాజకీయ రచ్చ!అంటున్నారు కానీ ఒక్క తేడా ఉంది... సినిమాలో రౌడీలు కొట్టుకుంటే హీరో రంగ ప్రవేశం చేయడంతో ప్రేక్షకులు నవ్వుతారు. ఇక్కడ నాయకులు కొట్టుకుంటే... ప్రజలు మాత్రం ఏడుస్తున్నారు. ప్రజలు కోరేది పంచాయతీలు కాదు... పరిష్కారాలు. బూతులు కాదు... భరోసా. పదవుల కోసం పోటీ కాదు... ప్రజల కోసం పని. నాయకులారా... మీ పంచాయతీలకు మీరే గవాయిలుగా ఉండండి. ప్రజల సమస్యలకు మాత్రం గవాయిలుగా మారి పారిపోకండి, ఇది ప్రజా పాలనా? లేక ఉత్తుత్తి పంచాయతీల పాలనా? అంటూ రైతన్నలు రచ్చబండల దగ్గర ముచ్చట్లు పెట్టుకుంటున్నారు.

# ప్రజలకు మెరుగైన సేవలు అందేలా చర్యలు

## ● సీజనల్ వ్యాధుల నియంత్రణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలి: జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** గ్రామాల్లో పరిపాలన పురోగతిపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రజలకు మెరుగైన సేవలు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. శనివారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో పంచాయతీ అధికారులతో జిల్లా కలెక్టర్ గ్రామాల్లో పరిపాలన పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, గ్రామాలు, రహదారులు పరిశుభ్రంగా ఉండేలా నిరంతరం చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామాల్లో చేపట్టిన పారిశుధ్య పనులను అధికారులు క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని ఆదేశించారు. గ్రామాల్లో నిర్మించిన డంపింగ్ యార్డులు, సెగ్రిగేషన్ షెడ్లను పూర్తిస్థాయిలో వినియోగించాలని సూచించారు. రోడ్లపై ప్లాస్టిక్ వ్యర్థాలు లేకుండా చర్యలు చేపట్టాలని, పారిశుధ్య నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా చూడాలని స్పష్టం చేశారు. సీజనల్ వ్యాధుల నియంత్రణకు పకడ్బందీ చర్యలు అమలు చేయాలని, గ్రామాల్లో రోడ్లపై ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. దోమల నివారణకు గ్రామాల్లో క్రమం తప్పకుండా ఫాగింగ్ నిర్వహించాలని సూచించారు. అర్హులైన లబ్ధిదారులకు నూతన పింఛన్లు మంజూరయ్యేలా గ్రామస్థాయిలో చర్యలు చేపట్టాలని తెలిపారు. నూతన పింఛన్ల కోసం వచ్చే ప్రతి దరఖాస్తును ఆన్‌లైన్‌లో నమోదు చేసి, క్షేత్రస్థాయిలో పక్కా విచారణ నిర్వహించాలని ఆదేశించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ సూచించారు. గ్రామాల్లో అక్రమ నిర్మాణాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతులు జారీ చేయవద్దని స్పష్టం చేశారు. అక్రమ నిర్మాణాలు జరగకుండా పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామాల్లో పారిశుధ్యం, ప్రజారోగ్యం, సంక్షేమ పథకాల అమలు, పంచాయతీ పరిపాలన తదితర అంశాలపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టి, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో ఇంచార్జ్ జిల్లా పంచాయతీ అధికారి శ్రీమాల, డివిజనల్ పంచాయతీ అధికారులు, మండల పంచాయతీ అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అంజయ్య నగర్‌లో ఆరు అంతస్తుల భవనం కూలి ఇద్దరు మృతి

## - మృతుల కుటుంబాలకు కోటి రూపాయల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలి: రవికుమార్ యాదవ్ - అక్రమ, నాణ్యతలేని నిర్మాణాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్





**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** అంజయ్య నగర్ డివిజన్ పరిధిలోని అంజయ్య నగర్ కాలనీలో నాణ్యత ప్రమాణాలు పాటించకుండా నిర్మించిన ఆరు అంతస్తుల భవనం కూలిపోయిన ఘటనలో ఇద్దరు కార్మికులు మృతి చెందగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు. భవనం పక్కనే ఉన్న అపార్ట్‌మెంట్‌పై కూలిపోవడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇన్‌చార్జి రవికుమార్ యాదవ్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ అంజయ్య నగర్‌లో కేవలం 50 గజాల స్థలంలో ఆరు అంతస్తుల భవనం నిర్మించడం నిబంధనలకు విరుద్ధమని ఆరోపించారు. గచ్చిబౌలి, హైటెక్ సిటీ ప్రాంతాలకు సమీపంలో ఉండటంతో అధిక అద్దెలకు ఆశపడి 50, 60, 80, 100 గజాల స్థలాల్లోనే ఆరు నుంచి తొమ్మిది అంతస్తుల వరకు భవనాలు నిర్మిస్తున్నారని అన్నారు. అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాల్సిన అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికార పార్టీ నాయకులు తమ బాధ్యతలను విస్మరిస్తున్నారని విమర్శించారు. లంచాలకు అలవాటుపడి అక్రమ నిర్మాణాలకు అండగా నిలవడం వల్లే ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని ఆరోపించారు. అంజయ్య నగర్, సిద్ధిక్ నగర్ ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలపై గతంలో పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ అధికారులు పట్టించుకోలేదని రవికుమార్ యాదవ్ పేర్కొన్నారు. అక్రమ నిర్మాణాల కారణంగా పార్కింగ్ సమస్యలు, తరచూ పొంగిపొర్లే డ్రైనేజీ, సరైన నాలాలు లేకపోవడం, అత్యవసర సమయంలో వాటర్ ట్యాంకర్లు వెళ్లేందుకు కూడా అవకాశం లేకపోవడం వంటి సమస్యలతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇకనైనా ప్రభుత్వం, హైడ్రా, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ప్రత్యేక సర్వే నిర్వహించి అనుమతులు లేకుండా నిర్మించిన అధిక అంతస్తుల భవనాలను, నాణ్యత ప్రమాణాలు పాటించని నిర్మాణాలను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రమాదంలో మృతి చెందిన ప్రతి కార్మికుడి కుటుంబానికి కోటి రూపాయల చొప్పున నష్టపరిహారం అందించాలని, గాయపడిన వారికి ప్రభుత్వం పూర్తిస్థాయిలో వైద్య ఖర్చులు భరించాలని కోరారు. ఘటనకు బాధ్యులైన నిర్మాణదారులు, సంబంధిత అధికారులపై సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు రవి నాయక్, జిల్లా అధికార ప్రతినిధి ఆంజనేయులు సాగర్, నాయకులు మన్యం కొండ సాగర్, ధనరాజ్, సరోజ రెడ్డి, ఆమని, మల్లికార్జున్ తదితరులు, స్థానిక కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

## యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు చీమల సందీప్



**రామగిరి, ఆగస్టు 22(ది క్రైమ్ న్యూస్):** కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని మంథని నియోజకవర్గ అధ్యక్షుడు చీమల సందీప్ అన్నారు. శనివారం రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, దుద్దిళ్ల శీను బాబుల ఆదేశాల మేరకు కమాన్ పూర్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రెబల్ రాజ్ కుమార్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చీమల సందీప్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడంలో యువజన కాంగ్రెస్ కీలకపాత్ర వహించాలని అన్నారు ప్రతి గ్రామంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. మంథనియోగ వర్గానికి రాష్ట్ర మంత్రి అభివృద్ధి ప్రదాతగా నిలిచి కోట్లాది రూపాయలు మంజూరు చేయించడం జరుగుతుందని స్పష్టం చేశారు అనేక సంక్షేమ పథకాలు చేయడం జరుగుతుందని వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లి పూర్తి స్థాయిలో ప్రచారం చేయాలని అన్నారు. ప్రతి కాంగ్రెస్ కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని పేర్కొన్నారు. మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షునిగా రెబల్ రాజ్ కుమార్ ఇప్పటికే కొనసాగుతుండగాప్రధాన కార్యదర్శులుగా భూష శ్రావణ్ ,కుమ్మరి సాయికుమార్, ఉపాధ్యక్షులుగా ఆకుల వెంకటేష్, బిల్లా వెంకటేష్, కార్యదర్శులుగా చొప్పరి శ్రీకాంత్, కోల రాజేష్,అధికార ప్రతినిధిగా వేల్పుల సాయి భవాని, కోశాధికారులుగా రేగొండ సందీప్ ,దొంతల రమేష్, ప్రచార కమిటీ కన్వీనర్ గా గుంజపడుగు నరేష్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు జెమినీ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ గృహాలు



**రామగిరి,ఆగస్టు 22(ది క్రైమ్ న్యూస్):** అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ గృహాలు ఇవ్వడం జరుగుతుందని కమాన్ పూర్ మండలం పేరా పల్లి సర్పంచ్ బొంగోని సరే గౌడ్ అన్నారు. శనివారం రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు పేరాపల్లి గ్రామపంచాయతీ వద్ద లబ్ధిదారులకు ఇందిరమ్మ గృహాల మంజూరి పత్రాలను సర్పంచ్ సదయ్య అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలను గుర్తించి ఇందిరమ గృహాలు ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. అర్హులైన వారి కే ప్రతి ఒక్కరికి అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి సాయి శ్రీ, ఉపసర్పంచ్ పల్లవి, ఫీల్డ్ అసిస్టెంట్ రవి కాంగ్రెస్ సీనియర్ నాయకులు చిన్నోజు రాజయ్య తోపాటు నాయకులు పాల్గొన్నారు.

# మహా ధర్నాకు అనుమతి కోరుతూ కలెక్టర్‌కు టి జేఏసీ వినతి పత్రం





**మంచిర్యాల టౌన్, ఆగస్టు 22, ( ది క్రైమ్ న్యూస్):** ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కొరకు 27న జరగబోయే మహా ధర్నా కార్యక్రమం అనుమతి కోరుతూ శనివారం మంచిర్యాల జిల్లా కలెక్టర్,ఏసీపీ లను కలసి వినతిపత్రంను అందజేసిన టీజీజాక్ చైర్మన్ గడియారం శ్రీహరి, సెక్రటరీ జనరల్ కే. వనజ రెడ్డి. ఈ సందర్భంగా గడియారం శ్రీహరి ఉద్యోగుల సమస్యలను జిల్లా కలెక్టర్ కి తెలియజేసారు. టీజీజాక్ రాష్ట్ర చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాస్ రావు, కార్యవర్గం తీసుకున్న నిర్ణయం మేరకు మంచిర్యాల అన్ని వర్గాల ఉద్యగులు ఐ డి ఓ సి నస్పూర్ లో మహా ధర్నా కార్యక్రమం శాంతియుతంగా నిర్వహించబోతునట్టు తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఉద్యోగుల గోంతిక పత్రిక ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీజీజాక్ నాయకులు శ్రీనివాస్ దేశపాండే, అత్తె సుధాకర్, పొన్న మల్లయ్య, శ్రీపతి బాపు రావు, శ్రవణ్ కుమార్, గోపాల్ రాంకుమార్, తిరుపతి,నడిమెట్ల సత్యనారాయణ,ఎండీ యూసఫ్ రాజేందర్, వసంత్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన సొసైటీ ప్రమాణస్వీకారం



**రామగిరి, ఆగస్టు 22(ది క్రైమ్ న్యూస్):-** కమాన్ పూర్ గ్రామ గౌడ సంఘం సొసైటీ నూతన కార్యవర్గం ఎల్లమ్మ గుడి వద్ద ఎన్నుకొని ప్రమాణస్వీకారం చేశారు. నూతన అధ్యక్షుడు గా నగనూరి నర్సయ్యగౌడ్, ఉపాధ్యక్షుడు రంగు శ్రీనివాస్ గౌడ్, కోశాధికారి మల్యాల సతీష్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా గట్టు సది గౌడ్,ముఖ్య సలహాదారుడుగా పొన్నం రామచంద్ర గౌడ్,అలాగే డైరెక్టర్లుగా గర్రెపల్లి వెంకన్న గౌడ్, పడాల తిరుపతి గౌడ్, గట్టు సమ్మయ్య గౌడ్, వెంగలి రాజ గౌడ్, మడ్డి శ్రీనివాస్ గౌడ్, పొన్న వెంకన్న గౌడ్,పొన్నం సతీష్ గౌడ్, కమ్మగోని అనిల్ గౌడ్, పుల్ల చంద్రశేఖర్ గౌడ్, గౌరవ అధ్యక్షుడుగా రంగు సత్యనారాయణ గౌడ్, కమాన్ పూర్ గౌడ సంఘం సొసైటీ పాలక వర్గానికి నూతన పాలక వర్గం ఎన్నుకోబడినది.

# అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలి

- **భవన యజమానులు, బిల్డర్లపై చట్టపరమైన చర్యలు: ఆరెకపూడి గాంధీ**

**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** కొండాపూర్ డివిజన్ పరిధిలోని అంజయ్య నగర్ కాలనీలో నాలాను ఆనుకుని తక్కువ విస్తీర్ణంలో నిర్మిస్తున్న ఏడు అంతస్తుల భవనం ప్రమాదవశాత్తు ఒక్కసారిగా కుప్పకూలింది. సమాచారం అందుకున్న వెంటనే రాష్ట్ర ప్రజా పద్దుల కమిటీ (పీఏసీ) చైర్మన్ ఆరెకపూడి గాంధీ ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలను పరిశీలించారు. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డాక్టర్ జి. సృజన, హైడ్రా కమిషనర్ రంగనాథ్, జోనల్ కమిషనర్ మయాంక్ సింగ్, డీసీపీ రీతిరాజ్, తహసీల్దార్ మహిపాల్ రెడ్డి, సీసీపీ వెంకన్నతో పాటు ఎన్‌డీఆర్ఎఫ్, హైడ్రా, టౌన్ ప్లానింగ్, ఇతర విభాగాల అధికారులు ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలను చేపట్టారు. ఈ సందర్భంగా ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ భవనం ఆకస్మికంగా కూలిపోవడం అత్యంత దురదృష్టకరమని, ఘటన చాలా బాధాకరమని అన్నారు. నిర్లక్ష్యంగా నిర్మాణాలు చేపట్టిన యజమానులు, బిల్డర్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని, నిర్మాణ అనుమతులపై స్పష్టత కలిగి ఉండాలని సూచించారు. అక్రమ నిర్మాణాలను ప్రారంభ దశలోనే అడ్డుకోవాలని, అధికారుల నిర్లక్ష్యానికి తావులేకుండా ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలని గాంధీ సూచించారు. ప్రమాదం జరిగిన వెంటనే సహాయక చర్యలను వేగవంతం చేసి, బాధితులకు తక్షణ సహాయం అందించాలని అధికారులను కోరారు. యజమానులు, బిల్డర్ల అత్యాశ కారణంగా నిబంధనలకు విరుద్ధంగా



నిర్మాణం చేపట్టడం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు గాంధీ పేర్కొన్నారు. భవనం కూలిపోవడంతో పక్కనే ఉన్న నిర్మాణాలు కూడా పాక్షికంగా దెబ్బతిన్నాయని తెలిపారు. ఈ ఘటనలో ఇద్దరు మృతి చెందడం తీవ్రంగా కలచివేసిందని, మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానన్నారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తరఫున అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొని సహాయక చర్యలను పర్యవేక్షించారు.

# ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలపై రెవెన్యూ అధికారుల కొరడా

- **జవహర్‌నగర్‌లో పలు అక్రమ కట్టడాలు కూల్చివేత..**
**కబ్జాదారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక**

**మేడ్చల్, ఆగష్టు 22(ది క్రైమ్ న్యూస్):** జవహర్‌నగర్ పరిధిలో ప్రభుత్వ భూములను ఆక్రమించి అక్రమంగా నిర్మించిన కట్టడాలపై రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టారు. ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు వెలిశాయనే సమాచారంతో కాప్రా తహసీల్దార్ మతిన్ ఆదేశాల మేరకు గిర్దావర్ సత్యనారాయణ సమక్షంలో శనివారం పలు ప్రాంతాల్లో అక్రమ కట్టడాలను జేసీబీ సహాయంతో కూల్చివేశారు. జవహర్‌నగర్‌లోని సంతోష్‌నగర్, చెన్నాపూర్, వికలాంగుల కాలనీ, కార్మికనగర్ ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి నిర్మించిన పలు కట్టడాలను అధికారులు గుర్తించారు. అనంతరం రెవెన్యూ సిబ్బంది జేసీబీతో అక్కడికి చేరుకుని అక్రమ నిర్మాణాలను తొలగించారు. ప్రభుత్వ భూములను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని అధికారులు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కాప్రా తహసీల్దార్ మతిన్ మాట్లాడుతూ జవహర్‌నగర్ ప్రాంతంలోని ప్రభుత్వ భూముల పరిరక్షణపై రెవెన్యూ శాఖ ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ప్రభుత్వ స్థలాల్లో అనుమతులు లేకుండా ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని హెచ్చరించారు. ప్రభుత్వ భూములను కబ్జా చేసి అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్న వారిపై నిఘా కొనసాగుతోందని తెలిపారు. ప్రభుత్వ భూములను ఆక్రమించి వాటిని అమాయక పేదలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్న అక్రమార్కులపై ప్రత్యేక నజర్ పెట్టినట్లు తెలిపారు. ప్రభుత్వ భూములుగా తెలిసినా వాటిని కొనుగోలు చేసి నిర్మాణాలు చేపడుతున్న వారు కూడా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి విక్రయించే వ్యక్తులపై పూర్తి వివరాలు సేకరించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. జవహర్‌నగర్ పరిధిలో ప్రభుత్వ భూముల ఆక్రమణలకు అడ్డుకట్ట వేసేందుకు రెవెన్యూ శాఖ నిరంతరం పర్యవేక్షణ చేస్తోందని మతిన్ తెలిపారు. ఇప్పటికే గుర్తించిన అక్రమ నిర్మాణాలను దశలవారీగా తొలగిస్తామని, భవిష్యత్‌లో ప్రభుత్వ స్థలాల్లో కొత్తగా నిర్మాణాలు చేపట్టకుండా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రభుత్వ భూములను రక్షించడం రెవెన్యూ శాఖ ప్రధాన లక్ష్యమని, భూముల పరిరక్షణలో భాగంగా తనిఖీలు, కూల్చివేతలు కొనసాగుతాయని తెలిపారు. ప్రభుత్వ భూముల్లో ఎలాంటి నిర్మాణాలు





చేపట్టవద్దని ప్రజలకు సూచించారు. నిబంధనలు ఉల్లంఘించి నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## కార్యకర్తలే కాంగ్రెస్ పార్టీకి వెన్నెముక ప్రతి బూత్‌ను కాంగ్రెస్‌కు బలమైన కోటగా మార్చాలి: సీవీ మోహన్

**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కార్యకర్తలే ప్రధాన బలమని, ప్రతి బూత్ స్థాయిలో పార్టీని పటిష్టం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగాలని కర్ణాటక రాష్ట్ర ఎమ్మెల్సీ, రంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షుల ఎన్నికల పరిశీలకుడు సీవీ మోహన్ అన్నారు. శనివారం జిల్లా అధ్యక్షుడు చల్లా నరసింహారెడ్డి అధ్యక్షతన, శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ వి. జగదీశ్వర్ గౌడ్ ఆధ్వర్యంలో మదీనాగూడ డివిజన్ పరిధిలోని హుడా కాలనీ ఎంఎస్‌పీ కన్వెన్షన్‌లో డీసీసీ ఎన్నికల ప్రక్రియలో భాగంగా కాంగ్రెస్ పార్టీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీవీ మోహన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సత్తుపల్లి ఎమ్మెల్యే రాధమయి, చైర్మన్లు రామ్‌రెడ్డి, పటేల్ రమేష్‌రెడ్డితో పాటు శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీవీ మోహన్ మాట్లాడుతూ “సంఘటన్ బలమే కాంగ్రెస్ బలం. కార్యకర్తే పార్టీకి వెన్నెముక” అని అన్నారు. కార్యకర్తల కష్టాన్ని గుర్తించి వారికి అండగా నిలిచే నాయకత్వం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడే సంస్థగా కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. సంఘటన్ సృజన్ అభియాన్ కేవలం కార్యక్రమం కాదని, కాంగ్రెస్ పార్టీని బూత్ స్థాయి నుంచి బలోపేతం చేసే గొప్ప సంస్థాగత నిర్మాణ ప్రక్రియ అని పేర్కొన్నారు. ప్రతి బూత్‌లో క్రియాశీల కార్యకర్తలు ఉండేలా చర్యలు తీసుకోవాలని, యువత, మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు పార్టీ సంస్థాగత నిర్మాణంలో మరింత ప్రాధాన్యత కల్పించాలని సూచించారు. టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ వి. జగదీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ కార్యకర్తలే కాంగ్రెస్ పార్టీకి బలమని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా కృషి చేయాలని, ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీకి గొప్ప చరిత్ర, సిద్ధాంతం, ప్రజలతో దశాబ్దాల అనుబంధం ఉందని, ఈ బలాన్ని ఎన్నికల విజయంగా మార్చాలంటే బలమైన సంస్థాగత వ్యవస్థ, చురుకైన కార్యకర్తలు, ప్రతి బూత్‌లో సమర్థవంతమైన నాయకత్వం అవసరమని నాయకులు పేర్కొన్నారు. పార్టీ కోసం కష్టపడుతున్న కార్యకర్తల సమస్యలను వినడం, వారికి గౌరవం ఇవ్వడం, వారి భవిష్యత్తుకు భరోసా కల్పించడం నాయకుల బాధ్యత అని అన్నారు. పార్టీ ప్రయోజనాల ముందు వ్యక్తిగత అభిప్రాయాలకు ప్రాధాన్యత ఇవ్వకూడదని, “వ్యక్తి కంటే పార్టీ.. పదవి కంటే కార్యకర్త.. రాజకీయ ప్రయోజనం కంటే ప్రజా ప్రయోజనం” ముఖ్యమని స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో ప్రతి బూత్‌ను కాంగ్రెస్ పార్టీకి బలమైన కోటగా మార్చేందుకు నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రతి కార్యకర్తను కలుపుకొని, ప్రతి బూత్‌ను బలోపేతం చేసి, ప్రతి ఇంటికి కాంగ్రెస్ పార్టీని తీసుకెళ్లాలని అన్నారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, మాజీ కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు, పోటీ చేసిన కార్పొరేటర్ అభ్యర్థులు, డివిజన్ అధ్యక్షులు, బ్లాక్ అధ్యక్షులు, డివిజన్ ఇన్‌చార్జులు, మైనారిటీ నాయకులు, లేబర్ సెల్ నాయకులు, మహిళా కాంగ్రెస్ నాయకులు, యువజన కాంగ్రెస్, ఎన్‌ఎస్‌యూఐ, సేవాదళ్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





## క్రీడలతో మానసిక ఉల్లాసం, శారీరక దృఢత్వం

**చదువుతో పాటు క్రీడలపై యువత దృష్టి సారించాలి: ఆరెకపూడి గాంధీ**




**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** మాదాపూర్ డివిజన్ పరిధిలోని మాతృశ్రీ నగర్ కాలనీలో నిర్వహించిన మాతృశ్రీ క్రికెట్ ప్రీమియర్ లీగ్‌ను పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ ముఖ్య అతిథిగా హాజరై శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ మాతృశ్రీ నగర్ కాలనీలో క్రికెట్ ప్రీమియర్ లీగ్‌ను ప్రారంభించుకోవడం సంతోషకరమైన విషయమన్నారు. క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వం లభిస్తుందని తెలిపారు. యువత చదువుతో పాటు క్రీడలకు కూడా సమయం కేటాయించాలని, క్రీడా ప్రతిభను ప్రోత్సహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని గాంధీ సూచించారు. క్రీడలు యువతలో క్రమశిక్షణ, ఆరోగ్యకరమైన పోటీ భావనను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, అనిల్ కావూరి తదితరులు పాల్గొన్నారు.

## చందానగర్ ఎస్సైపై ఏసీబీ కొరడా

**లంచం తీసుకుంటూ ఎస్సై బాలరాజు, కానిస్టేబుల్, స్టేషన్ రైటర్ అరెస్ట్**



**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** లంచం తీసుకుంటూ చందానగర్ పోలీస్ స్టేషన్ ఎస్సై బాలరాజు అవినీతి నిరోధక శాఖ అధికారులకు చిక్కారు. ఓ భూ వ్యవహారానికి సంబంధించి కేసు నమోదు చేసి, తదుపరి విచారణ కొనసాగించేందుకు డబ్బులు డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఫిర్యాదు ఆధారంగా రంగంలోకి దిగిన అవినీతి నిరోధక శాఖ అధికారులు చందానగర్ పోలీస్ స్టేషన్‌లో దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా లంచం తీసుకుంటున్న ఎస్సై బాలరాజుతో పాటు కానిస్టేబుల్ రాజ్‌కుమార్, స్టేషన్ రైటర్ రాఘవను కూడా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో ఎస్సై బాలరాజుతో పాటు ఇతరులను అవినీతి నిరోధక శాఖ అధికారులు విచారిస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించిన మరిన్ని వివరాలు అధికారికంగా వెల్లడించాల్సి ఉంది.

## బహిరంగ ప్రదేశాల్లో అసభ్యకర చర్యలకు పాల్పడుతున్న 18 మంది పట్టివేత




**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** మహిళలు, బాలికల భద్రతకు సైబరాబాద్ పోలీసులు చేపడుతున్న చర్యల్లో భాగంగా షీ టీమ్స్ 109 డీకాయ్ ఆపరేషన్లు నిర్వహించి, బహిరంగ ప్రదేశాల్లో అసభ్యకర చర్యలకు పాల్పడుతున్న 18 మందిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వీరిపై 17 చిన్న కేసులు నమోదు చేసి కౌన్సెలింగ్ నిర్వహించారు. వివిధ మార్గాల ద్వారా మహిళల నుంచి షీ టీమ్స్‌కు 25 ఫిర్యాదులు అందగా, వాటిలో 3 చిన్న కేసులు నమోదు చేసి, మిగిలిన ఫిర్యాదులకు సంబంధించి సంబంధిత వ్యక్తులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. సైబరాబాద్ యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ రెండు వ్యభిచార నిరోధక చట్టం కేసుల్లో ఇద్దరు బాధితులను రక్షించి, నలుగురు నిందితులను అదుపులోకి తీసుకుంది. అలాగే బాలల న్యాయ చట్టం కింద నమోదైన ఒక కేసులో ఇద్దరు బాలురను రక్షించి, ఇద్దరు నిందితులను పట్టుకున్నారు. భార్యాభర్తల మధ్య కుటుంబ వివాదాల పరిష్కారానికి కుటుంబ సలహా కేంద్రాలు, సీడీఈడబ్ల్యూ కేంద్రాల ద్వారా కౌన్సెలింగ్ నిర్వహించి 32 కుటుంబాలను తిరిగి ఒక్కటిగా చేర్చేందుకు పోలీసులు కృషి చేశారు. నివారణ చర్యలు, ప్రజల్లో అవగాహన పెంపొందించడంలో భాగంగా సైబరాబాద్ ఏహెచ్‌టీయూ, షీ టీమ్స్ ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో సుమారు 4,974 మంది పాల్గొన్నారు. మానవ అక్రమ రవాణా, బాలల అక్రమ రవాణా, మహిళలపై వేధింపులు, సామాజిక మాధ్యమాల్లో వేధింపులు, బాల్య వివాహాలు, బాలల హక్కులు, బాల కార్మిక వ్యవస్థ, వెంటాడటం, యాచకత్వం, సైబర్ వేధింపులు, సైబర్ మోసాలు తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అత్యవసర సమయంలో మహిళల సహాయవాణి 181, బాలల సహాయవాణి 1098, పోలీసుల 100/112, సైబర్ నేరాల ఫిర్యాదుల కోసం 1930 నంబర్లను వినియోగించుకోవాలని సూచించారు. మహిళలు, బాలలు ఎలాంటి వేధింపులకు గురైనా భయపడకుండా పోలీసులను సంప్రదించాలని పోలీసులు తెలిపారు.

## స్వామివారిని దర్శించుకున్న ఐటిఐ ప్రిన్సిపాల్



**రామగిరి,ఆగస్టు 22(ది క్రైమ్ న్యూస్):**-కమాన్ పూర్ మండల కేంద్రంలోని సుప్రసిద్ధ శ్రీ ఆది వరహాస్వామిని పెద్దపెల్లి ఐటిఐ ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు రామానుజం ప్రిన్సిపాల్, ట్రేనార్ సుధాకర్ రెడ్డిలకు అర్చన చేయించారు. స్వామివారి వద్ద ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ ముస్త్యాల దామోదర్, ఆలయ ఈవో కాంత రెడ్డి, స్వామివారి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు మల్యాల మల్లేష్, చాట్ల రాయమల్లు, సదయ్య తో పాటు కల్వల సంతు పాల్గొన్నారు.

## నిబంధనల ప్రకారం పునఃసర్వే పనులను వేగవంతంగా పూర్తి చేయాలి

**పునఃసర్వే పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా వేగవంతం చేయాలి - అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు**




**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పునఃసర్వే పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి. శ్రీరాములు సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం పెద్దపల్లి మండలం నిమ్మనపల్లి, సుల్తానాబాద్ మండలం చిన్నబొంకూర్ గ్రామాల్లో కొనసాగుతున్న పునఃసర్వే పనుల పురోగతిని అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ఇప్పటివరకు పూర్తయిన పునఃసర్వే పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పునఃసర్వే ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా పనులను మరింత వేగవంతం చేయాలని సూచించారు. నిర్ణీత సమయంలో పునఃసర్వే పనులను పూర్తి చేసేలా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని ఆదేశించారు. పునఃసర్వే నిర్వహణలో ప్రభుత్వ నిబంధనలు, నిర్దేశిత మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని అదనపు కలెక్టర్ సూచించారు. భూ వివరాల నమోదులో కచ్చితత్వం, పారదర్శకత పాటిస్తూ ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సర్వే పనులు నిర్వహించాలని తెలిపారు. క్షేత్రస్థాయిలో పునఃసర్వేకు సంబంధించి ఎదురయ్యే సమస్యలను వెంటనే గుర్తించి పరిష్కరించాలని, అవసరమైన సందర్భాల్లో సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకొని పనులను ముందుకు తీసుకెళ్లాలని ఆదేశించారు. పునఃసర్వే ప్రక్రియలో భాగంగా చేపట్టే ప్రతి పనిని నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించి పూర్తి చేయాలని, పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ పరిశీలనలో జిల్లా సర్వే అధికారి, పెద్దపల్లి, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే, డి. సోమేశ్వర్ పెద్దపల్లి తాసిల్దార్ రాజయ్య, సుల్తానాబాద్ తాసిల్దార్ బషీరుద్దీన్, సర్వేయర్లు, తదితరులు అదనపు కలెక్టర్ వెంట ఉన్నారు.

## విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా బి. రఘు.. ప్రధాన కార్యదర్శిగా వి. పవన్ కుమార్



**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** టీఆర్ఎస్ శేరిలింగంపల్లి నియోజకవర్గ విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా బి. రఘు, ప్రధాన కార్యదర్శిగా వి. పవన్ కుమార్‌ను నియమించినట్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా శనివారం వివిధ కళాశాలలకు చెందిన సుమారు 50 మంది విద్యార్థులు తెలంగాణ రక్షణ సేన పార్టీలో చేరారు. వారికి వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికలు, 2028 అసెంబ్లీ ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. విద్యార్థి నాయకులు సమిష్టిగా కృషి చేసి పార్టీ విజయానికి పనిచేయాలని, కవితక్కను ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం టీఆర్ఎస్‌కు అన్ని వర్గాల ప్రజల నుంచి విశేష మద్దతు లభిస్తోందని, తెలంగాణలో రాబోయే రోజుల్లో ఏ ఎన్నికలు జరిగినా టీఆర్ఎస్ విజయం సాధిస్తుందని ఆయన పేర్కొన్నారు. పార్టీలో చేరిన వారిలో శ్రీను, సాయి, అనికేత్, యోగేందర్, మాణిప్రీత్, నాని, అభిరామ్, నరేంద్ర, తేజ, విశాల్, అరుణ్ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సందీప్, టీఆర్ఎస్ బీసీ విభాగం అధ్యక్షుడు విష్ణు, టీఆర్ఎస్ కార్మిక విభాగం అధ్యక్షుడు దారుపల్లి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల హక్కుల పరిరక్షణకు అంకితభావంతో పనిచేస్తా: మురుగేశన్ వేలు






**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ సోషల్ జస్టిస్ కమిషన్ (రిజి.) తెలంగాణ రాష్ట్ర ఆర్టీఐ కార్యకర్తల విభాగం చైర్మన్‌గా మురుగేశన్ వేలును నియమించారు. ఈ మేరకు సంస్థ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మఖ్తాబ్ రాయ్ శనివారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఢిల్లీలోని నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ సోషల్ జస్టిస్ కమిషన్‌లో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో ఏడాది పాటు మురుగేశన్ వేలు ఈ బాధ్యతలను నిర్వర్తించనున్నారు. సమాజంలోని యువత, విద్యార్థులు, కార్మికులు, ఉద్యోగులు, మహిళలు, చిన్నారులు తదితరులకు వారి హక్కులపై అవగాహన కల్పించడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సంస్థ సూచించింది. మురుగేశన్ వేలును రాష్ట్ర చైర్మన్‌గా నియమించడంపై పలువురు అభినందనలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన సంస్థకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల హక్కుల పరిరక్షణ కోసం అంకితభావంతో పనిచేస్తానని మురుగేశన్ వేలు పేర్కొన్నారు.


# బౌలింగ్ కూర్పుపై టీమ్ మేనేజ్మెంట్ కసరత్తు

శ్రీలంకతో కొలంబోలోని సింహళీస్ స్పోర్ట్స్ క్లబ్ వేదికగా జరగనున్న రెండో టెస్ట్ మ్యాచ్ కోసం టీమిండియా ప్లేయింగ్ ఎలెవన్ ఎంపికపై తీవ్ర కసరత్తు జరుగుతోంది. రిస్ట్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ స్థానంలో ఆఫ్ స్పిన్నర్ సారాంశ్ జైన్‌ను తీసుకోవాలా వద్దా అనే నిర్ణయం పూర్తిగా పిచ్ స్వభావంపైనే ఆధారపడి ఉంటుందని శ్రీలంక మాజీ క్రికెటర్ రస్సెల్ ఆర్నాల్డ్ వ్యాఖ్యానించాడు. గాలే వేదికగా జరిగిన మొదటి టెస్టులో ఇండియా 165 రన్స్ తేడాతో ఘన విజయం సాధించి సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో నిలిచిన సంగతి తెలిసిందే. ఆ మ్యాచ్‌లో కుల్దీప్ కేవలం ఒక వికెట్ మాత్రమే దక్కించుకున్నాడు. కుల్దీప్ స్థానంలో జట్టులోకి వస్తే ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో 181 వికెట్లు, 2,223 రన్స్ చేసిన ఇండోర్ ఆల్‌రౌండర్ సారాంశ్ జైన్‌కు ఇది డెబ్యూ మ్యాచ్ అవుతుండటం విశేషం.శ్రీలంక జట్టులో లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్లు రాణిస్తున్న నేపథ్యంలో ఆఫ్ స్పిన్నర్‌ను తీసుకోవడం లాజిక్కే అయినా, ప్రాక్టీస్ సెషన్ తర్వాతే తుది నిర్ణయం తీసుకోవాలని ఆర్నాల్డ్ తెలిపాడు. పిచ్ పొడిగా ఉండి అది నుంచే టర్న్ అయ్యే అవకాశం ఉంటే సారాంశ్ జైన్ బెస్ట్ ఆప్షన్ అవుతాడని వ్యాఖ్యానించాడు. ఒకవేళ పిచ్ ఫ్లాట్‌గా ఉండి ఆట సాగుతున్న కొద్దీ నెమ్మదిస్తే మాత్రం ప్రత్యర్థిని బోల్తా కొట్టించడానికి కుల్దీప్ యాదవ్ నైపుణ్యం అవసరమని తెలిపాడు. మరోవైపు శ్రీలంక జట్టు టాప్ ఆర్డర్ వైఫల్యాలతో కొట్టుమిట్టాడుతోంది. గాలే టెస్ట్ తొలి ఇన్నింగ్స్‌లో 90 పరుగులకే 5 వికెట్లు, రెండో ఇన్నింగ్స్‌లో 47 పరుగులకే 4 వికెట్లు



కోల్పోయి లంక చేతులెత్తేసింది. పాథుమ్ నిస్సాంక, కుసాల్ మెండిస్ గాయాలతో దూరం కాగా, దినేష్ చండిమల్ సైతం కంకషన్ కారణంగా కొలంబో మ్యాచ్‌కు అందుబాటులో ఉండటం లేదని సమాచారం. టెస్ట్ ఆడే అన్ని దేశాల్లో శ్రీలంక ఓపెనింగ్ భాగస్వామ్యాలు అత్యంత పేలవంగా ఉన్నాయని ఆర్నాల్డ్ గుర్తు చేశాడు. కొత్త బంతి గట్టిగా ఉన్నప్పుడు అనవసర దూకుడు ప్రదర్శించి వికెట్లు సమర్పించుకున్నారని, కామిందు మెండిస్ లాంటి అనుభవజ్ఞుడు కూడా అదే తప్పు చేశాడని నిట్టూర్చాడు. బంతి పాతబడే వరకు క్రీజులో నిలబడితే బ్యాటింగ్‌కు అనుకూలంగా మారుతుందని గుర్తు చేశాడు. కొలంబో మ్యాచ్ కోసం శ్రీలంక జట్టులోనూ మార్పులు ఉండవచ్చని ఆర్నాల్డ్ వ్యాఖ్యానించాడు. ఫాస్ట్ బౌలర్ లాహిరు కుమారను పక్కన పెట్టి ఆఫ్ స్పిన్నర్ రమేష్ మెండిస్‌ను తుది జట్టులోకి తీసుకునే చాన్స్ ఉందని పేర్కొన్నాడు. ఇద్దరు స్పిన్నర్లు చిన్న స్పెల్స్ వేస్తే మరింత తాజాగా, శక్తితో బౌలింగ్ చేయగలుగుతారని ఆర్నాల్డ్ తెలిపాడు. బ్యాటర్లను గాల్లోనే బోల్తా కొట్టించాలంటే పూర్తి ఫిట్‌నెస్‌తో బౌలింగ్ చేయాల్సి ఉంటుందని పేర్కొన్నాడు. ఇక రెండో టెస్టు ఆదివారం నుంచి కొలంబో వేదికగా ప్రారంభం కానుంది.

# స్పోర్ట్స్



## గాలే తరహాలోనే సమతుల్య పిచ్ సిద్ధం !

ఇండియన్ బ్యాటర్ల స్పిన్ బలహీనతను టార్గెట్ చేస్తూ డస్ట్‌బౌల్ పిచ్ రెడీ చేయాలన్న ఆలోచన ఉన్నప్పటికీ, కొలంబోలోని సింహళీస్ స్పోర్ట్స్ క్లబ్ వేదికగా జరిగే రెండో టెస్టుకు గాలే తరహా బ్యాలెన్స్‌డ్ ట్రాక్ సిద్ధం చేసే అవకాశాలు కనిపిస్తున్నాయని సమాచారం. తొలి టెస్టులో ఇండియా 165 రన్స్ తేడాతో ఘన విజయం సాధించి, సిరీస్ లో 1-0తో ఆధిక్యంలో ఉన్న సంగతి తెలిసిందే. ఆ మ్యాచ్‌లో ఐదు రోజుల పాటు పిచ్ సహజ సిద్ధమైన మార్పులతో బ్యాటర్లు, బౌలర్లకు సమాన అవకాశాలు ఇచ్చిందని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఆగస్టు 23 నుంచి ప్రారంభమయ్యే రెండో టెస్టుకు మితిమీరిన స్పిన్ పిచ్ తయారు చేస్తే అది లంక జట్టుకే రివర్స్ అయ్యే ప్రమాదం ఉందని శ్రీలంక క్రికెట్ బోర్డు అనుమానిస్తోంది. దినేష్ చండిమల్, కుసాల్ మెండిస్, పాథుమ్ నిస్సాంక లాంటి సీనియర్ల గైర్హాజరీలో యువ బ్యాటర్లకు అవకాశం ఇవ్వడానికి గాలే తరహా సమతుల్య పిచ్ సరైనదని లంక బోర్డు వర్గాలు భావిస్తున్నాయి. 1999 నుంచి 2009 మధ్య కాలంలో ఈ వేదికపై శ్రీలంక ఆడిన 12 టెస్టుల్లో ఆరు విజయాలు సాధించి మిగిలినవి డ్రా చేసుకుని చక్కని ప్రతిభ కనబర్చింది.. కుమార్ సంగక్కర, మహేల జయవర్ధనే భారీ స్కోర్లు సాధించగా, దిగ్గజ స్పిన్నర్ ముత్తయ్య మురళీధరన్ ప్రత్యర్థులను ముప్పు తిప్పలు పెట్టేవాడు. సీనియర్ ఆటగాళ్లు రిటైర్ అయ్యాక ఇక్కడి పిచ్ స్వభావం పూర్తిగా మారిపోయిందని నిపుణులు గుర్తు చేస్తున్నారు. తర్వాతి దశాబ్దంలో లంక ఇక్కడ ఆడిన ఏడు టెస్టుల్లో మూడింట్లో మాత్రమే గెలిచి, నాలుగింట్లో ఘోర పరాజయం పాలైంది. రెండు సార్లు ఇండియా, పాకిస్తాన్ జట్లకు 400 కంటే ఎక్కువ తొలి ఇన్నింగ్స్ ఆధిక్యాన్ని సమర్పించుకుని, ఓటమి పాలైంది. సౌతాఫ్రికా, ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్ లాంటి జట్లపై మాత్రమే లంక ఇక్కడ విజయాలు సాధించింది. సీనియర్ల శకం ముగిసిన తర్వాత ఇండియా, ఇంగ్లాండ్, పాకిస్తాన్ జట్లు ఇక్కడ సులభంగా ఆధిపత్యం కనబర్చాయి. రాబోయే రెండో టెస్టులో కూడా ఇదే సీన్ రిపీట్ అయ్యే ఛాన్స్ ఉందని నిపుణులు జోస్యం చెబుతున్నారు. తొలుత బ్యాటింగ్ చేసే జట్టు మ్యాచ్ పై పట్టు సాధించే అవకాశాలు మెండుగా ఉన్నాయని తెలుస్తోంది. సిరీస్ డ్రా చేయాలనే పట్టుదలతో ఉన్న ఆతిథ్య జట్టు పిచ్ రూపకల్పనలో ఏ నిర్ణయం తీసుకుంటుందో అనేది ఆసక్తికరంగా మారింది. ఇక ఈ మ్యాచ్ లో గెలిస్తే సిరీస్ సొంతం చేసుకోవడంతోపాటు, డబ్ల్యూటీసీ ఫైనల్ రేసులో మరింత ముందుకు పోతుంది టీమిండియా.

## టీ20ల్లో అత్యధిక సెంచరీలు బాదిన బ్యాటర్లు

టీ20 ఇంటర్నేషనల్ ఫార్మాట్ వచ్చాక క్రికెట్‌లో వేగం పెరిగింది. ఒకప్పుడు వన్డేలో సెంచరీ అంటే ప్రత్యేకంగా ఉండేది. కానీ పొట్టి ఫార్మాట్లో 20 ఓవర్ల ఆటలో సెంచరీ సాధించడం చాలా మంది దిగ్గజాలకు ఇప్పటికీ ఒక సవాలుగా మారింది. కేవలం 120 బంతుల ఈ మ్యాచ్‌లో భారీ స్కోరు చేయడానికి బ్యాటర్లకు క్లీన్ హిట్టింగ్, నిలకడ, టెక్నిక్ అవసరం. ఇటీవల కాలంలో టీ20 క్రికెట్‌లో అనేక విధ్వంసకర బ్యాటర్లు తెరపైకి వచ్చారు. వారు పరుగులు సాధించడమే కాకుండా, మెరుపు సెంచరీలు సాధించి బౌలర్లకు ముప్పు తెచ్చారు. ఈ జాబితాలో ఆస్ట్రేలియా ఆల్ రౌండర్ గ్లెన్ మాక్స్‌వెల్, రోహిత్ శర్మ సంయుక్తంగా అగ్రస్థానంలో ఉన్నారు. భారత మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ టీ20 అంతర్జాతీయ క్రికెట్లో 5 సెంచరీలతో గ్లెన్ మాక్స్‌వెల్‌తో కలిసి అగ్రస్థానంలో ఉన్నాడు. 2007లో టీ20 ఇంటర్నేషనల్‌లో అరంగేట్రం చేసిన రోహిత్ ఇప్పటివరకు 159 మ్యాచ్‌లలో 4,231 పరుగులు చేశాడు. హిట్ మ్యాన్ అత్యధిక స్కోరు 121 పరుగులు. 140 స్ట్రైక్ రేట్, 32 కంటే ఎక్కువ సగటుతో రోహిత్ చాలాసార్లు టీమిండియాకు ఎన్నో విజయాలు అందించాడు. ఆస్ట్రేలియా ఆల్ రౌండర్, విధ్వంసకర బ్యాటర్ గ్లెన్ మాక్స్‌వెల్ ఇంటర్నేషనల్‌లో అత్యధిక సెంచరీలు సాధించిన బ్యాటర్లలో ఒకడు. 2012 నుండి 2025 వరకు ఆడిన 124 %%20 మ్యాచ్‌లలో మాక్సీ 5 అద్భుతమైన సెంచరీలు చేశాడు. అతడి అత్యుత్తమ స్కోరు 145 పరుగులు కాగా, ఫార్మాట్లో మొత్తం 2833 పరుగులు చేశాడు. 156 స్ట్రైక్ రేట్‌తో పరుగులు సాధిస్తూ మాక్స్‌వెల్ ఫార్మాట్‌లో ప్రత్యర్థి జట్ల బౌలర్లకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాడు. ఇంగ్లాండ్ స్టార్ క్రికెటర్ ఫిల్ సాల్ట్ ఇటీవల అద్భుతమైన ప్రదర్శన చేస్తున్నాడు. ఫిల్ సాల్ట్ కేవలం 50 మ్యాచ్‌లలోనే 4 సెంచరీలు సాధించాడంటే అతడు ఏ స్థాయిలో చెలరేగుతాడో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. సాల్ట్ స్ట్రైక్ రేట్ 168 కంటే ఎక్కువ. ఇది ఈ ఫార్మాట్‌లో కనీసం 50 మ్యాచ్‌లాడిన ఏ బ్యాట్స్‌మెన్‌కైనా అత్యధికం. ఫిల్ సాల్ట్‌ను ఇంగ్లాండ్ జట్టుకు టీ20 స్పెషలిస్ట్ అని భావిస్తారు. టీమిండియా 'మిస్టర్ 360 డిగ్రీ' ఆటగాడిగా పిలుచుకునే సూర్యకుమార్ యాదవ్ ఈ జాబితాలో నాల్గవ స్థానంలో ఉన్నాడు.

## దుమ్మురేపిన స్మృతి మంధాన!

ఐసీసీ మహిళల వన్డే ర్యాంకింగ్స్‌లో టీమిండియా వైస్ కెప్టెన్ స్మృతి మంధాన దుమ్మురేపింది. కెరీర్ బెస్ట్ రేటింగ్ పాయింట్స్‌తో తన అగ్రస్థానాన్ని మరింత పదిలం చేసుకుంది. ప్రస్తుతం భారత్ వేదికగా జరుగుతున్న వన్డే ప్రపంచకప్ 2025లో స్మృతి మంధాన అద్భుత ప్రదర్శన కనబరుస్తున్న సంగతి తెలిసిందే. న్యూజిలాండ్‌తో జరిగిన గత లీగ్ మ్యాచ్‌లో మంధాన సెంచరీతో చెలరేగిన విషయం విదితమే. ఈ టోర్నీలో ఇప్పటి వరకు 6 ఇన్నింగ్స్‌లు ఆడిన మంధాన 365 పరుగులతో టాప్ స్కోరర్‌గా కొనసాగుతోంది. ఇదే టోర్నీలో ఆస్ట్రేలియాపై 80, ఇంగ్లండ్‌పై 88 పరుగులు చేసింది. దాంతో స్మృతి మంధాన ఖాతాలో 828 రేటింగ్ పాయింట్స్ చేరాయి. స్మృతి మంధాన కెరీర్‌లో ఇదే అత్యుత్తమ రేటింగ్ పాయింట్స్. మంధాన తర్వాత ఆష్లీన్ గార్డ్‌నర్(731) రేటింగ్ పాయింట్స్‌తో రెండో స్థానంలో నిలిచింది. ఆమె ఆరు స్థానాలు ఎగబాకింది. మంధానకు ఆమెకు 97 పాయింట్ల వ్యత్యాసం ఉంది. లారా వోల్వార్ట్ రెండు స్థానాలు మెరుగుపర్చుకొని రెండో స్థానంలో నిలిచింది. భారత్ నుంచి మరే బ్యాటర్ టాప్-10లో లేకపోవడం గమనార్హం. హర్మన్ క్రౌత్ కౌర్ మూడు స్థానాలు దిగజారి 18వ స్థానంలో నిలవగా.. జెమీమా రోడ్రిగ్స్ 8 స్థానాలు ఎగబాకి 19వ స్థానానికి చేరింది. న్యూజిలాండ్‌పై సెంచరీతో చెలరేగిన ప్రతికా రావల్ 12 స్థానాలు ఎగబాకి 27వ ర్యాంక్ అందుకుంది. బౌలింగ్ విభాగంలో ఆస్ట్రేలియా బౌలర్ అలాన కింగ్ అగ్రస్థానంలో కొనసాగుతుండగా.. ఆ దేశానికే చెందిన ఆష్లీ గార్డ్‌నర్ రెండో స్థానంలో నిలిచింది. సౌతాఫ్రికా బౌలర్ మరిజన్నే కాప్ నాలుగు, దీప్తి శర్మ ఐదో స్థానంతో సరిపెట్టుకుంది.గురువారం జరగనున్న సెమీఫైనల్లో ఆస్ట్రేలియాతో భారత్ అమీతుమీ తేల్చుకోనుంది. ఈ మ్యాచ్‌కు టీమిండియాకు బిగ్ షాక్ తగిలింది. ఓపెనర్ ప్రతీకా రావల్ గాయంతో జట్టుకు దూరమైంది. ఆమె స్థానంలో షెఫాలీ వర్మ జట్టులోకి వచ్చింది. సమష్టిగా రాణిస్తేనే ఆస్ట్రేలియాపై టీమిండియాకు విజయం దక్కనుంది.






## నష్టాలతో బంగ్లా బీపీఎల్ రద్దు!!

ఇండియాతో స్వదేశంలో జరగాల్సిన కీలక ద్వైపాక్షిక సిరీస్ తేదీలు మారే అవకాశం ఉందని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు చీఫ్ తమీమ్ ఇక్బాల్ పేర్కొన్నాడు. బీసీబీ తన వార్షిక క్యాలెండర్‌ను పునర్వ్యవస్థీకరిస్తుండటంతో ఈ పరిస్థితి తలెత్తిందని తెలుస్తోంది. షేర్-ఎ-బంగ్లా నేషనల్ క్రికెట్ స్టేడియంలో ఆగస్టు 28 నుంచి సెప్టెంబర్ 9 వరకు అండర్-17, అండర్-19, అండర్-23 విభాగాల ఆటగాళ్లతో గేమ్ డెవలప్‌మెంట్ టోర్నమెంట్‌ను బీసీబీ జరుపనుంది. ఇండియాతో సిరీస్ షెడ్యూల్ ఖరారైన తర్వాతే మిర్పూర్ లేదా బసుంధర గ్రౌండ్‌లో వేదికలను సర్దుబాటు చేస్తామని పేర్కొన్నాడు. ఢిల్లీ వేదికగా సెప్టెంబర్ 13 నుంచి 17 వరకు ఆఫ్ఘనిస్తాన్‌తో ఇండియా మూడు టీ20ల సిరీస్ ఆడాల్సి ఉండటంతో సెప్టెంబర్ విండోలో ఇండియా-బంగ్లా సిరీస్ దాదాపు అసాధ్యమని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఈ టూర్ ఖరారైతే బంగ్లాకు కనకవర్షం కురుస్తుందని, అందుకే టూర్ పై గంపెడాశలు పెట్టుకుందని నిపుణులు పేర్కొంటున్నారు. అవినీతి ఆరోపణలు, వివాదాల్లో చిక్కుకున్న బంగ్లాదేశ్ ప్రీమియర్ లీగ్ ఈ ఏడాది నిర్వహించకపోవచ్చని తమీమ్ పేర్కొన్నాడు. గత రెండు సీజన్లలో బీపీఎల్ కారణంగా బీసీబీ దాదాపు 40 కోట్ల బంగ్లాదేశ్ టాకా (రూ. 31 కోట్లు) నష్టపోయిందని తెలిపాడు. సమస్యలు పూర్తిగా పరిష్కారమయ్యే వరకు ప్రతీ ఏటా టోర్నీని నిర్వహించడం ముఖ్యం కాదని, అవసరమైతే సరైన ఫార్ములా కోసం ఒకటి లేదా రెండేళ్లు సమయం తీసుకుంటామని వెల్లడించాడు. ఫ్రాంచైజీలతో సంప్రదింపులు మొదలయ్యాయని, డిఫాల్టర్ల సమస్యలు, చెల్లింపులు, బ్యాంక్ గ్యారెంటీలను పరిష్కరించిన తర్వాతే టోర్నీని లాభదాయక మార్గంలోకి తెచ్చి నిర్వహిస్తామని పేర్కొన్నాడు.వచ్చే ఏడాది ఏప్రిల్-మే నాటికి ఫ్రాంచైజీలను సిద్ధం చేయాలని బోర్డు ప్రణాళికగా ఉంది. ఎవరైనా తప్పుకుంటే ప్రత్యామ్నాయాన్ని చూసేందుకు తగిన సమయం అవసరమని, దేశవాళీ క్యాలెండర్ పనుల్లో 60-70 శాతం పూర్తయిందని తమీమ్ పేర్కొన్నాడు. లీగ్ రద్దయితే క్రికెటర్లకు ఆర్థిక నష్టం వాటిల్లుతుందని తనకు తెలుసని, బోర్డు భవిష్యత్తు కోసమే ఈ కఠిన నిర్ణయాలు తీసుకుంటున్నట్లు ఆటగాళ్లకు వ్యక్తిగతంగా వివరిస్తున్నానని తెలిపాడు. సరైన మార్పులతో రాబోయే రోజుల్లో కొత్త రూపంలో ముందుకొస్తామని బోర్డు ఆలోచనగా ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు ఇటీవల ముగిసిన టీ20 ప్రపంచకప్ సందర్భంగా భారత్ తో సంబంధాలు తెంచుకుని, టోర్నీని బహిష్కించిన బంగ్లాకు.. ఇప్పుడు బుద్ధి వచ్చిందని, ఇండియా విలువ తెలిసి వచ్చిందని భారత ఫ్యాన్స్ భావిస్తున్నారు.

## ట్రీసా-గాయత్రి జోడీకి చారిత్రక కాంస్యం!

ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్స్‌లో భారత స్టార్ షట్లర్లు ట్రీసా జాలీ, గాయత్రి గోపీచంద్ జోడీ అద్భుత ప్రదర్శనతో కాంస్య పతకం కైవసం చేసుకుంది. మహిళల డబుల్స్ సెమీఫైనల్లో ప్రపంచ నంబర్ వన్ చైనా ద్వయం లియు షెంగ్ షు, టాన్ నింగ్ చేతిలో పోరాడి ఓటమి పాలైనా, టోర్నీలో సగర్వంగా కాంస్యంతో సరిపెట్టుకుంది. గంటా 11 నిమిషాల పాటు హోరాహోరీగా సాగిన ఈ సెమీస్ పోరులో భారత జోడీ 21-18, 13-21, 8-21 తేడాతో పరాజయం చవిచూసింది. ఈ ప్రతిష్టాత్మక టోర్నీలో ఈ యువ ద్వయానికి ఇదే తొలి పతకం కావడం విశేషం. ముఖ్యంగా 2011లో గుత్తా జ్వాలా, అశ్విని పొన్నప్ప జోడీ లండన్‌లో కాంస్యం సాధించిన తర్వాత, మళ్లీ మహిళల డబుల్స్‌లో భారత్‌కు పతకం రావడం ఇదే తొలిసారి. అన్‌సీడెడ్‌గా బరిలోకి దిగిన ఈ జంట టోర్నీ ఆసాంతం అద్భుత ఆటతీరు కనబరిచి క్రీడాభిమానుల మన్ననలు పొందింది. సెమీస్ పోరులో భారత జంట ఉత్సాహంగా మ్యాచ్ ప్రారంభించింది. ఆరంభంలోనే 7-2 ఆధిక్యంలోకి వెళ్లినా, చైనా జోడీ పుంజుకుని విరామానికి 11-7 ఆధిక్యం సాధించింది. ఆ తర్వాత ట్రీసా, గాయత్రి అద్భుతంగా ఆడి స్కోరును 12-12 వద్ద సమం చేశారు. సుదీర్ఘ ర్యాలీలతో పాటు క్రాస్ కోర్ట్ షాట్లతో చెలరేగి తొలి గేమ్‌ను 21-18తో కైవసం చేసుకున్నారు. కానీ రెండో గేమ్‌లో చైనా జంట వ్యూహం మార్చింది. భారత జోడీ అనవసర తప్పిదాలు చేయడంతో పాటు నెట్ వద్ద తడబడటంతో చైనా ఆధిపత్యం ప్రదర్శించింది. కంటిన్యూగా పాయింట్లు సాధిస్తూ 21-13తో రెండో గేమ్‌ను గెలుచుకుంది. ఇక కీలకమైన మూడో గేమ్‌లో చైనా జోడీ పూర్తి స్థాయి ఆధిపత్యం చెలాయించింది. ఆరంభంలో 2-2 తో స్కోరు సమంగా ఉన్నా, ఆ తర్వాత చైనా క్రీడాకారిణులు ఆట వేగాన్ని



పెంచారు. ట్రీసాను టార్గెట్ చేస్తూ వరుస పాయింట్లు రాబట్టి విరామ సమయానికి 11-5 తో భారీ ఆధిక్యంలోకి దూసుకెళ్లారు. తొలి గేమ్‌లో చూపించిన దూకుడును భారత జోడీ పునరావృతం చేయలేకపోయింది. వరుసగా చేసిన తప్పులు చైనాకు కలిసొచ్చాయి. చివరకు ఏ దశలోనూ కోలుకోలేకపోయిన ట్రీసా, గాయత్రి జంట 8-21 తో మూడో గేమ్‌ను చేజార్చుకుంది. ఓడినా కాంస్య పతకంతో ఈ జోడీ చరిత్ర సృష్టించింది.

# విపరీతంగా జుట్టు రాలుతుందా? అయితే ఈ రెమిడీస్ ట్రై చెయ్యండి!



జుట్టు మనిషి అందాన్ని మరింత ఇనుమడింప చేస్తుంది. అటువంటి జుట్టు రాలిపోతున్న సమస్య ఇప్పుడు చాలా ఎక్కువగా పెరిగిపోయింది. ఎవరు చూసినా జుట్టు రాలిపోతోందని తెగ బాధపడుతున్నారు. జుట్టు రాలకుండా ఉండాలంటే ఏం చేయాలి? ఏం చేస్తే మనం ఆరోగ్యకరమైన జుట్టును సొంతం చేసుకోవచ్చు? ఈ ప్రశ్నలు ప్రతి ఒక్కరిని ఆలోచించేలా చేస్తున్నాయి.

జుట్టు రాలటానికి అనేక కారణాలు

అయితే జుట్టు రాలడానికి అనేక కారణాలు ఉన్నాయి. ఒత్తిడి జుట్టు రాలడానికి ముఖ్యమైన కారణం. అంతేకాదు ఇతర అనారోగ్య సమస్యలు ఉన్న, జన్యుపరమైనటువంటి కారణాలు ఉన్న, హార్మోన్లలో అసమతుల్యత, థైరాయిడ్ సమస్యలు, విటమిన్ల లోపం, ఐరన్ లోపం వంటి సమస్యలు ఉన్న జుట్టు రాలిపోతుంది. కొన్ని రకాల మందులను వినియోగించే వారికి కూడా జుట్టు రాలే సమస్య ఎక్కువగా ఉంటుంది. జుట్టు రాలే సమస్య నివారణలు

జుట్టు రాలిపోతున్న సమస్యను నివారించడం కోసం చాలామంది రకరకాల నూనెలను వాడుతూ ఉంటారు. అయితే నూనెలకు బదులుగా జుట్టు రాలే సమస్యను నివారించడానికి మంచి ఆహారం తీసుకోవడం అవసరం. ప్రోటీన్లు, ఐరన్, విటమిన్లు సమృద్ధిగా ఉండే సమతుల ఆహారాన్ని తీసుకోవడం వల్ల జుట్టు రాలే సమస్యను నివారించవచ్చు. కొబ్బరి నూనె, బాదం నూనె వంటి నూనెలతో తలకు మసాజ్ చేయడం వల్ల జుట్టు రాలే సమస్య నివారణ అవుతుంది. ఇది రక్తప్రసరణను మెరుగుపరుస్తుంది.

ఈ విషయాల్లో జుట్టు ఆరోగ్యం కోసం జాగ్రత్త యోగా, ధ్యానం వంటి పద్ధతుల ద్వారా కూడా జుట్టు రాలే సమస్యను నివారించవచ్చు. మనం ఉపయోగించే సబ్బులు, షాంపూల వల్ల కూడా జుట్టు రాలే సమస్య వస్తుంది కాబట్టి, వీటి విషయంలో కూడా జాగ్రత్తగా ఎంపిక చేసుకొని జుట్టు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి. ఇక జుట్టు స్ట్రెయిటనింగ, కర్లింగ్ వంటి చర్యలతో కూడా జుట్టుకు హాని కలుగుతుంది.

వీటితో జుట్టు రాలే సమస్య నుండి ఉపశమనం

ఇంట్లోనే సహజసిద్ధమైన ఉల్లి రసాన్ని, తలకు బాగా పట్టించి 15 నిమిషాల పాటు మసాజ్ చేసుకుంటే జుట్టు రాలడం తగ్గి, మళ్లీ జుట్టు ఒత్తుగా పెరుగుతుంది. అదేవిధంగా బియ్యం కడిగిన నీళ్లను తలకు బాగా పట్టించి, 15 నిమిషాల తర్వాత జుట్టు కడుక్కుంటే జుట్టు రాలే సమస్య తగ్గుతుంది.



## కిడ్నీలు పాడయ్యే ముందు కనిపించే లక్షణాలు ఇవే.. జాగ్రత్త!

మన శరీరంలో ముఖ్యమైన భాగాలుగా మూత్రపిండాలను చెప్పాలి. సరిగ్గా మూత్రపిండాలు పని చేస్తేనే మనం ఆరోగ్యంగా ఉంటాం. మూత్రపిండాలు మన శరీరంలోని వ్యర్థాలను బయటకు పంపి రక్తంలో మలినాలు చేరకుండా మన శరీరాన్ని కాపాడతాయి. ఇక అటువంటి మూత్రపిండాల ఆరోగ్యం పైన ప్రతి ఒక్కరికి కచ్చితంగా శ్రద్ధ ఉండాలి. ఒక్కోసారి మూత్రపిండాల సమస్య వచ్చినప్పటికీ సమస్య తీవ్రతరం అయ్యేవరకు అర్థం కాదు. మూత్రపిండాలు పాడయ్యే ముందు కనిపించే లక్షణాలు మూత్రపిండాలకు సంబంధించిన సమస్యలు రావడానికి ముందు శరీరంలో కొన్ని లక్షణాలు తప్పకుండా కనిపిస్తాయి. ఒకవేళ ఆ లక్షణాలు కనిపిస్తే మూత్రపిండాల వైద్యుల్ని సంప్రదించి, మూత్రపిండాల ఆరోగ్యం గురించి తెలుసుకోవడం కచ్చితంగా చేయాలి. ఇక ఇంతకీ మూత్రపిండాలు పాడయ్యే ముందు కనిపించే లక్షణాలు ఏమిటి అనే వివరాల్లోకి వెళితే.. చర్మ ఆరోగ్యానికి మూత్రపిండాల ఆరోగ్యానికి లింక్ మూత్రపిండాలు పాడయ్యే ముందు మన శరీరంలో అనేక లక్షణాలు కనిపిస్తాయి. కిడ్నీ సమస్య మూత్ర విసర్జన మరియు కడుపు నొప్పికి సంబంధించిన లక్షణాలకు పరిమితం కాదు. మూత్రపిండాలు పాడయ్యే ముందు అనేక చర్మ సమస్యలు వచ్చే అవకాశం కూడా ఉంది. చర్మం పొడిబారడం, దురదగా అనిపించడం, పొరలు పొరలుగా మారడం మూత్రపిండాల సమస్యలకు సంబంధించిన లక్షణాలుగా చెప్పవచ్చు. కాబట్టి చర్మానికి సంబంధించి ఇటువంటి లక్షణాలు కనిపిస్తే తస్మాత్ జాగ్రత్త. కళ్ళ చుట్టూ వాపు.. నిర్లక్ష్యం చెయ్యొద్దు ఒక్కోసారి కిడ్నీ సమస్యలకు సంబంధించిన లక్షణాలు కళ్ల ద్వారా తెలుస్తాయి. కళ్ళ చుట్టూ వాపుకు కంటి పరీక్షలు చేయించుకున్నా ఎటువంటి కారణం తెలియకపోతే కచ్చితంగా కిడ్నీల ఆరోగ్యాన్ని పరీక్షించుకోవాలి. కంటి సమస్యలు వచ్చే ప్రమాదం ఉన్నందున, కళ్ళ చుట్టూ వాపు వస్తే నిర్లక్ష్యం చేయకూడదు. ఇక కండరాల నొప్పులు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, తరచూ యూరినరీ ట్రాక్ ఇన్ఫెక్షన్లు, కళ్ళలో వాపు వంటి లక్షణాలు కిడ్నీ సమస్యలకు కారణం. ఈ లక్షణాలతో కిడ్నీలకు ముప్పు కిడ్నీలు రక్తాన్ని సరిగ్గా వడ పోయకపోతే రక్తహీనత కలుగుతుంది. ఫలితంగా అలసట నీరసం వంటి సమస్యలు వస్తాయి .ఇక కిడ్నీలు వ్యర్థాలను వడపోసి మూత్రం గా బయటకు పంపించకపోతే మూత్ర విసర్జన కూడా తక్కువ అవుతుంది. మూత్రంలో రంగు మార్పు, దుర్వాసన రావడం కూడా కిడ్నీలు సరిగా పనిచేయడం లేదేమో అని చెప్పడానికి సంకేతం. వీపుపై భాగంలో పక్కటెముకల కింద కుడి లేదా ఎడమ వైపున నొప్పి వస్తే అది కూడా కిడ్నీలు పాడయ్యాయి అని చెప్పే సంకేతం. కాబట్టి ఈ లక్షణాలు కనిపిస్తే అసలు నిర్లక్ష్యం చేయొద్దు.

## విపరీతమైన తలనొప్పి, ఒళ్ళునొప్పులు, కంటి సమస్యలతో బాధపడుతున్నారా?
# ఫైబ్రోమయాల్జియా కావచ్చు.. జాగ్రత్త!



ఉన్నట్టుండి విపరీతమైన తలనొప్పి, ఒళ్ళు నొప్పులు, కంటి చూపు మందగించడం, వంటి సమస్యలతో చాలామంది బాధపడుతూ ఉంటారు. అయితే మూడు నెలల కంటే ఎక్కువగా ఇలా తలనొప్పి ఒళ్లు నొప్పులు కంటిచూపు మందగించడం వంటి సమస్యలతో బాధపడితే వారు ఖచ్చితంగా అలర్ట్ అవ్వాల్సిందే. ఎందుకంటే అది ఫైబ్రోమాయాల్జియా కావచ్చు అని వైద్యులు చెబుతున్నారు.

తీవ్రంగా వేధించే ఫైబ్రోమయాల్జియా

ఈ ఫైబ్రోమయాల్జియా సమస్య చాలా తీవ్రంగా బాధిస్తుంది. ఈ సమస్యలో మొత్తం శరీరం శరీరంలోని కండరాలు నరాల వ్యవస్థ అంతటా నొప్పి వ్యాపిస్తుంది. ఇవి మాత్రమే కాదు ఎముకలు కూడా ప్రభావితమవుతాయి ఎముకలు ,మృదులాస్థి, టెండాన్లు ఇలా శరీరమంతటా ఉన్న ఎముకలు, నరాలు, కండరాలలో తీవ్రమైన నొప్పి బాధిస్తుంది. ఫైబ్రోమయాల్జియా రావటానికి అనేక కారణాలు

అసలు ఈ ఫైబ్రో మయాల్జియా సమస్య ఎందుకు వస్తుంది అంటే దీనికి రకరకాల కారణాలు ఉన్నాయి. ఈ సమస్య జన్యు సంబంధంగా రావచ్చు. వివిధ రకాల ఇన్ఫెక్షన్ల కారణంగా రావచ్చు. శారీరకంగా గాయాలకు గురైన తర్వాత వచ్చే అవకాశం లేకపోలేదు. దీర్ఘకాలంగా మానసిక ఒత్తిడికి లోనైన వారికి వచ్చే అవకాశం ఉంది. అయితే పురుషుల కంటే మహిళలకే ఎక్కువగా ఈ సమస్య వచ్చే ప్రమాదం ఉంది. ఫైబ్రోమయాల్జియాకు శాశ్వత పరిష్కారం లేదు ఈ సమస్య వచ్చినప్పుడు విపరీతమైన తలనొప్పి, టెన్షన్, యాంగ్జైటీ, డిప్రెషన్ వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఇక ఆస్టియో ఆర్థరైటి,స్ రుమటాయిడ్ ఆర్థరైటిస్, లూపస్ ఉన్నవారిలో కూడా ఫైబ్రోమయాల్జియా వచ్చే అవకాశం ఉంది. ఫైబ్రోమయాల్జియాకు శాశ్వత పరిష్కారం లేదు. ఇది మళ్లీ రాకుండా తిరిగి నియంత్రించే అవకాశం లేదు. కేవలం లక్షణాలను నియంత్రించటానికి మందులు ఉన్నాయి. కాళ్ళ నరాల నొప్పులు.. ఈ వ్యాధుల డేంజర్ బెల్స్.. మూడు నెలలు నొప్పులుంటే నిర్లక్ష్యం చెయ్యొద్దు.. దీని నుండి ఉపశమనం పొందడానికి మెడిటేషన్ కూడా ఎంతగానో సహాయపడుతుంది. మూడు నెలలకు పైగా శారీ రక నొప్పులు, విపరీతమైన తలనొప్పి వేధిస్తుంటే, కంటి చూపులో మార్పు చోటు చేసుకుంటే ఫైబ్రోమయాల్జియాగా అనుమానించి వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకోవడం అవసరం. లేదంటే అది తీవ్రతరమైతే మీ రోజువారి జీవితం కూడా ప్రభావితం అవుతుంది.

# మార్కెట్

## నూతన గనులను సాధించుకోవాలి
### కోలిండియా, సింగరేణిపై కేంద్ర బొగ్గు గనులశాఖ మంత్రి కిషన్‌రెడ్డి

హైదరాబాద్ : వచ్చే రోజుల్లో ఇంధన రంగంలో స్వయం సమృద్ధిని సాధించే విషయంలో ప్రభుత్వరంగ బొగ్గు సంస్థలు డిమాండ్‌కు తగినట్టుగా నాణ్యమైన బొగ్గును ఉత్పత్తి చేసేలా సమాయత్తం కావాలని కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి జీ కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. బొగ్గు సంస్థల మనుగడకు కొత్త గనులను పెంచుకోవడం అత్యంత అవసరమని, ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించడం ద్వారా వినియోగదారులకు బొగ్గు అందుబాటులోకి తీసుకురావచ్చని, తద్వారా విద్యుత్ ఉత్పత్తి వ్యయం తగ్గి ప్రజలకు ఆర్థికంగా లబ్ధి చేకూరుతుందని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంత్రి అధ్యక్షతన జరిగిన ఈ సమీక్ష సమావేశానికి కోలిండియా, సింగరేణి ఉన్నతాధికారులు హాజరయ్యారు. సింగరేణి సీఎండీ ఎన్ బలరాం హైదరాబాద్ సింగరేణిభవన్ నుంచి సమీక్షలో పాల్గొని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కంపెనీ ప్రగతి, భవిష్యత్తు ప్రణాళికలు తదితర అంశాలను వివరించారు. ఈ సందర్భంగా బొగ్గు ఉత్పత్తి వ్యయం తగ్గింపు, నాణ్యత, సరఫరా తదితర అంశాల్లో ఎదురవుతున్న సవాళ్లు, వాటిపై తీసుకోవాల్సిన చర్యలపై మంత్రి పలు సూచనలు చేశారు. కార్మికుల జీతాలు, సంక్షేమ కార్యక్రమాలకు ఇబ్బంది లేకుండా బొగ్గు ఉత్పత్తి ఖర్చు గణనీయంగా తగ్గించాలని సూచించారు. ఇందుకోసం కార్మిక సంఘాల సహకారాన్ని తీసుకోవాలని, పని సంస్కృతిని మెరుగుపరచాలని కోరారు.

### రహస్య పత్రాలను లీక్‌చేస్తే కఠిన చర్యలు



సింగరేణి సంస్థకు సంబంధించిన రహస్య సమాచారాన్ని బయటకు లీక్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సంస్థ డైరెక్టర్ (పీపీ అండ్ పర్సనల్) హెచ్చరించారు. ఈ మేరకు గురువారం ఒక సర్క్యులర్ జారీచేశారు. కంపెనీ రహస్య పత్రాలు తమకు ఇవ్వాల్సిందిగా కొందరు వ్యక్తులు ఉద్యోగులను, అధికారులను బెదిరిస్తున్నట్టు, ఒత్తిడికి గురిచేస్తున్నట్టు తెలుస్తున్నదని, అలాంటి వ్యక్తులు ఏ స్థాయిలో ఉన్నా లెక చేయాల్సిన అవసరం లేదని స్పష్టంచేశారు.

## పసిడి కొనుగోళ్లకు ధరల షాక్
### 2025-26లో 10 శాతం వరకు తగ్గనున్న డిమాండ్



ఇక్రా నివేదికలో వెల్లడి

ముంబై : రికార్డు స్థాయిలో దూసుకుపోయిన ధరల కారణంగా బంగారు ఆభరణాల వినిమయంపై ప్రతికూల ప్రభావం చూపుతున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆభరణాల వినిమయం 9 శాతం నుంచి 10 శాతం వరకు తగ్గే అవకాశాలున్నాయని దేశీయ రేటింగ్ ఏజెన్సీ ఇక్రా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. గడిచిన ఆర్థిక సంవత్సరంలో బంగారం ధరలు 33 శాతం పెరగడం ఇందుకు కారణమని తెలిపింది. 2024-25లో కడ్డీల వినిమయం 17 శాతం, నాణేలు 25 శాతం చొప్పున పెరిగాయని పేర్కొంది. అంతర్జాతీయంగా అనిశ్చిత పరిస్థితులు నెలకొనడంతో మదుపరులు తమ పెట్టుబడులను సురక్షితమైన అతి విలువైన లోహాలవైపు మళ్లించడంతో వీటి ధరలు రాకెట్ వేగంతో దూసుకెళ్లాయని ఇక్రా సీనియర్ వైస్ ప్రెసిడెంట్, గ్రూపు హెడ్ జితిన్ మక్కర్ తెలిపారు. ఈ ఏడాది కడ్డీలు, నాణేల డిమాండ్ 10 శాతం మించే అవకాశాలు లేదని ఆయన స్పష్టంచేశారు. రిటైల్ విస్తరణ, అసంఘటిత విభాగం అధిక వృద్ధిని నమోదు చేసుకుంటున్నదంటున్న ఆయన.. పెరుగుతున్న ధరల కారణంగా వినియోగం తగ్గుతున్నప్పటికీ, పండుగ సీజన్‌లో డిమాండ్ తగ్గే అవకాశాలు లేవని స్పష్టంచేశారు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో బంగారు ఆభరణాల వినిమయం విలువలో గణనీయమైన 28 శాతం పెరుగుదల కనిపించింది. ఈ ఏడాది కూడా ఇదే తరహా పెరుగుదల ఉంటుందని పేర్కొంది. ధరలు పెరిగే అవకాశాలు తక్కువే.. ప్రస్తుతం కొనసాగుతున్న బంగారం ధరలు ఈ ఏడాది ఇదే స్థాయిలో కొనసాగే అవకాశాలున్నాయని ఇక్రా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. అంతర్జాతీయంగా ఏదైనా అనిశ్చిత పరిస్థితులు నెలకొంటే తప్ప ధరల్లో పెద్దగా మార్పులు ఉండవని తెలిపింది.

రూ.500 తగ్గిన తులం ధర

గత కొన్ని రోజులుగా పెరుగుతూ వచ్చిన బంగారం ధరలు తగ్గుముఖం పట్టాయి. అంతర్జాతీయ మార్కెట్లో అతి విలువైన లోహాలకు డిమాండ్ పడిపోవడంతో దేశీయ రాజధాని న్యూఢిల్లీలో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పుత్తడి ధర రూ.500 దిగొచ్చింది. దీంతో పదిగ్రాముల విలువ రూ.99 వేల దిగువకు రూ.98,500కి పడిపోయింది. అలాగే 99.5 శాతం స్వచ్ఛత కలిగిన గోల్డ్ ధర అంతే స్థాయిలో తగ్గి రూ.98 వేలుగా నమోదైంది. కానీ, వెండి ధరలు యథాతథంగా ఉన్నాయి. కిలో వెండి రూ.1,00,000గా ఉన్నది.

## నయా జుపిటర్ ధర రూ.88,942

న్యూఢిల్లీ, మే 29: ప్రముఖ వాహన సంస్థ టీవీఎస్ మోటర్ కంపెనీ..దేశీయ మార్కెట్లోకి అప్‌గ్రేడెడ్ చేసిన నయా స్కూటర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. జూపిటర్ 125 డ్యూయల్ టోన్ స్మార్ట్‌కనెక్ట్‌ని పరిచయం చేసింది. ఈ స్కూటర్ ధర రూ.88, 942గా నిర్ణయించింది. ఈ ధరలు ఢిల్లీ షోరూంనకు సంబంధించినవి.

జావా యెజ్డీ షోరూం

జావా యెజ్డీ.. తాజాగా హైదరాబాద్‌లో మరో షోరూంను తెరిచింది. కంపెనీకి చెందిన వాహనాలకు డిమాండ్ అధికంగా ఉండటం వల్లనే మరో షోరూంను ప్రారంభించినట్టు కంపెనీ వర్గాలు వెల్లడించాయి.



# ప్లాస్టిక్, క్యారీ బ్యాగుల వినియోగాన్ని పూర్తిగా తగ్గించాలి

**-జిల్లా ఉప కార్యనిర్వాహక సమాచార ఇంజనీరు యు.సురేంద్రనాథ్**

ఏలూరు, ఆగస్టు 22 : స్థానిక జిల్లా పౌరసంబంధాధికారి కార్యాలయం శనివారం స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగాజిల్లా ఉప కార్యనిర్వాహక సమాచార ఇంజనీరు యు.సురేంద్ర నాథ్ ఆదేశాలు మేరకు స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా కార్యాలయాన్ని, ప్రాంగణాన్ని కార్యాలయ సిబ్బంది చీపుర్లతో శుభ్రం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఉప కార్యనిర్వాహక సమాచార ఇంజనీరు యు.సురేంద్రనాథ్ మాట్లాడుతూ ప్రతి పౌరుడు తన ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు ప్లాస్టిక్, క్యారీ బ్యాగులను వినియోగాన్ని పూర్తిగా తగ్గించాలని అన్నారు. తడి-పొడి వ్యర్థాలుగా వేసి ఇవ్వడమే ఒక మంచి అలవాటుగా చేసుకోవాలని కోరారు.

# అవగాహన సదస్సు

ఏలూరు, ఆగస్టు 22 : ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఏలూరు వారి ఆధ్వర్యంలో ప్యానల్ న్యాయవాదులు పి.వెంకటేశ్వర రావు, జి.వి భాస్కర్, స్థానిక వట్లూరులోని ఎస్సీ బాలుర వసతి గృహము నందు శనివారం "జాగృతి పథకం 2025" క్రింద సాధికార యువత బలమైన భారతదేశం అంశం పైన అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ ఈ పథకం కింద యువతకు న్యాయ అక్షరాస్యత, బాలల న్యాయము మరియు న్యాయ ప్రాప్తిని ప్రోత్సహించడం అంటే అంశాలుపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. నేటి సమాజంలో యువత తెలిసి తెలియక మాదకద్రవ్యాలకు లోను కావడం, అలానే ర్యాగింగు, మానవ ఆక్రమాలకు గురికావడం వంటి సమస్యలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. యువత విద్యా ఆభ్యాసంతో పాటు న్యాయ చట్టాలు పైన అవగాహనను కలిగి ఉండటం ఉత్తమ భవిష్యత్తుకు బాటలు వేస్తుందని సూచించారు, దేశభవిష్యత్తు నేటియువత భవిష్యత్తుతో ముడిపడి ఉందని, కావున యువత నేటిసమాజం పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ రామారావు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# విశాఖలో బ్రిక్స్ దేశాల మంత్రుల సదస్సు

**తొట్లకొండ బౌద్ధ క్షేత్రాన్ని సందర్శించిన ప్రతినిధులు**

విశాఖపట్టణం,ఆగస్ట్22 : విశాఖలో బ్రిక్స్ దేశాల క్రీడామంత్రుల సదస్సు ప్రారంభమైంది. తొలి రోజు బ్రిక్స్ ప్రతినిధుల బృందం చారిత్రక ప్రాంతం తొట్లకొండ బౌద్ధ క్షేత్రాన్ని సందర్శించింది. ఈ కార్యక్రమంలో కేంద్ర క్రీడలశాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయతో పాటు 11 బ్రిక్స్ దేశాల యువజన, క్రీడాశాఖల మంత్రులు, ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బౌద్ధ క్షేత్రంలో మొక్కలు నాటారు. తొట్లకొండలోని మహాస్తూపం, బావులు, పాకశాల, ధ్యాన కేంద్రాలను పరిశీలించారు. విదేశీ ప్రతినిధులకు ఇక్కడి పురావస్తు అవశేషాలు, అప్పటి బౌద్ధజీవన విధానానికి సంబంధించిన విశేషాలను అధికారులు వివరించారు. ఈ సాయంత్రం విదేశీ ప్రతినిధులకు ఇచ్చే విందులో సీఎం చంద్రబాబు పాల్గొంటారు. ఈ సదస్సుకు భారత్‌తో పాటు బ్రెజిల్, రష్యా, దక్షిణాఫ్రికా, చైనా, ఈజిప్ట్, ఇథియోపియా, ఇండోనేషియా, ఇరాన్, సౌదీ అరేబియా, యూఏఈ నుంచి ప్రతినిధులు హాజరవుతున్నారు. శనివారం ఉదయం తొట్లకొండలో మొక్కలు నాటడంతో సమావేశాలు ప్రారంభమయ్యాయి. భారత్ అధ్యక్షతన జరగనున్న సమావేశాలను 'స్థితిస్థాపకత, ఆవిష్కరణ, సహకారం, సుస్థిరత కోసం నిర్మాణం' అనే ఇతివృత్తం ఆధారంగా నిర్వహించనున్నారు. కేంద్ర మంత్రి మాండవీయ తొలుత ప్రసంగాన్ని ప్రారంభిస్తారు. శనివారం జరిగే సమావేశంలో విద్య, నైపుణ్యాలు, వ్యవస్థాపకత, సంక్షేమం, సుస్థిరాభివృద్ధి వంటి అంశాలపై చర్చిస్తారు. ఉమ్మడి ప్రకటననూ, సహకార కార్యాచరణ విధానాన్నీ ముగింపు సందర్భంగా ఆమోదిస్తారు. ఆదివారం జరగనున్న క్రీడా మంత్రుల సమావేశంలో క్రీడల విధానంలో ఉమ్మడి నిబద్ధతను పునరుద్ఘాటించడంపై చర్చించనున్నారు. దేశీయ క్రీడలు, క్రీడా రంగంలో సాంకేతిక సహకారం, క్రీడా పరికరాల తయారీ, ఉమ్మడి ప్రకటన ఖరారు చేసే అంశాలపై సమావేశం దృష్టి సారించనుంది. కేంద్ర క్రీడలు, యువజన సర్వీసుల సహాయ మంత్రి రక్షా ఖడ్సే ముగింపు వేడుకల్లో పాల్గొని మాట్లాడతారు. చివరిగా 11 బ్రిక్స్ దేశాల మంత్రులతో కూడిన ప్రతినిధి బృందాలు ఉమ్మడి ప్రకటనకు ఆమోదం తెలుపుతాయి.

# అనకాపల్లికి గోదావరి నీళ్లు తెప్పిస్తాం

**వచ్చే నెలలోనే నీటిని రప్పించి చెరువులు నింపుతాం**

**అనకాపల్లి పర్యటనలో సిఎం చంద్రబాబు**

అనకాపల్లి,ఆగస్ట్22 : అనకాపల్లికి నీళ్లు తెచ్చే బాధ్యత తనది అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. త్వరలోనే అనకాపల్లి, విశాఖకు గోదావరి నీళ్లు తీసుకొస్తామని.. జిల్లాలో ప్రతి చెరువు, రిజర్వాయర్లను నింపుతామని వెల్లడించారు. సెప్టెంబర్ తొలి వారంలోనే అనకాపల్లికి నీళ్లు తెచ్చి చూపిస్తామని పేర్కొన్నారు. 'మేం చేస్తున్న పనులను అభినందిస్తే అదే పెద్ద కిక్' అని చెప్పుకొచ్చారు. జిల్లాలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటన కొనసాగుతోంది. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో సీఎం పాల్గొని ప్రసంగించారు. అనకాపల్లి అంటే బెల్లం ఒక్కటే కాదని.. ఇండస్ట్రియల్ ఏరియా అని అన్నారు. రాబోయే రోజుల్లో దేశంలోనే అనకాపల్లి జిల్లా నం.1 అవుతుందని ధీమా వ్యక్తం చేశారు. మంచిపనులు చేస్తుంటే కొందరు అడ్డుకోవాలని చూస్తున్నారని సీఎం మండిపడ్డారు. విమర్శలు చేసేవారికి డేటా సెంటర్ అంటే తెలియదని విమర్శించారు. ఇప్పటి వరకు డేటా సెంటర్ ప్రారంభం కాలేదని, తాగడానికి నీళ్లు లేవంటూ దుష్ప్రచారం చేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. డేటా సెంటర్ వస్తే లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయన్నారు. డేటా సెంటర్లతో ఆదాయం కూడా పెరుగుతుందని తెలిపారు. దేశంలో తొలిసారి క్వాంటం కంప్యూటర్ అమరావతికి వస్తోందన్నారు. విద్యార్థులకు ఇప్పటి నుంచే ఎఐ టెక్నాలజీ నేర్పాలని సూచించారు. ఎఐ నేర్చుకుంటే రాబోయే రోజుల్లో ప్రపంచాన్ని జయించవచ్చారు. భివృద్ధి అంటే పరిశ్రమలు, పెట్టుబడులు మాత్రమే కాదని.. పర్యావరణ పరిరక్షణ కూడా అభివృద్ధిలో భాగమే అని చంద్రబాబు అన్నారు. చెత్త నుంచి కంపోస్ట్, కరెంట్, గ్యాస్ ఉత్పత్తి చేస్తున్నామన్నారు. ప్రతి గ్రామం జీరో వేస్ట్ పంచాయతీగా తయారుకావాలని సూచించారు. ఆడబిడ్డల కోసం మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నామని, రాబోయే రోజుల్లో మూడు గ్యాస్ సిలిండర్ల డబ్బులను 4 నెలలకోసారి జమ చేస్తామన్నారు. ఇండక్షన్ స్టవ్‌లు పెట్టుకుంటే గ్యాస్‌తో కూడా అంత పని ఉండదని అన్నారు. ÷రిద్దలి పార్టీ అరాచకాన్ని నమ్ముకుందని.. గత ఐదేళ్లు రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని సీఎం తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కల్తీ మద్యంతో ప్రజల ప్రాణాలు తీశారన్నారు. చాలాచోట్ల భూములను కబ్జా చేశారని ఆరోపించారు. వైసీపీ తప్పులను సరిదిద్దడానికి మూడేళ్లు పట్టిందన్నారు. విధ్వంసమైన ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతున్నామని తెలిపారు. సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నామని చెప్పారు. ఆ÷ూలలో ఎలాంటి అవకతవకలు జరగలేదని స్పష్టం చేశారు. ప్రజలు నిజాయితీగా ఉంటే తప్పుడు రాజకీయాలు చేసేవాళ్లు భయపడతారని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు.

# ఇంటింటా నెట్‌జీరో ఆదర్శ గ్రామాలే లక్ష్యం

**ఇంటి నుంచే పర్యావరణ పరిరక్షణకు శ్రీకారం**

**అలవరం కోడూరులో నెట్‌జీరో విధానాన్ని పరిశీలించిన సీఎం చంద్రబాబు**



మాడుగుల, ఆగస్టు 22 : పర్యావరణ పరిరక్షణను ఇంటింటి ఉద్యమంగా మార్చి... గ్రామాలను పరిశుభ్రంగా, ఆరోగ్యవంతంగా, పర్యావరణహితంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం నెట్‌జీరో గ్రామాల కార్యక్రమాన్ని అమలు చేస్తోందని సీఎం చంద్రబాబు అన్నారు. ఇంటి స్థాయి నుంచి కాలనీ, గ్రామ స్థాయి వరకు పర్యావరణహిత విధానాలను అమలు చేస్తూ.. క్రమంగా గ్రామాలను నెట్‌జీరో కమ్యూనిటీలుగా మార్చే దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా అనకాపల్లి జిల్లా మాడుగుల నియోజకవర్గంలోని అలవరం కోడూరులో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొని నెట్‌జీరో కార్యక్రమాలను పరిశీలించారు. నెట్‌జీరో గ్రామంలో అమలు చేస్తున్న కార్యక్రమాలు, సాధిస్తున్న లక్ష్యాలను జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ ముఖ్యమంత్రికి వివరించారు. ఇంటింటా సౌర విద్యుత్ వినియోగం, పరిశుభ్రమైన వంట విధానాలు, తడి వ్యర్థాలతో సేంద్రియ ఎరువు తయారీ, మురుగునీటి నిర్వహణ వంటి చర్యల ద్వారా కార్బన్ ఉద్గారాలను తగ్గించడంతో పాటు గ్రామాలను పరిశుభ్రంగా, ఆరోగ్యకరంగా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు.వంటింటి వ్యర్థాలే సేంద్రియ ఎరువులునెట్‌జీరో కార్యక్రమాలను అమలు చేస్తున్న జె. మహేశ్వరరావు నివాసాన్ని సీఎం చంద్రబాబు సందర్శించారు. మహేశ్వ రరావు, ఆయన సతీమణి ఇంట్లో చేపడుతున్న పర్యావరణహిత కార్యక్రమాలను ముఖ్యమంత్రికి వివరించారు. ఇంటి నుంచి వెలువడే తడి వ్యర్థాలను ప్రత్యేక కంపోస్టింగ్ గుంతల్లో వేస్తూ.. అక్కడికక్కడే సేంద్రియ ఎరువుగా మార్చుతున్న విధానాన్ని సీఎంకు చూపించారు. ఇలా ఇంట వండే తడి వ్యర్థాలను ఎరువుగా మార్చడం వల్ల ఎరువుల కొనుగోలు ఖర్చు తగ్గుదలతో పాటు వ్యర్థాల సేకరణ, రవాణా, నిర్వహణకు అయ్యే శ్రమ కూడా తగ్గుతుందని వివరించారు. వ్యర్థాన్ని సమస్యగా కాకుండా వనరుగా మార్చే ఈ విధానం గ్రామాల్లో విస్తరించాల్సిన అవసరం ఉందని తెలిపారు.మురుగునీటికి ఇంటి వద్దే పరిష్కారంఇంటి నుంచి వెలువడే మురుగునీటిని రోడ్లపైకి వదలకుండా నిర్దేశిత గుంతల్లోకి మళ్లించే ఇన్‌సిటు వేస్ట్‌వాటర్ మేనేజ్‌మెంట్ విధానాన్ని కూడా సీఎం పరిశీలించారు. దీంతో కాలనీ రోడ్లపై మురుగునీరు నిల్వ ఉండకుండా చూడటంతో పాటు దోమలు, ఈగల వృద్ధిని నియంత్రించవచ్చని లబ్ధిదారు వివరించారు. ఈ విధానం ద్వారా నీటి ద్వారా వ్యాపించే వ్యాధుల ముప్పును తగ్గించడంతో పాటు కుటుంబాలకు, చుట్టుపక్కల ప్రజలకు పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించవచ్చని తెలిపారు. ఇంధన వినియోగాన్ని తగ్గించేలా ఇంట్లో ఏర్పాటు చేసిన ఇండక్షన్ స్టవ్ పనితీరును కూడా లబ్ధిదారు ముఖ్యమంత్రికి వివరించారు. అనంతరం ఇంటిపై ఏర్పాటు చేసిన 3 కిలోవాట్ల సోలార్ రూఫ్‌టాప్‌ను సీఎం పరిశీలించారు. సౌర విద్యుత్‌తోనే ఇండక్షన్ స్టవ్‌ను వినియోగించడం ద్వారా అదనపు విద్యుత్ వ్యయాన్ని కూడా తగ్గించుకోవచ్చని లబ్ధిదారులు తెలిపారు. అనంతరం లబ్ధిదారు కుటుంబంతో ముఖ్యమంత్రి చంద్రబాబు సెల్ఫీ దిగారు.

# మాజీ ఎంపీ సురవరం సుధాకర్ రెడ్డి ఆశయ సాధనకు కృషి చేయాలి

ఏలూరు, ఆగస్టు 22 : సిపిఐ మాజీ కార్యదర్శి, మాజీ పార్లమెంట్ సభ్యులు సూరవరం సుధాకర్ రెడ్డి ఆశయ సాధనకు సిపిఐ కార్యకర్తలు కృషి చేయాలని సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య పిలుపునిచ్చారు. సిపిఐ జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవనంలో సురవరం సుధాకర్ రెడ్డి ప్రథమ వర్ధంతి కార్యక్రమం సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో జరిగింది. సుధాకర్ రెడ్డి చిత్రపటానికి సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, బి కే యం యు జిల్లా కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కృష్ణ చైతన్య మాట్లాడుతూ విద్యార్థి దశ నుండి సిపిఐ జాతీయ కార్యదర్శిగా అనేక పదవులలో కేంద్రస్థాయిలో పనిచేస్తూ విద్యార్థి, యువజన, కార్మిక, రైతాంగ సమస్యలపై అలుపెరుగని పోరాటాలు సురవరం సుధాకర్ రెడ్డి చేశారని ఆయన గుర్తు చేశారు. సుధాకర్ రెడ్డి ఉద్యమ స్ఫూర్తితో, ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక, కార్మిక వ్యతిరేక, రైతాంగ వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని కృష్ణ చైతన్య కోరారు. బి కే యం యు ఏలూరు జిల్లా కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సుధాకర్ రెడ్డి బి కే యం యు జాతీయ ఉపాధ్యక్షులుగా ఉంటూ దేశంలోనూ రాష్ట్రంలోనూ భూమి లేని నిరుపేదలకు సాగు భూములు మరియు ఇళ్ల స్థలాలు ఇప్పించడంలో ప్రముఖ పాత్ర వహించారని ఆయన తెలిపారు. సిపిఐ తలపెట్టిన మార్పు రావాలి మార్పు తేవాలి కార్యక్రమాన్ని జయప్రదం చేసే విధంగా సుధాకర్ రెడ్డి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలని పార్టీ శ్రేణులకు వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఏలూరు ఏరియా సహాయ కార్యదర్శులు కురెళ్ళ వరప్రసాద్ , అడ్డగర్ల లక్ష్మీ ఇందిరా, సిపిఐ జిల్లా కార్యదర్శి సభ్యులు రెడ్డి శ్రీనివాస్ డాంగే, సిపిఐ ప్రజా సంఘాల నాయకులు ఎం విజయ, కొల్లూరి సుధారాణి, జి స్వాతి, బళ్ళ కనక దుర్గారావు, నాగం అచ్యుత్, యర్రా వెంకటేశ్వర్లు, కనకం జగన్, ఉప్పులూరు లక్ష్మి, ఉప్పులూరి భవాని తదితరులు పాల్గొన్నారు.

# నల్లమల సాగర్ కు కృష్ణా జలాలు.

**31న సీఎం చేతుల మీదుగా వెలిగొండ ప్రారంభోత్సవం.**

**నిర్వాసితులకు నేడు మరో 250 కోట్లు పరిహారం పంపిణీ.**

**- జలవనరుల శాఖ మంత్రి రామానాయుడు.**

ఉండవల్లి, ఆగస్టు 22 : వెనుకబడిన, ఫ్లోరైడ్ భాదిత ఉమ్మడి ప్రకాశం జిల్లా ప్రజల మూడు దశాబ్దాల కల వెలిగొండ ప్రాజెక్టును ఈనెల 31న రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించనున్నారని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు చెప్పారు. ఈ ప్రాజెక్టు ఫేజ్- 1 ప్రారంభం ద్వారా 10.7 టిఎంసిల కృష్ణమ్మ జలాలను నల్లమల సాగర్ కు ప్రవహింప జేయబోతున్నామని ఆయన వివరించారు. వెలిగొండ నిర్వాసితులకు సంబంధించి మూడవ విడతగా శనివారం ఉదయం 250 కోట్ల రూపాయలను ముఖ్యమంత్రి పంపిణీ చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా సీఎం క్యాంప్ కార్యాలయం వద్ద రామానాయుడు మీడియాతో మాట్లాడారు. ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాలకు ఉద్దేశించిన వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభంతో ఈ జిల్లాల ప్రజల దశ, దిశ మారబోతోందని ఆయన అన్నారు. 1996లో అప్పటి ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు వెలిగొండకు శ్రీకారం చుట్టారని, మళ్లీ ఆయనే, నేడు ముఖ్యమంత్రిగా వెలిగొండను ప్రారంభించబోతుండటం ఒక చరిత్రగా రామానాయుడు అభివర్ణించారు. ఈ ప్రాజెక్టు వల్ల 4.47 లక్షల ఎకరాలకు సాగు, 23 లక్షల మందికి త్రాగు నీరందుతుందని ఆయన చెప్పారు. అలాగే వెలిగొండ నిర్వాసితులకు మూడు దశల్లో కేవలం 40 రోజుల వ్యవధిలో 760 కోట్ల రూపాయలను అందజేయటం, నిర్వాసితుల పట్ల ముఖ్యమంత్రికి ఉన్న బాధ్యతకు, ఆదరాభిమానాలకు నిదర్శనం అన్నారు. వెలిగొండ కు భూములు ఇచ్చిన త్యాగాధనులకు పరిహారం ఇచ్చాకే, నీళ్ళు వదలాలని చంద్రబాబు చెప్పిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. అలాగే ప్రతిష్టాత్మక పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు 2250 కోట్లు కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాతే ఈ రెండేళ్లలో ఇచ్చిన సంగతి కూడా ఆయన తెలియజేశారు. మొత్తం మీద కూటమి ప్రభుత్వం వచ్చిన ఈ రెండేళ్ళలోనే, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్వాసితులకు 3 వేల కోట్లు పరిహారం అందజేశామన్నారు. వెలిగొండ ప్రాజెక్టు లో అర్హత ఉన్న ఆఖరి నిర్వాసితుడి వరకు న్యాయం చేస్తామని రామానాయుడు హామీ ఇచ్చారు. కాగా నాడు గొడ్డలి పార్టీ ప్రభుత్వ హయాంలో వెలిగొండ పనులు పూర్తవ్వకుండా, జగన్ జాతికి అంకితం చేసి ప్రకాశం జిల్లా ప్రజలను మోసం చేశాడన్నారు. ఎల్ నినో వంటి క్లిష్ట సమయం లో నల్లమల సాగర్ కు 10.7 టీఎంసీ ల కృష్ణా జలాలను తీసుకొస్తున్నా మంటే చంద్రబాబు ముందుచూపుకి, దార్శనికతకు నిదర్శనం అని అన్నారు. భవిష్యత్ లో వెలిగొండ నీళ్లతో ప్రకాశం జిల్లా సస్యశ్యామలం కాబోతోంది అన్నారు.ఈ కార్యక్రమంలో మంత్రి నిమ్మల రామానాయుడు తో పాటు ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసుల రెడ్డి, ఎమ్మెల్యేలు కందుల నారాయణ రెడ్డి, ఉగ్రనరసింహారెడ్డి, అశోక్ రెడ్డి, యర్రగొండపాలెం టిడిపి ఇంఛార్జ్ ఎరిక్షన్ బాబు, వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులు పాల్గొన్నారు.

# కంపెనీలు,దళారుల నుండి ఆయిల్ పామ్ రైతులను కాపాడండి.

**కాటాలు వద్ద ఆయిల్ పామ్ గెలలు ఏరివేత ఆపాలి.**

**- ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా నాయకులు డిమాండ్**

ఏలూరు ఆగస్టు 22 : చెమటోడ్చి పండించిన ఆయిల్ పామ్ రైతులను దళారీ వ్యవస్థ నిలువునా ముంచేస్తోందని,ఏలూరు జిల్లాలో కొన్ని వే-బ్రిడ్జ్ కాటాల వద్ద నవభారత్,గోద్రెజ్ ఫ్యాక్టరీకి వెళ్లే ఆయిల్ పామ్ గెలల విషయంలో దళారులు సాగిస్తున్న ఆగడాలు పరాకాష్టకు చేరాయని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, జిల్లా సీనియర్ నాయకులు గుత్తికొండ వెంకట కృష్ణారావు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం ఏలూరు అన్నే భవనంలో ఆయిల్ పామ్ రైతుల సమస్యలపై వారు మాట్లాడారు.పగటిపూట రైతుల వద్ద సేకరించిన ఫ్రూట్‌ను కాటాల వద్ద పోసి, రాత్రికి రాత్రే దానిపై విచ్చలవిడిగా నీళ్లు కొడుతూ (వాటరింగ్) బరువు పెంచుతున్నారని,ఆ తర్వాతే ఆ లోడును ఫ్యాక్టరీలకు తరలిస్తున్నారని చెప్పారు. గెలల్లో నీటి శాతం ఎక్కువగా ఉందనే సాకుతో ఫ్యాక్టరీ యాజమాన్యం ఆయిల్ పామ్ గెలల ధరను తగ్గించి వేస్తున్నాయని చెప్పారు. దళారులు నీళ్లు కొట్టి దండుకున్న లాభాలకు,ఆయిల్ పామ్ రైతులు బలైపోతున్నారన్నారు . ఈ దళారుల దగా కారణంగా గత నెలలోనే టన్నుకు రూ. 450 చొప్పున ధర తగ్గి రైతులు నష్టపోయారని చెప్పారు. కష్టపడి పంట పండించిన రైతుకు నష్టం మిగులుతుంటే, మధ్యలో ఏమీ చేయని దళారులు మాత్రం జేబులు నింపుకుంటున్నారని విమర్శించారు. రైతుల శ్రమను దోచుకుంటున్న వే-బ్రిడ్జ్ కాటాల నిర్వాహకులు, దళారులపై ఉద్యాన,తూనికలు, కొలతలు శాఖల అధికారులు,జిల్లా అధికార యంత్రాంగం తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.కాటాల వద్ద అక్రమంగా నీళ్లు కొట్టే విధానానికి స్వస్తి పలికేలా నిరంతరం తనిఖీలు చేపట్టాలన్నారు.దళారుల మోసాల వల్ల రైతులకు జరిగిన నష్టాన్ని భర్తీ చేసి, ఆయిల్ పామ్ రైతుకు ప్రభుత్వం నిర్ణయించిన ధర అందేలా చర్యలు చేపట్టాలన్నారు. పచ్చి గెలలు పేరుతో ఆయిల్ పామ్ ఫ్రూట్ ఏరివేత ఆపాలని కోరారు. పెదవేగి ఆయిల్ ఫెడ్ నూతన కర్మాగారం నిర్మాణానికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని తద్వారా ఓ.ఈ.ఆర్ సమస్యను పరిష్కరించాలన్నారు. ఆయిల్ పామ్ రైతుల సమస్యలపై భవిష్యత్తులో ఆందోళన పోరాట కార్యక్రమాలు నిర్వహిస్తామని అందుకు రైతాంగం సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు.

# స్వచ్ఛత ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత.

**పరిశుభ్రతతో పరిపూర్ణ ఆరోగ్యం సాధ్యం.**

**మొక్కలను నాటి, ప్రతిజ్ఞ చేయించిన జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి**

ముసునూరు, ఆగస్టు 22 : ముసునూరు మండలం కాట్రేనిపాడు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో శనివారం స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగామొక్కలను నాటి, అందరిరీ చేత జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి ప్రతిజ్ఞ చేయించారు.ఈ సందర్భంగా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ స్వచ్ఛత అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత కాదని, ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని ఆలోచన చేసి, ముందుకు అడుగులు వెయ్యాలని అన్నారు. స్వచ్ఛమైన పరిసరాలు, పరిశుభ్రమైన గ్రామాలు, పట్టణాలతోనే ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించగలమని అన్నారు. స్వర్ణాంధ్రప్రదేశ్ నిర్మాణంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం ఎంతో కీలకమైనది అని, ప్రజలు భాగస్వామ్యంతో ప్రతి గ్రామాన్ని, ప్రతి పట్టణాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్ద గలమని అన్నారు. పరిశుభ్రతతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రతి ఒక్కరూ రెండు మొక్కలను నాటి వాటిని సంరక్షించే బాధ్యతను కూడా స్వీకరించాలని అన్నారు. ప్లాస్టిక్, క్యారీ బ్యాగులు వినియోగాన్ని పూర్తిగా మానివేసి, వాటిస్థానంలో గన్ని, క్లాత్ బ్యాగులను వినియోగించుకోవాలని అన్నారు. నా ఇల్లు, నా వీధి, నా గ్రామం, నా పట్టణం అనుకుని స్వచ్ఛంగా ఉండాలనే సంకల్పంతో ముందుకు రావాలని అన్నారు. మన జిల్లాను స్వచ్ఛంగా, ఆరోగ్యంగా, పచ్చగా, అభివృద్ధి పథంలో అగ్రగామిగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టరు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పాఠశాలలో అదనపు తరగతి గదులు అసంపూర్తిగా నిర్మాణం చేసి వదిలేసారని, వాటిని పూర్తిచేయాలని, ఉపాధ్యాయులు కొరత ఉందని, ఖాళీలు భర్తీ చెయ్యాలని గ్రామస్తులు కోరగా, వెంటనే పరిశీలించి చర్యలు తీసుకోవాలని అధికారులను జిల్లా కలెక్టరు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీశాఖ అధికారి పి.వి.సంధీప్ రెడ్డి, జెడ్పీ సిఈవో పి.జగదాంబ, జిల్లా పంచాయతీశాఖ అధికారి జి.వి.కె.మల్లిఖార్జునరావు, వివిధ శాఖల అధికారులు, ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థిని, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# 19 రోజులైనా ఆచూకీ లేని మత్స్యకారులు

**ముమ్మరంగా కొనసాగుతున్న గాలింపు చర్యలు**

విశాఖపట్టణం,ఆగస్ట్22 : కోనసీమ జిల్లా అల్లవరం మండలం ఓడలరేవు జెట్టీ నుంచి సముద్రంలోకి చేపల వేటకు వెళ్లిన ఏడుగురు మత్స్యకారుల బోటు గత 19 రోజులుగా కనిపించకుండాపోవడం తీవ్ర కలకలం రేపుతోంది. ఈ నెల 3న వేటకు బయలుదేరిన ఈ బోటుతో 5వ తేదీ నుంచి పూర్తి స్థాయిలో కమ్యూనికేషన్ తెగిపోయింది. సాధారణంగా వేటకు వెళ్లినవారు తిరిగొస్తారనే నమ్మకంతో కుటుంబసభ్యులు ఈ నెల 13వ తేదీ వరకు వేచి చూశారు. అయినప్పటికీ వారి నుంచి ఎలాంటి సమాచారం రాకపోవడంతో ఆందోళనకు గురై అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఈ నెల 17వ తేదీ నుంచి బాధితుల ఆచూకీ కోసం గాలింపు చర్యలను యంత్రాంగం వేగవంతం చేసింది. ఈ గాలింపు చర్యల్లో విశాఖపట్నం కేంద్రంగా పనిచేస్తున్న నాలుగు కోస్ట్ గార్డ్ నౌకలతో పాటు రెండు నేవీ హెలికాప్టర్లు బంగాళాఖాతంలో తీవ్రంగా శోధిస్తున్నాయి. విశాఖపట్నం, చెన్నై నుంచి వచ్చిన నేవీ నౌకలు సముద్రంలో అత్యంత లోతైన ప్రాంతాల్లో అన్వేషణ కొనసాగిస్తున్నాయి. కాకినాడ, విశాఖ కోస్ట్ గార్డ్ బృందాలు, మెరైన్ పోలీసులు, మత్స్యశాఖ అధికారులు పరస్పర సమన్వయంతో నేడు ఐదో రోజు కూడా గాలింపు ప్రక్రియను ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. మరోవైపు పోలీసులు బాధితుల సెల్‌ఫోన్ నంబర్లను సేకరించి, వారి కాల్ డేటాను విశ్లేషిస్తూ సాంకేతిక ఆధారాల కోసం ప్రయత్నిస్తున్నారు. అయితే, సదరు బోటులో ముందస్తు జాగ్రత్తగా ఊ÷ఎఈ ట్రాన్స్‌పాండర్ పరికరాన్ని ఏర్పాటు చేయకపోవడం వల్లే కమ్యూనికేషన్ పూర్తిగా నిలిచిపోయి, వారి లొకేషన్‌ను గుర్తించడం కష్టతరంగా మారింది.



## మత్తేక్కిస్తున్న వామికా గబ్బి

సోషల్ మీడియాలో ఎవరు ఎప్పుడు ట్రెండ్ అవుతారో చెప్పలేం. అలా ఈ హాట్ బ్యూటీ ఇప్పుడు యమా ట్రెండింగ్ అవుతోంది. ఈ బ్యూటీ ఓరకంటతో చూస్తున్న ఫోటోలు నెట్టింట తెగ ట్రెండ్ అవుతోంది. ఇంతకీ ఆమె ఎవరా అని అనుకుంటున్నారా.! కేవలం ఒకే ఒక్క తెలుగు సినిమా చేసిన ఈమె మరెవరో కాదు.. వామికా గబ్బి. సుధీర్ బాబు హీరోగా తెరకెక్కిన 'భలే మంచి రోజు' సినిమాతో టాలీవుడ్‌కి పరిచయమైంది. ఈ మూవీ కమర్షియల్‌గా ఫెయిల్ కావడంతో వామికా మళ్లీ తెలుగులో మరే చిత్రంలో నటించలేదు పంజాబీ, హిందీ, మలయాళం, తెలుగు సినిమాల్లో నటించింది వామికా గబ్బి. 2007లో 'జబ్ వి మెట్' సినిమాతో సినీ ఇండస్ట్రీలోకి వచ్చినా.. ఇప్పటివరకు ఈ బ్యూటీకి సరైన బ్రేక్ దక్కలేదు. 2023లో 'ఖుఫియా' అనే హిందీ సినిమాతో వామికా బాగా ఫేమస్ అయింది. ఈ చిత్రంలో ఆమె నటించిన బోల్డ్ సీన్స్ సోషల్ మీడియాలో తెగ ట్రెండ్ అయ్యాయి. దాంతో ఈ బ్యూటీకి క్రేజ్ కూడా డబుల్ అయ్యింది. తాజాగా వరుణ్ ధావన్ హీరోగా వచ్చిన 'బేబీ జాన్' మూవీతో ప్రేక్షకులను పలకరించింది. ఇందులో వామికా.. టీచర్ పాత్రలో నటించి తన నటనకు గానూ మంచి మార్కులు తెచ్చుకుంది. ఇక అడివి శేష్ హీరోగా వస్తోన్న 'గూఢచారి -2' సినిమాతో మరోసారి తెలుగులో రీ-ఎంట్రీ ఇవ్వనుంది.





## ఆ స్టార్ హీరో నాకన్నా చిన్నపిల్లాడిలా కనిపిస్తాడు : జాన్వీకపూర్

బాలీవుడ్ ముద్దగుమ్మ జాన్వీ కపూర్ హీరోయిన్ గా హిందీలో రాణిస్తుంది. కమర్షియల్ సినిమాలతో పాటు లేడీ ఓరియెంటెడ్ మూవీస్ లోనూ నటిస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంది. విభిన్నమైన కథలను ఎంచుకుంటూ సినిమాలు చేస్తున్నప్పటికీ ఆశించిన స్థాయిలో సక్సెస్ కాలేకపోతుంది ఈ చిన్నది. ఇక సోషల్ మీడియాలో జాన్వీ అందాలకు యమా క్రేజ్ ఉంది. అందాలు ఆరబోస్తూ కుర్రాళ్లను కవ్విస్తుంది ఈ చిన్నది. ఇక ఈ బ్యూటీ దేవర సినిమాతో టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఎన్టీఆర్ హీరోగా నటించిన దేవర సినిమా భారీ విజయాన్ని అందుకుంది. ఈ సినిమాలో తన నటనతో పాటు అందంతోనూ మెప్పించి మంచి మార్కులు కొట్టేసింది జాన్వీ. ఇక ఇప్పుడు ఈ అమ్మడు దేవర 2లో నటిస్తుంది. అలాగే రామ్ చరణ్ తోనూ నటిస్తుంది. ఇదిలా ఉంటే జాన్వీ కపూర్ చేసిన కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. జాన్వీ కపూర్ గతంలో ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ టాలీవుడ్ స్టార్ హీరో గురించి ఆసక్తికర కామెంట్స్ చేసింది. ఆయన వయసు రోజు రోజుకు తగ్గుతుంది అని చెప్పుకొచ్చింది. ఇంతకూ ఆ స్టార్ హీరో ఎవరో తెలుసా.? మీరు గెస్ చేసే ఉంటారు ఆయన ఎవరో కాదు సూపర్ స్టార్ మహేష్ బాబు. గతంలో ఓ ఇంటర్వ్యూలో మహేష్ గురుంచి జాన్వీ మాట్లాడింది. మహేష్ బాబు గురించి మాట్లాడుతూ.. ఆయనకు వయసు అవ్వదు. ఆయనకు రోజు రోజుకు వయసు తగ్గిపోతుంది. ఎంతో హ్యాండ్సమ్ గా ఉంటారు. కొన్నిసార్లు నా కన్నా చిన్నవాడిగా కనిపిస్తారు అని తెలిపింది జాన్వీ. ఈ కామెంట్స్ ను మహేష్ అభిమానులు సోషల్ మీడియాలో తెగ షేర్ చేస్తున్నారు. మహేష్ ప్రస్తుతం రాజమౌళి సినిమా షూటింగ్ లో బిజీగా ఉన్నారు. ఈ సినిమాలో ప్రియాంక చోప్రా హీరోయిన్ గా నటిస్తుంది. ఇటీవలే ఒడిశాలో షూటింగ్ పూర్తి చేశారు టీమ్. అలాగే జాన్వీ ప్రస్తుతం రామ్ చరణ్ బుచ్చిబాబు దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమాలో హీరోయిన్ గా చేస్తుంది.



## టర్కిష్ ఐస్‌క్రీమ్ వెండర్‌కు చుక్కలు చూపించిన కీర్తిసురేష్

టర్కిష్ ఐస్‌క్రీమ్ వెండర్లు గురించి ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. ఇండియాలో ప్రతి షాపింగ్ మాల్‌లో లేదా మెట్రో సీటీలలోని విధులలో కనిపిస్తుంటారు. కేవలం ఐస్‌క్రీమ్ అమ్మడం మాత్రమే కాదు, కస్టమర్లతో ఐస్‌క్రీమ్ ఇవ్వకుండా ఒక ఆట ఆడుకుంటారు. ఐస్‌క్రీమ్ కోన్‌ను కస్టమర్‌కు ఇచ్చేలా చేసి, చివరి క్షణంలో దాన్ని తిరిగి లాగేసుకుంటారు. ఐస్‌క్రీమ్‌ను పైకి ఎత్తడం, తిప్పడం, లేదా కోన్‌ను ఖాళీగా ఇచ్చి ఆశ్చర్యపరచడం వంటివి చాలా వరకు వీడియోలలో చూసే ఉంటాము. అయితే టర్కిష్ ఐస్‌క్రీమ్ తిందాం అని షాప్‌కి వెళ్లిన స్టార్ నటి కీర్తి సురేష్‌ని చాలాసేపు ఆటపట్టించాడు ఒక ఐస్‌క్రీమ్ వెండర్. ఐస్‌క్రీమ్ ఇచ్చినట్లే ఇచ్చి తీసుకోవడం. మళ్లీ కోన్ కీర్తి సురేశ్ చేతిలో పెట్టడం చేశాడు. చివరగా కీర్తి చేతిలో ఐస్‌క్రీమ్ పెట్టాడు. అయితే ఐస్‌క్రీమ్ ఇచ్చిన అనంతరం అసలు ఆటను చూపించింది కీర్తి సురేష్. తన వద్ద ఉన్న డబ్బులను తీసుకోమంటూ వాళ్లు వాడిన ట్రిక్ వారిమీదే ప్రయోగించింది. కాగా ఇందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది.



## నేను వోడ్కాను తప్పితే.. దేనినీ ప్రమోట్ చేయను : రాంగోపాల్‌వర్మ

ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్ వివాదం హాట్ టాపిక్‌గా మారిన విషయం తెలిసిందే. ఇప్పటికే ఈ వ్యవహారంలో పలువురు తెలుగు సినీ సెలబ్రిటీలతో పాటు, యూట్యూబర్లు, ఇన్‌ఫ్లుయెన్సర్లపై కేసులు నమోదయ్యాయి. అయితే తాజాగా ఈ వివాదంపై ప్రముఖ దర్శకుడు రామ్ గోపాల్ వర్మ తనదైన శైలిలో స్పందించాడు. రామ్ గోపాల్ వర్మ నిర్మాణంలో వస్తున్న తాజా చిత్రం శారీ. యథార్థ సంఘటనల ఆధారంగా వస్తున్న ఈ చిత్రంలో ఆరాధ్య దేవి కథానాయికగా నటిస్తుంది. వర్మ ఈ సినిమాకు కథను అందించగా.. గిరి కృష్ణకమల్ దర్శకత్వం వహించాడు. ఆర్వీప్రొడక్షన్స్ పతాకంపై రవి వర్మ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తెలుగు, హిందీ, తమిళ, మలయాళ భాషల్లో ఈ చిత్రాన్ని ఏప్రిల్ 04న ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు మేకర్స్. ఈ సందర్భంగా ప్రమోషన్స్ నిర్వహించింది చిత్రయూనిట్. ఈ వేడుకలో ఆర్జీవీ బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్ గురించి మాట్లాడుతూ.. నేను బెట్టింగ్ యాప్స్ గురించి తెలియదు. ఎందుకంటే ఇంతకుమందు కూడా నేను ఎటువంటి యాడ్‌లలో నటించలేదు. అలాగే నా సోషల్ మీడియా అకౌంట్స్‌ని కూడా ప్రమోషన్‌కి వాడలేదు. ఒకవేళ నేను ప్రమోట్ చేయాలి అనుకుంటే వోడ్కానే ప్రమోట్ చేస్తా.. బెట్టింగ్ యాప్స్ కాదు. ఎందుకంటే కొన్ని ప్రమోట్ చేయాలంటే అవి లీగలా కాదా అనేది ఎవరికి తెలిసి ఉండదు. ప్రభుత్వం ఇవి లీగల్ అని ప్రజలకు అవగాహన కల్పించాలి. స్టార్ నటులను తీసుకుంటే బెట్టింగ్ యాప్స్ కాకుండా చాలా బ్రాండ్‌లను ప్రమోట్ చేస్తూ ఉంటారు. అవి లీగల్ అని ఎలా తెలుస్తది. సడన్‌గా ఒకరోజు వచ్చి అవి ప్రమోట్ చేయడం నేరం అంటారు. ప్రభుత్వం అవేర్‌నెస్ క్రియేట్ చేయాలంటూ ఆర్జీవీ చెప్పుకోచ్చాడు.



## అప్పటికీ.. ఇప్పటికీ శ్రీయది ఒకటే అందం

టాలీవుడ్ సీనియర్ నటి శ్రీయా శరన్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. అందం, అభినయం ఈ ముద్దుగుమ్మ సొంతం. ఒకప్పుడు వరస సినిమాలతో మంచి ఫేమ్ సంపాదించుకుంది ఈ చిన్నది. తెలుగు చిత్ర పరిశ్రమలో అందరి స్టార్ హీరోల సరసన నటించడమే కాకుండా లేడీ ఓరియెంటెడ్ ఫిల్మ్స్‌తో కూడా తన సత్తా చాటింది. ఇక చాలా కాలంగా ఈ బ్యూటీ అంతగా సినిమాలు చేయడం లేదు. ముఖ్యంగా కరోనా తర్వాత సినిమాలకు గుడ్ బై చెప్పి తన కూతురును చూసుకుంటూ ఉంది. ఈ మధ్య ఈ అమ్మడు పలు సినిమాల్లో స్పెషల్ పాత్రల్లో కనిపిస్తూ సందడి చేస్తుంది. ఇక సినిమాల్లో కంటే ఈ బ్యూటీ ఈ మధ్య సోషల్ మీడియాలో ఫుల్ యాక్టివ్‌గా ఉంటుంది. వరస ఫొటో షూట్స్‌తో కుర్రకారు మతిపొగొడుతుంది. తాజాగా ఈ ముద్దుగుమ్మ పింక్ కలర్ డ్రెస్‌లో సరికొత్త లుక్‌లో దర్శనం ఇచ్చింది. కుర్ర హీరోయిన్స్‌కు ఏ మాత్రం తీసిపోకుండా తన అందంతో మాయ చేస్తుంది ఈ చిన్నది.

### సోషల్‌మీడియాలో ఫొటోలతో మేఘాఆకాశ్ హల్‌చల్

టాలీవుడ్ హీరోయిన్ మేఘా ఆకాష్‌కు యూత్‌లో మంచి ఫాలోయింగ్ ఉందన్న సంగతి తెలిసిందే. కొన్నాళ్లుగా సినిమాల్లో సైలెంట్ అయిన ఈ బ్యూటీ సోషల్ మీడియాలో మాత్రం చాలా యాక్టివ్‌గా ఉంటుంది. ఏ అమ్మడి అందానికి కుర్రాళ్ళు ఫిదా అవుతున్నారు. నితిన్ నటించిన లై సినిమాతో తెలుగు తెరకు కథానాయికగా పరిచయమైంది ఈ బ్యూటీ. ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్ కాగా.. అందం, అభినయంతో మంచి మార్కులు కొట్టేసింది మేఘా. మొదటి సినిమాతోనే తెలుగు అడియన్స్ కు దగ్గరైంది. కానీ ఆ తర్వాత కథానాయికగా అనుకున్నంతగా అవకాశాలు మాత్రం రాలేదు. ఈ మూవీ తర్వాత మరోసారి నితిన్ సరసన ఛల్ మోహన్ రంగ చిత్రంలో నటించినప్పటికీ ఈ మూవీ కూడా నిరాశపరిచింది. కానీ నటన పరంగా మేఘా ఆకట్టుకుంది.



Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) Editor: B.Srinivas, RNI NO. APTEL/2006/18964, Cell : 7989575563, Mail:thecrimenews123@gmail.com